VELTHURU TELUGU DAILY

# వెలుతురు

తెలుగు దిన పత్రిక

రంగారెడ్డి, నల్గొండ : సోమవారం 06.07.2026

సంపుటి : 08 సంచిక : 27 , పేజీలు : 12 , వెల:రూ . 5/-

SRI SHANTHI PUBLICATIONS PUBLISHED FROM TELANGANA | ANDHRAPRADESH

www.velthuru.com



వ్యవసాయంలో సాంకేతిక విప్లవం.. ఫర్టిలైజర్ యాప్‌కు విశేష స్పందన: మంత్రి తుమ్మల

2

# తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఆషాఢ బోనాల మహోత్సవాలు





- ఆషాఢ బోనాల సందర్భంగా జూలై 16 నుంచి హైదరాబాద్ హెచ్ఎండీఏ గ్రౌండ్స్‌లో చేతివృత్తి కళాకారుల వస్తు ప్రదర్శన అమ్మకాలు ప్రారంభం
- రాష్ట్రవ్యాప్తంగా అన్ని సంప్రదాయ కులవృత్తుల కళాకారులకు స్టాల్స్
- బోనాల మట్టి కుండలు తదితర వస్తువులు

**ప్రజలు కొనుగోలు చేసి చేతివృత్తులను ప్రోత్సహించాలి - మంత్రి పొన్నం ప్రభాకర్**

**హైదరాబాద్, వెలుతురు జూలై 5:**

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఆషాఢ బోనాల మహోత్సవాల సందర్భంగా జూలై 16 నుంచి హైదరాబాద్‌లోని హెచ్ఎండీఏ గ్రౌండ్స్ (పెద్ద అంబేద్కర్ విగ్రహం పక్కన) రాష్ట్రస్థాయి చేతివృత్తి కళాకారుల వస్తు ప్రదర్శన అమ్మకాల మేళా నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. బోనాల పండుగకు అవసరమైన అన్ని రకాల చేతివృత్తుల ఉత్పత్తులు ఒకే వేదికపై ప్రజలకు అందుబాటులో ఉండేలా ఈ మేళాను ఏర్పాటు చేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. తెలంగాణ సంప్రదాయ కళలు, గ్రామీణ వృత్తిదారులకు ఈ మేళా గొప్ప వేదికగా నిలుస్తుందని, బోనాలు కేవలం ఆధ్యాత్మిక ఉత్సవమే కాకుండా తెలంగాణ సంస్కృతి, కళలు, చేతివృత్తుల వైభవాన్ని ప్రతిబింబించే మహోత్సవమని అన్నారు.

▶ మిగతా 2లో

# ప్రజల జీవితాల్లో మార్పే మా ప్రభుత్వ లక్ష్యం: భట్టి విక్రమార్క

- పాలన అంటే ప్రజల సమస్యల పరిష్కారమని వ్యాఖ్య
- ప్రతి నిర్ణయంలో పేదల సంక్షేమానికే ప్రాధాన్యం
- రైతులు, విద్యార్థులు, మహిళలపై ప్రత్యేక దృష్టి
- ప్రజల అవసరాలకే అనుగుణంగా నిర్ణయాలన్నారు
- సన్నబియ్యం పంపిణీ వెనుక మానవీయ ఆలోచన



2

- కోటి 15 లక్షల కుటుంబాలకు నాణ్యమైన బియ్యం లక్ష్యం
- పేదలకు కూడా మెరుగైన జీవన ప్రమాణాలే ధ్యేయం

# కన్నెపల్లి నుంచి లక్ష క్యూసెక్కుల నీరు వృథా..

- ప్రభుత్వం స్పందించకపోతే 60 వేల మందితో ముట్టడిస్తాం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కేటీఆర్
- కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి లక్ష క్యూసెక్కుల నీరు వృథాగా కిందికి పోతోందని ఆరోపణ
- కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా రాష్ట్రవ్యాప్తంగా నీరు అందించొచ్చని వ్యాఖ్య
- కేసీఆర్‌కు వారం రోజులు ప్రాజెక్టు అప్పగిస్తే తెలంగాణ మొత్తానికి నీరం



2

దిస్తారని వెల్లడి

- రైతులు కన్నెపల్లికి వచ్చి పరిస్థితి చూసి ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని పిలుపు

# పదేళ్లలో ఇరిగేషన్ శాఖ నాశనం

- రూ.1.81 లక్షల కోట్లు ఖర్చు చేసి తక్కువ ఆయకట్టే ఇచ్చారన్నారు
- కాళేశ్వరం ప్రజల కోసం కాదు.. లాభాల కోసమే నిర్మించారన్నారు
- నాసిరక నిర్మాణంతో మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల దెబ్బతిన్నాయని వ్యాఖ్య



2

# హైదరాబాద్ మెట్రో ఫేజ్-2 వేగం పెంచండి

- కేంద్ర మంత్రులు ఖట్టర్, కిషన్‌రెడ్డికి సీఎం రేవంత్ రెడ్డి లేఖలు
- ఫేజ్-2కు వెంటనే అనుమతులు ఇవ్వాలని విజ్ఞప్తి
- మెట్రో ఫేజ్-1 స్వాధీనం వేగవంతం చేయాలని డిమాండ్



2

- ఎస్‌బీఐ క్యాప్స్ నియామకంలో జాప్యంపై ఆందోళన

# యూపీలో ఎన్డీయే ఘన విజయం ఖాయం: నితిన్ నబిన్

- మోదీ, యోగి డబుల్ ఇంజిన్ ప్రభుత్వ సేవలపై ప్రజలకు విశ్వాసం పెరిగిందన్న నితిన్ నబిన్
- లఖ్‌నవూలో పార్టీ నేతలు, ఎన్డీయే భాగస్వాములతో కీలక సమావేశం
- ఎన్నికల వ్యూహాలు, సంస్థాగత బలోపేతంపై దిశానిర్దేశం
- ఉత్తర్‌ప్రదేశ్‌ను అభివృద్ధి పథంలో నిలబెట్టేందుకు కూటమి కృషి చేసిందన్న బీజేపీ
- 2017 విజయాన్ని 2027లో పునరావృతం చేస్తామని కేశవ్ ప్రసాద్ మౌర్య వ్యాఖ్య



3

- వచ్చే 21 ఏళ్ల పాటు ఎన్డీ అధికారానికి దూరంగానే ఉంటుందని జోస్యం
- గూండాయిజం, వంశపారంపర్య రాజకీయాలను ప్రజలు తిరస్కరిస్తున్నారని విమర్శ

# బీజేపీ అధికారంలోకి వస్తే ఫాతిమా సంస్థలను కూల్చేస్తాం: బండి సంజయ్

- కాంగ్రెస్ అండతోనే ఒవైసీ బరితెగిస్తున్నారని విమర్శ
- ఫాతిమా విద్యాసంస్థలపై చర్యలు ఎందుకు లేవని ప్రశ్న
- ప్రశ్నలకు ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్
- టీఎల్ ఆక్రమణలపై ఒకే విధమైన చర్యలు తీసుకోవాలన్నారు
- ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తామని హామీ

**హైదరాబాద్ వెలుతురు జూలై 05:**



కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీపై తీవ్ర విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ మద్దతుతోనే ఒవైసీ బరితెగించి మాట్లాడుతున్నారని, హైకోర్టునే ప్రశ్నించేలా, బెదిరించేలా వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపించారు. కోర్టులు, చట్టాల పట్ల ఎంఐఎంకు గౌరవం లేదని విమర్శించారు.

▶ మిగతా 10లో

# శాంతి దిశగా అమెరికా -ఇరాన్ చర్చలు



2

- ఇస్లామాబాద్ వేదికగా తదుపరి చర్చలు
- జూలై 11 నుంచి దౌత్య ప్రక్రియ పునఃప్రారంభం

# ముంబయిని ముంచెత్తిన జలప్రళయం



- 300 మి.మీ దాటి రికార్డు వర్షపాతం
- మహానగరానికి 'రెడ్ అలర్ట్' జారీ

3

# మూడోసారి నేనే అధ్యక్షుడిని

- యూఎస్ ప్రెసిడెంట్ ట్రంప్ వ్యాఖ్యలు..
- మళ్లీ రాజుకున్న 2020 ఎన్నికల వివాదం
- అమెరికా స్వాతంత్ర్య వేడుకల్లో డొనాల్డ్ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు
- తాను మూడోసారి అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నానని వ్యాఖ్య
- 2020 ఎన్నికల్లో తన విజయాన్ని దోచుకున్నారని మరోసారి ఆరోపణ



10

- వెంటనే నవ్వుకుంటూ వివాదాల జోలికి వెళ్లకుండా వ్యాఖ్యానించిన ట్రంప్

# 48 గంటల్లో రేషన్ కార్డు ఇస్తాం: మంత్రి పొన్నం

- 361 మందికి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పట్టాల పంపిణీ
- అర్హులు దరఖాస్తు చేస్తే రెండు రోజుల్లోనే రేషన్ కార్డు
- నాంపల్లి, చాంద్రాయణగుట్ట లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు
- 361 మందికి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపు



- సన్నబియ్యం పంపిణీ విజయవంతంగా కొనసాగుతోందన్నారు
- ఓఆర్ఆర్ పరిధిలో లక్ష ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం

3

# వ్యవసాయంలో సాంకేతిక విప్లవం.. ఫర్టిలైజర్ యాప్‌కు విశేష స్పందన: మంత్రి తుమ్మల

- వ్యవసాయంలో సాంకేతిక విప్లవానికి తెలంగాణ ప్రభుత్వం శ్రీకారం
- ఫర్టిలైజర్ యాప్‌కు రైతుల నుంచి అనూహ్య స్పందన
- యాప్‌తో యూరియా పంపిణీలో అక్రమాలకు అడ్డుకట్ట వేస్తామన్న మంత్రి
- రాష్ట్రంలో 3.39 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నట్లు వెల్లడి
- ఇప్పటి వరకు 2.52 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా విక్రయాలు జరిగినట్లు వివరాలు
- 17.70 లక్షల మంది రైతులు యాప్ ద్వారా యూరియా బుకింగ్ చేసినట్లు ప్రకటన
- 59.78 లక్షల యూరియా బ్యాగులు బుక్.. 52.86 లక్షల బ్యాగుల కొనుగోలు పూర్తి
- భూమి ఆధారిత పంపిణీతో నిజమైన రైతులకే ఎరువులు అందజేస్తామని స్పష్టం
- ఏఐ, శాటిలైట్ ఆధారిత సాంకేతికతను వ్యవసాయంలో వినియోగించనున్న ప్రభుత్వం
- రైతు సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి

**తుమ్మల పునరుద్ఘాటన**

**హైదరాబాద్ వెలుతురు జూలై 05:**

వ్యవసాయంలో సాంకేతిక విప్లవానికి తెలంగాణ ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన.. ఫర్టిలైజర్ యాప్‌కు రైతుల నుంచి అనూహ్య స్పందన లభించిందన్నారు. ఈ యాప్ ద్వారా యూరియా పంపిణీలో అక్రమాలకు అడ్డుకట్ట వేయవచ్చని ధీమా వ్యక్తం చేశారు.

ప్రతిరోజూ జిల్లాల వారీగా యూరియా బులెటిన్లు విడుదల చేస్తామని వెల్లడించారు.ప్రస్తుతం రాష్ట్రంలో 3.39 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని మంత్రి తెలిపారు. ఇప్పటి వరకు 2.52 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా విక్రయాలు జరిగాయని చెప్పారు. 17.70 లక్షల మంది రైతులు ఫర్టిలైజర్ యాప్ ద్వారా యూరియా బుకింగ్ చేసుకున్నారని, మొత్తం 59.78 లక్షల యూరియా బ్యాగులు బుక్ కాగా అందులో 52.86 లక్షల బ్యాగుల కొనుగోలు పూర్తయిందని వివరించారు.భూమి ఆధారిత యూరియా పంపిణీ విధానం ద్వారా నిజమైన రైతులకే ఎరువులు అందేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి స్పష్టం చేశారు. బ్లాక్ మార్కెటింగ్, అక్రమ నిల్వలపై ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టిందని, నిఘాను కూడా మరింత పెంచినట్లు వెల్లడించారు.శాటిలైట్ ఆధారిత మట్టి పరీక్షలపై ప్రయోగాలు కొనసాగుతున్నాయని, వ్యవసాయంలో కృత్రిమ మేధ , ఉపగ్రహ సాంకేతికత వినియోగానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. వ్యవసాయ సాంకేతికతపై జర్మనీలో అంతర్జాతీయ సంస్థలతో చర్చలు జరుపుతున్నామని తెలిపారు. రైతు సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పునరుద్ఘాటించారు.

# ప్రజల జీవితాల్లో మార్పే మా ప్రభుత్వ లక్ష్యం: భట్టి విక్రమార్క

- ప్రజల కష్టాలు తెలిసిన నాయకుడే రేవంత్ అన్నారు
- సీఎం పనితీరుపై ప్రశంసలు కురిపించిన ఉప ముఖ్యమంత్రి

**హైదరాబాద్ వెలుతురు జూలై 05:**

పాలన అంటే కేవలం అధికారులతో సమావేశాలు నిర్వహించి వారు సిద్ధం చేసిన ఫైళ్లపై సంతకాలు చేయడం కాదని, ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడమే అసలైన పాలన అని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో కలిసి పనిచేస్తున్న అనుభవంతో ఆయన పాలనపై తన అభిప్రాయాలను వెల్లడించారు.రాష్ట్ర ప్రభుత్వం తీసుకునే ప్రతి కీలక నిర్ణయం, బడ్జెట్ రూపకల్పన, కేబినెట్ సమావేశాల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజల సంక్షేమానికే అధిక ప్రాధాన్యం ఇస్తారని భట్టి తెలిపారు. అధికారులు సూచించిన అంశాలను యథాతథంగా ఆమోదించడం కాకుండా, ప్రజల అవసరాలు ఏమిటో తెలుసుకుని వాటికి అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవాలని సీఎం భావిస్తారని చెప్పారు.తాము వచ్చిన నేల, రైతుల కష్టాలు, భూమిలేని పేదల బాధలు, ఆకలితో పాఠశాలకు వెళ్లే పిల్లల పరిస్థితి తెలుసు కాబట్టే ప్రజలు తమకు అధికారం ఇచ్చారని ముఖ్యమంత్రి తరచూ చెబుతుంటారని భట్టి పేర్కొన్నారు. అందుకే ప్రతి నిర్ణయంలో రైతు, పేదవాడు, విద్యార్థి, మహిళ, మధ్యతరగతి కుటుంబాల సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా ఉంటుందని వివరించారు.

పాలమూరు జిల్లా బిడ్డగా ఆకలి విలువ తెలిసిన వ్యక్తిగా రాష్ట్రంలో ఏ కుటుంబమూ నాసిరకం బియ్యం తినకూడదన్న ఆలోచనతోనే కోటి 15 లక్షల కుటుంబాలకు సన్నబియ్యం అందించాలని ముఖ్యమంత్రి నిర్ణయించారని భట్టి తెలిపారు. మంచి బియ్యం ధనవంతులకే పరిమితం కాకుండా పేదల ఇళ్లలో కూడా ఉండాలని, మధ్యతరగతి కుటుంబాలు గౌరవంగా జీవించే పరిస్థితులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన అన్నారు. ప్రజల జీవన ప్రమాణాలను పెంచే నిర్ణయాలు ప్రజల కష్టాలు తెలిసిన నాయకుడికే సాధ్యమవుతాయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని భట్టి విక్రమార్క ప్రశంసించారు.

# పదేళ్లలో ఇరిగేషన్ శాఖ నాశనం

- ప్రాజెక్టు పునాది తప్పుగా ఉందని అధికారుల నివేదిక ప్రస్తావన
- కేటీఆర్ వ్యాఖ్యలను ఖండించిన మంత్రి ఉత్తమ్
- తుమ్మడిహెట్టి ప్రాజెక్టును కావాలనే పక్కన పెట్టారన్నారు
- కమీషన్ల కోసమే డిజైన్ మార్చారని ఆరోపణ
- కాంగ్రెస్ ప్రభుత్వం ఇరిగేషన్‌ను గాడిలో పెడుతోందని వ్యాఖ్య

**హైదరాబాద్ వెలుతురు జూలై 05:**

పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ ప్రజల జీవితాలను తాకట్టు పెట్టారని, ముఖ్యంగా నీటిపారుదల శాఖను పూర్తిగా దెబ్బతీశారని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి విమర్శించారు. ఆదివారం సచివాలయంలో కాళేశ్వరం ప్రాజెక్టుపై మీడియాతో మాట్లాడిన ఆయన, బీఆర్ఎస్ నాయకులు ఏది ముట్టుకున్నా అది నాశనమేనని తీవ్రస్థాయిలో ఆరోపించారు.కాళేశ్వరం ప్రాజెక్టును తెలంగాణ రైతుల అవసరాల కోసం కాకుండా భారీ రుణాలు తీసుకొచ్చి కొందరి ప్రయోజనాల కోసం నిర్మించారని ఉత్తమ్ ఆరోపించారు. రూ.1.81 లక్షల కోట్లు ఖర్చు చేసినప్పటికీ నామమాత్రపు ఆయకట్టుకే నీరు అందించగలిగారని, ప్రాజెక్టులోని అనేక పనులు ఇప్పటికీ అసంపూర్తిగానే ఉన్నాయని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇరిగేషన్ శాఖను గాడిలో పెట్టే చర్యలు చేపట్టామని తెలిపారు.కాళేశ్వరం ప్రాజెక్టు కేసీఆర్ హయాంలోనే నిర్మించారని, అదే హయాంలో దాని నిర్మాణ లోపాలు బయటపడ్డాయని ఇంజినీర్ల నివేదికలు చెబుతున్నాయని మంత్రి పేర్కొన్నారు. కన్నెపల్లి పంప్‌హౌస్ వద్దకు వెళ్లి ప్రాణహిత పంపులను ఆన్ చేయాలని మాజీ మంత్రి కేటీఆర్ చెప్పడం ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నమేనని విమర్శించారు. ప్రాజెక్టును సక్రమంగా నిర్మించి ఉంటే ఈ పరిస్థితి వచ్చేదే కాదన్నారు.నాసిరక నిర్మాణం కారణంగానే మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు పూర్తిస్థాయిలో ఉపయోగించలేని పరిస్థితి ఏర్పడిందని ఉత్తమ్ తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు పునాది రూపకల్పనలోనే లోపాలున్నాయని అధికారుల నివేదికలు పేర్కొన్నాయని చెప్పారు. జాతీయ, అంతర్జాతీయ నీటి నిపుణులు కూడా ఇదే విషయాన్ని వెల్లడించారని, ప్రస్తుత పరిస్థితుల్లో ప్రాజెక్టులో పూర్తిస్థాయిలో నీటిని నిల్వ చేస్తే దిగువ ప్రాంతాల ప్రజలకు ప్రమాదం ఏర్పడే అవకాశం ఉందని హెచ్చరించారు.కమీషన్ల కోసం తుమ్మడిహెట్టి ప్రాజెక్టును పక్కనపెట్టి మేడిగడ్డకు డిజైన్ మార్చారని ఉత్తమ్ ఆరోపించారు. అలా చేయకుండా ఉంటే ఉత్తర తెలంగాణ ఎప్పుడో సస్యశ్యామలం అయ్యేదని అన్నారు. తెలంగాణ ప్రజలకు అన్యాయం చేసింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, కాంగ్రెస్‌కు మంచి పేరు వస్తుందనే ఉద్దేశంతోనే ప్రాజెక్టు రూపకల్పనను మార్చారని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి విమర్శించారు.

# కన్నెపల్లి నుంచి లక్ష క్యూసెక్కుల నీరు వృథా..

- స్పందించకపోతే 60 వేల మందితో పంప్‌హౌస్‌ను ముట్టడించి పంపులు ఆన్ చేస్తామని హెచ్చరిక

**కన్నెపల్లి వెలుతురు జూలై 05:**

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి లక్ష క్యూసెక్కుల నీరు వృథాగా కిందికి పోతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ఆరోపించారు. బీడు భూములకు నీరు అందించాలనే ఆలోచనతోనే కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించారని చెప్పారు. మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించి ఈ ప్రాజెక్టును నిర్మించామని పేర్కొన్నారు.కన్నెపల్లి పంప్‌హౌస్‌ను కేటీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ బృందం సందర్శించింది. అంతకుముందు పలుచోట్ల కేటీఆర్ కాన్వాయ్‌ను పోలీసులు అడ్డుకోవడంతో బీఆర్ఎస్ నేతలు, పోలీసుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది.పంప్‌హౌస్‌ను పరిశీలించిన అనంతరం మీడియాతో మాట్లాడిన కేటీఆర్, ఎన్నో అడ్డంకులు దాటుకుని కన్నెపల్లికి వచ్చామని, రాజకీయ విమర్శల కోసం తాము రాలేదని అన్నారు. కేసీఆర్ నాలుగేళ్లలో 141 టీఎంసీల నిల్వ సామర్థ్యంతో కాళేశ్వరం ప్రాజెక్టును పూర్తి చేశారని తెలిపారు.ఉమ్మడి రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాలు మినహా రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు కాళేశ్వరం ద్వారా నీరు అందించవచ్చని కేటీఆర్ చెప్పారు. వర్షాలు లేకపోయినా కన్నెపల్లి వద్ద నీరు అందుబాటులో ఉంటుందని, కేసీఆర్‌కు వారం రోజులు కాళేశ్వరం ప్రాజెక్టు అప్పగిస్తే తెలంగాణ మొత్తం నీటి సమస్యను పరిష్కరిస్తారని వ్యాఖ్యానించారు.రైతులు కన్నెపల్లికి వచ్చి పరిస్థితిని స్వయంగా పరిశీలించి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని ఆయన పిలుపునిచ్చారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉంటే ఇలాంటి పరిస్థితి వచ్చేదా అని ప్రశ్నించారు. సాగునీటితో పాటు హైదరాబాద్‌కు తాగునీటి సమస్య కూడా నెలకొంటోందని ఆందోళన వ్యక్తం చేశారు.ప్రభుత్వంపై అందరూ కలిసి ఒత్తిడి తీసుకురావాలని, అయినా స్పందించకపోతే 60 వేల మంది రైతులతో కలిసి కన్నెపల్లి పంప్‌హౌస్‌ను ముట్టడించి పంపులను ఆన్ చేస్తామని కేటీఆర్ హెచ్చరించారు. రైతుల కంటే ప్రభుత్వానికి మరే అంశం ముఖ్యమై ఉండకూడదని ఆయన అన్నారు.

# హైదరాబాద్ మెట్రో ఫేజ్-2 వేగం పెంచండి

- టీఓఆర్ ఖరారులో ఆలస్యం సరికాదన్న సీఎం
- జాప్యంతో ఫేజ్-1 నిర్వహణకు ఇబ్బందులు
- ఫేజ్-2 డీపీఆర్‌ల ఆమోదం ఆలస్యమవుతోందని వ్యాఖ్య
- ప్రాజెక్టు వ్యయం పెరిగే ప్రమాదముందని హెచ్చరిక

**హైదరాబాద్ వెలుతురు జూలై 05:**

హైదరాబాద్ మెట్రో రైల్ ఫేజ్–2 విస్తరణకు కేంద్ర అనుమతులు త్వరగా మంజూరు చేయడంతో పాటు, మెట్రో ఫేజ్–1ను తెలంగాణ ప్రభుత్వం స్వాధీనం చేసుకునే ప్రక్రియను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్, కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డికి విడివిడిగా లేఖలు రాశారు.ఇటీవల జూన్ 23, 24 తేదీల్లో కేంద్ర మంత్రులతో జరిగిన సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాలను ముఖ్యమంత్రి లేఖల్లో గుర్తు చేశారు. మెట్రో ఫేజ్–1 ఆస్తుల విలువ నిర్ధారణ, అధిక వడ్డీ రుణాల పునర్వ్యవస్థీకరణ, ఫేజ్–2కు అవసరమైన నిధుల సమీకరణపై అధ్యయనం చేసేందుకు కేంద్ర నోడల్ ఏజెన్సీ ఎస్‌బీఐ క్యాప్స్‌ను నియమించాలని అప్పుడే నిర్ణయించినట్లు పేర్కొన్నారు.అయితే ఇప్పటివరకు టర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్ (టీఓఆర్) ఖరారు చేయకపోవడంతో పాటు ఎస్‌బీఐ క్యాప్స్‌కు అధికారికంగా బాధ్యతలు అప్పగించడంలో జాప్యం జరుగుతోందని సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. దీనివల్ల మెట్రో ఫేజ్–1 నిర్వహణలో ఇబ్బందులు ఏర్పడుతున్నాయని, ఫేజ్–2 డీపీఆర్‌ల ఆమోదం, నిధుల సమీకరణ కూడా ఆలస్యమవుతోందని తెలిపారు.

ఈ జాప్యం కొనసాగితే ప్రాజెక్టు వ్యయం పెరిగే అవకాశం ఉందని హెచ్చరించారు.హైదరాబాద్ భవిష్యత్ రవాణా అవసరాల దృష్ట్యా మెట్రో ఫేజ్–2 విస్తరణ కీలకమని పేర్కొన్న ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రులు వ్యక్తిగతంగా జోక్యం చేసుకుని ఎస్‌బీఐ క్యాప్స్ నియామక ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. దీంతో మెట్రో ఫేజ్–1 స్వాధీనం ప్రక్రియ పూర్తై, ఫేజ్–2 విస్తరణ పనులు ఎలాంటి జాప్యం లేకుండా ముందుకు సాగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

# తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే...

**(మొదటి పేజీ తరువాయి)**

రాష్ట్రవ్యాప్తంగా కుమ్మరి, కమ్మరి, వడ్రంగి, విశ్వబ్రాహ్మణ, పద్మశాలి, నేత కళాకారులు, బంగారు పనివారు, రాతి శిల్పులు, బుట్టల తయారీదారులు, తోలు కళాకారులు తదితర సంప్రదాయ కులవృత్తులకు చెందిన కళాకారులు తమ ఉత్పత్తులను నేరుగా ప్రజలకు విక్రయించే అవకాశాన్ని ఈ మేళా కల్పిస్తోందని తెలిపారు.

బోనాల సందర్భంగా అవసరమయ్యే మట్టి బోనం కుండలు, మట్టి దీపాలు, వెదురు బుట్టలు, గంపలు, జల్లెడలు, పిత్తళి ,రాగి చెంబులు, కలశాలు, ఘటాలు, గంటలు, పూజా సామగ్రి, వెదురు అలంకరణ వస్తువులు, పూల దండలు, తోరణాలు, బోనం అలంకరణ వస్త్రాలు, గాజులు, పూసల అలంకరణ సామగ్రి, పోతురాజు ఉపయోగించే కొరడాలు, కాళ్ల గజ్జెలు, డప్పులు, డోలు వంటి సంప్రదాయ వాద్యాలు, చెక్కతో తయారుచేసిన పూజా పీటలు, చిన్న మండపాలు తదితర అనేక వస్తువులు ఈ మేళాలో అందుబాటులో ఉంటాయని మంత్రి వివరించారు.

బోనాల పండుగతో కుమ్మరి, మేదరి, కంసాలి, వడ్రంగి, డప్పు కళాకారులు, పూల వ్యాపారులు, వస్త్ర కళాకారులు తదితర వేలాది మంది సంప్రదాయ చేతివృత్తిదారులకు ఉపాధి లభిస్తుందని, ఈ మేళా వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పడటమే కాకుండా తెలంగాణ సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షించడంలో కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు.గత ఏడాదితో పోలిస్తే ఈసారి మరింత ఎక్కువ మంది చేతివృత్తి కళాకారులకు అవకాశం కల్పిస్తూ, అధిక సంఖ్యలో స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నామని మంత్రి తెలిపారు.

గతంలో కుమ్మరి, మేదరి, వడ్రంగి, గీత కార్మికులు, పూసల కళాకారులు, కంచరి, నేత తదితర వృత్తులవారు విజయవంతంగా తమ ఉత్పత్తులను విక్రయించారని, ఈసారి ఇంకా ఎక్కువ కులవృత్తులకు ప్రాధాన్యం కల్పిస్తున్నామని చెప్పారు.

ప్రజా ప్రభుత్వం చేతివృత్తుల పరిరక్షణకు, సంప్రదాయ కళాకారుల జీవనోపాధి బలోపేతానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, వారి ఉత్పత్తులకు మార్కెట్ కల్పించడం, ఆదాయాన్ని పెంచడం, యువతను సంప్రదాయ వృత్తుల వైపు ప్రోత్సహించడం ఈ మేళా ప్రధాన లక్ష్యమని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. గ్రామీణాభివృద్ధి శాఖ, సెర్ప్ ఆధ్వర్యంలో వివిధ కులవృత్తుల కళాకారులకు హైదరాబాద్‌లోని హెచ్ఎండీఏ గ్రౌండ్స్‌లో నేరుగా అమ్మకాలు నిర్వహించే అవకాశం కల్పిస్తున్నామని చెప్పారు. బోనాల ఉత్సవాల సందర్భంగా నగరానికి వచ్చే లక్షలాది మంది భక్తులు ఈ మేళాను సందర్శించి చేతివృత్తుల ఉత్పత్తులను కొనుగోలు చేయడం ద్వారా కళాకారుల కుటుంబాలకు అండగా నిలవాలని మంత్రి విజ్ఞప్తి చేశారు.

మనం కొనుగోలు చేసే ప్రతి చేతి ఉత్పత్తి ఒక కళాకారుడి కుటుంబానికి భరోసా, ఒక సంప్రదాయ వృత్తికి జీవం అని పేర్కొన్న మంత్రి, తెలంగాణ సంస్కృతిని కాపాడుతూ చేతివృత్తులకు కొత్త ఊపునిచ్చే ఈ మేళాను విజయవంతం చేయడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. బోనాల ఉత్సవాల నేపథ్యంలో నిర్వహిస్తున్న ఈ రాష్ట్రస్థాయి చేతివృత్తుల మేళాను ప్రోత్సహించేందుకు రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు పాల్గొంటారని మంత్రి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు పెద్ద ఎత్తున ఈ మేళాను సందర్శించి సంప్రదాయ చేతివృత్తులను ఆదరించి విజయవంతం చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు.

# శాంతి దిశగా అమెరికా -ఇరాన్ చర్చలు

- పశ్చిమాసియాలో ఉద్రిక్తతల తగ్గింపే ధ్యేయం
- ముందడుగు వేసిన అమెరికా-ఇరాన్ దౌత్య వేత్తలు
- ఖమేనీ అంత్యక్రియల నేపథ్యంలో విరామం
- జులై 9న మషాద్‌లో ముగియనున్న అంతిమ సంస్కారాలు

**పశ్చిమాసియా వెలుతురు జూలై 05:**

రక్తపాతం, యుద్ధ మేఘాలతో నిరంతరం అట్టుడుకుతున్న పశ్చిమాసియా ప్రాంతంలో శాంతిని పునరుద్ధరించడమే లక్ష్యంగా అంతర్జాతీయ వేదికపై కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. దీర్ఘకాల శత్రుదేశాలైన అమెరికా, ఇరాన్ల మధ్య సయోధ్య కుదిర్చేందుకు జరుగుతున్న దౌత్య చర్చలు ఇప్పుడు తదుపరి అత్యంత ప్రాధాన్యత కలిగిన ఘట్టానికి చేరుకున్నాయి. వాషింగ్టన్, టెహ్రాన్ల మధ్య దశాబ్దాలుగా నలుగుతున్న తీవ్ర వివాదాలు, సరిహద్దు ఉద్రిక్తతలను చల్లబర్చేందుకు ఇరు దేశాల ప్రతినిధులు మరోసారి పట్టికపై కూర్చోవడానికి సిద్ధమవడం అంతర్జాతీయ రాజకీయాల్లో తీవ్ర ఆసక్తిని రేకెత్తిస్తోంది.అగ్రరాజ్యం అమెరికా, ఇస్లామిక్ దేశం ఇరాన్ మధ్య జరగబోయే అత్యంత కీలకమైన తదుపరి రౌండ్ చర్చలకు పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్ వేదిక కాబోతోందని అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఇరాన్ దివంగత సుప్రీం లీడర్ అంత్యక్రియల కారణంగా కొద్దిరోజుల పాటు తాత్కాలికంగా వాయిదా పడిన ఈ సాంకేతిక దౌత్య చర్చలు.. రాబోయే జులై 11వ తేదీ నుండి మళ్లీ పునఃప్రారంభం కానున్నట్లు సమాచారం. ఇస్లామాబాద్ వేదికగా జరగబోయే ఈ దౌత్య సమావేశంలో ఇరాన్ తరఫున పాల్గొనే ఉన్నత స్థాయి ప్రతినిధుల బృందం వివరాలను ఆ దేశం త్వరలోనే అధికారికంగా ప్రకటించనుంది.ఫిబ్రవరి 28వ తేదీన ఇరాన్ రాజధాని టెహ్రాన్‌పై అమెరికా మరియు ఇజ్రాయెల్ దేశాలు సంయుక్తంగా జరిపిన భారీ వైమానిక దాడుల్లో ఇరాన్ అత్యున్నత నాయకుడు (సుప్రీం లీడర్) అయతుల్లా ఖమేనీ మరణించిన సంగతి తెలిసిందే. మూడు దశాబ్దాలకు పైగా ఇరాన్‌ను ఏకఛత్రాధిపత్యంతో పాలించిన ఆయన అంతిమయాత్ర ఆదివారం నుండి మంగళవారం వరకు టెహ్రాన్, ఖోమ్ నగరాల్లో అశేష జనవాహిని మధ్య సాగనుంది. ఈ అంత్యక్రియల క్రతువు జులై 9న మషాద్ నగరంలో ముగియనుంది. ఇరాన్ దేశం మొత్తం ఈ శోకసంద్రంలో మునిగిపోవడం వల్లే అమెరికా–ఇరాన్ల మధ్య జరగాల్సిన సాంకేతిక చర్చల ప్రక్రియ స్వల్పంగా ఆలస్యమైంది.పశ్చిమాసియాలో శాంతి స్థాపనే ధ్యేయంగా జూన్ 18వ తేదీన అమెరికా, ఇరాన్ దేశాల మధ్య ఒక చారిత్రాత్మక ప్రాథమిక అవగాహన ఒప్పందం కుదిరింది. దీనిని అనుసరిస్తూ జూన్ 21న స్విట్జర్లాండ్ దేశంలో పాకిస్థాన్, ఖతార్ దేశాల సంయుక్త మధ్యవర్తిత్వంతో ఇరు పక్షాల మధ్య మొదటి విడత సాంకేతిక చర్చలు అత్యంత రహస్యంగా జరిగాయి. రెండు దేశాల మధ్య దౌత్య సంబంధాలు సవ్యంగా సాగాలన్నా, శాంతి ఒప్పందాలు కార్యరూపం దాల్చాలన్నా ఈ చర్చల పునరుద్ధరణ అత్యంత కీలకమని అంతర్జాతీయ రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.జులై 11 నుంచి ప్రారంభం కాబోయే రెండో విడత చర్చలను ఎక్కడ నిర్వహించాలనే దానిపై అంతర్జాతీయ వర్గాల్లో గట్టి కసరత్తే జరిగింది. తదుపరి చర్చల వేదిక కోసం పాకిస్థాన్‌తో పాటు స్విట్జర్లాండ్‌లోని అత్యంత రమణీయమైన, సురక్షితమైన 'బర్గెన్‌స్టాక్ రిసార్ట్' పేర్లను దౌత్య అధికారులు పరిశీలించారు. అయితే, ఇరు దేశాలకు భౌగోళికంగా, రాజకీయంగా అనుకూలంగా ఉంటుందనే ఉద్దేశంతో ఇస్లామాబాద్‌లోనే ఈ ప్రతిష్టాత్మక సమావేశం జరిగే అవకాశాలు నూటికి నూరు శాతం మెండుగా ఉన్నట్లు పాకిస్థాన్‌కు చెందిన ప్రముఖ పత్రిక 'డాన్' ఒక ప్రత్యేక కథనంలో స్పష్టం చేసింది.ఇటీవల ఖతార్ రాజధాని దోహా వేదికగా అమెరికా–ఇరాన్ల మధ్య జరిగిన పరోక్ష దౌత్య చర్చలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సానుకూలంగా స్పందించడం విశేషం. వివిధ అంతర్జాతీయ ఆంక్షల కారణంగా విదేశీ బ్యాంకుల్లో స్తంభింపజేసిన (ఫ్రీజ్ అయిన) తమ దేశానికి చెందిన వేల కోట్ల నిధుల విడుదలకు అమెరికా అంగీకరించిందని ఇరాన్ పదేపదే చెప్తోంది. అయితే, ఈ నిధుల విడుదల అంశాన్ని అగ్రరాజ్యం వాషింగ్టన్ మాత్రం ఇప్పటివరకు అధికారికంగా ధ్రువీకరించలేదు. దీంతో ఈ ఆర్థిక నిధుల విడుదలపై అంతర్జాతీయంగా ఇంకా సస్పెన్స్ కొనసాగుతూనే ఉంది.ప్రస్తుత దౌత్య చర్చల్లో రెండు ముఖ్యమైన అంశాలు ప్రధాన అజెండాగా మారాయి. ప్రపంచ చమురు రవాణాకు అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధిలో నౌకల భద్రతను కాపాడటం, అలాగే పశ్చిమాసియాలో తక్షణమే 60 రోజుల పాటు తాత్కాలిక కాల్పుల విరమణ ఒప్పందం సజావుగా సాగేలా చూడటంపై ఇరు దేశాలు చర్చిస్తున్నాయి. ఈ దౌత్య ప్రక్రియ ఎక్కడా దారి తప్పకుండా, అమెరికా–ఇరాన్లను ఒకే తాటిపైకి తెచ్చేందుకు మధ్యవర్తిత్వ దేశాలుగా వ్యవహరిస్తున్న ఖతార్ మరియు పాకిస్థాన్లు నిరంతరం దౌత్య శ్రమ చేస్తున్నాయి.రాబోయే జులై 11వ తేదీన ఇస్లామాబాద్‌లో జరిగే సాంకేతిక స్థాయి చర్చలు గనుక విజయవంతమైతే, ఈ దౌత్య సమరంలో అత్యంత కీలకమైన ముగింపు ఘట్టం ప్రారంభం కానుంది. ఈ చర్చల అనంతరం, జులై మూడో వారంలో ఖతార్ రాజధాని దోహా వేదికగా రెండు దేశాల అగ్రశ్రేణి ప్రతినిధులు, మంత్రుల స్థాయి అధికారులతో అత్యున్నత స్థాయి ప్రత్యక్ష చర్చలు జరిగే అవకాశం ఎక్కువగా ఉందని దౌత్యవర్గాలు వెల్లడించాయి. ఈ ప్రత్యక్ష చర్చలు గనుక సఫలమైతే పశ్చిమాసియాలో దశాబ్దాలుగా సాగుతున్న యుద్ధ వాతావరణానికి తెరపడి, శాంతి స్థాపన జరిగే మార్గం సుగమం కానుంది.

# బిఆర్ఎస్ వాళ్లు కమీషన్ల కోసం కాళేశ్వరం కడితే మేము పేదల కోసం ఇందిరమ్మ ఇళ్లు కడుతున్నాం

- కన్నెపల్లి పర్యటనలో కేటీఆర్ వ్యాఖ్యలకు రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఘాటు కౌంటర్



**హైదరాబాద్, ఖమ్మం వెలుతురు జూలై 05:**

కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో వేల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని దోచుకుని, నాణ్యతలేని నిర్మాణాలతో తెలంగాణ ప్రజలపై భారాన్ని మోపిన బీఆర్ఎస్ నాయకులకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించే నైతిక హక్కు లేదని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార & పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తీవ్రంగా విమర్శించారు.కన్నెపల్లి పర్యటనలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు వాస్తవాలను వక్రీకరించే ప్రయత్నమేనని మంత్రి అన్నారు. "పేదలకు ఇళ్లు కడితే కమీషన్లు రావు... కాళేశ్వరం లాంటి భారీ ప్రాజెక్టులు కడితేనే కమీషన్లు వస్తాయనే ఆలోచనతో బీఆర్ఎస్ పాలకులు పేదల గృహాల అవసరాన్ని విస్మరించారు. అందుకే నేడు తెలంగాణ ప్రజలు వారిని అధికారానికి దూరం చేశారు" అని మంత్రి వ్యాఖ్యానించారు.కాళేశ్వరం ప్రాజెక్టును నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా, కమీషన్ల కోసమే నిర్మించడం వల్లే నేడు మరమ్మతుల అవసరం వచ్చిందని మంత్రి స్పష్టం చేశారు. "అసలు రిపేరు చేయాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చింది? మీ అవినీతి, మీ కక్కుర్తే దానికి కారణం కాదా? మీరు నాసిరకం నిర్మాణాలు చేసి కూల్చేసి... ఇప్పుడు వాటిని ప్రభుత్వం బాగు చేయలేదని విమర్శించడం హాస్యాస్పదం" అని మండిపడ్డారు.కన్నెపల్లిలోకి వెళ్లి ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు చేస్తున్న బీఆర్ఎస్ నాయకుల నాటకాలను తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారని, వాస్తవాలను దాచిపెట్టి అబద్ధాలతో రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్న వారి ప్రయత్నాలు ఇక ఫలించవని అన్నారు.తెలంగాణ ప్రజల రక్తాన్ని, చెమటను దోచుకుని వేల కోట్ల అవినీతికి పాల్పడిన బీఆర్ఎస్‌కు పేదల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించే అర్హత లేదని మంత్రి స్పష్టం చేశారు.ముఖ్యమంత్రి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకం, రైతు సంక్షేమం, మహిళల సాధికారత, ఉపాధి కల్పన వంటి సంక్షేమ కార్యక్రమాలను పారదర్శకంగా అమలు చేస్తోందని, కమీషన్ల కోసం కాదు.. ప్రజల కోసం పాలన సాగిస్తున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు.

# యజ్ఞంలా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం

- పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం మంత్రి వాకిటి శ్రీహరి
- షాద్‌నగర్ నియోజకవర్గంలోని అన్నారం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభం
- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌తో కలిసి ఇళ్లను ప్రారంభించిన మంత్రి వాకిటి శ్రీహరి
- బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికే కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని వెల్లడి
- ఇందిరమ్మ ఇళ్లు, సన్నబియ్యం, ఉచిత బస్సు ప్రయాణం వంటి సంక్షేమ పథకాలను ప్రస్తావించిన మంత్రి
- ప్రభుత్వంపై ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని ఆరోపణ




**షాద్‌నగర్ వెలుతురు జూలై 05:**

షాద్‌నగర్ నియోజకవర్గం ఫరూక్‌నగర్ మండలం అన్నారం గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లను రాష్ట్ర క్రీడలు, పాడి పరిశ్రమాభివృద్ధి, పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన బంజారా మహిళలు మంత్రికి ఘన స్వాగతం పలికారు.అనంతరం మీడియాతో మాట్లాడిన మంత్రి వాకిటి శ్రీహరి.. ప్రజా ప్రభుత్వం బీద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం విశేషంగా కృషి చేస్తోందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం యజ్ఞంలా చేపట్టిందని చెప్పారు.మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తర్వాత ఇప్పుడు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అర్హులైన లబ్ధిదారులకు మళ్లీ ఇందిరమ్మ ఇళ్లను అందిస్తున్నారని మంత్రి తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లతో పాటు రేషన్ దుకాణాల ద్వారా సన్నబియ్యం పంపిణీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు వంటి అనేక సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందని పేర్కొన్నారు.షాద్‌నగర్‌కు వచ్చిన ప్రతీసారి కొత్త అనుభూతి కలుగుతుందని మంత్రి అన్నారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రజల కోసం, షాద్‌నగర్ అభివృద్ధి కోసం నిరంతరం ఆలోచిస్తున్నారని కొనియాడారు. లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ భూసేకరణ కోసం ఎమ్మెల్యే విశేషంగా కృషి చేస్తున్నారని తెలిపారు.

గత పాలకులు ఈ ప్రాంత అభివృద్ధిని పట్టించుకోలేదని ఆరోపించిన మంత్రి.. పేదల గురించి ఆలోచించే పార్టీ కాంగ్రెస్ మాత్రమేనని అన్నారు. తాము చేసిన మంచి పనులే శాశ్వతంగా నిలిచిపోతాయని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని ఆరోపిస్తూ, యువకులు, మేధావులు ఆలోచించి అలాంటి కుట్రలను తిప్పికొట్టాలని మంత్రి వాకిటి శ్రీహరి పిలుపునిచ్చారు.

# ఆరోగ్యమే మహాభాగ్యం

- నిత్య వ్యాయామమే సంపూర్ణ ఆరోగ్యానికి పునాది
- వ్యవసాయ బావిలో గంటపాటు నిరవధికంగా ఈత కొట్టి... ప్రజలకు ప్రేరణగా నిలిచిన సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు




**హైదరాబాద్ వెలుతురు జూలై 05:**

“ఆరోగ్యమే మహాభాగ్యం” అని మన పెద్దలు చెప్పిన మాట ప్రతి ఒక్కరి జీవితానికి మార్గదర్శకం. మనిషి సంపాదించే ఆస్తులు, అంతస్తుల కంటే ఆరోగ్యమే అత్యంత విలువైన సంపద. ఆరోగ్యం బాగుంటేనే కుటుంబం, సమాజం, దేశానికి మన వంతు సేవ చేయగలం. అందుకే ప్రతి ఒక్కరూ నిత్య వ్యాయామాన్ని దైనందిన జీవితంలో ఒక భాగంగా చేసుకోవాలి.ప్రజాప్రతినిధిగా ప్రజల మధ్య నిత్యం పర్యటిస్తూ, ప్రజా సమస్యల పరిష్కారానికి సమయాన్ని కేటాయిస్తూనే, నా ఆరోగ్యం కోసం ప్రతిరోజూ కనీసం ఒక గంట సమయాన్ని ఏదో ఒక వ్యాయామానికి కేటాయిస్తున్నాను. ఆదివారం రోజున ఉదయం నా వ్యవసాయ క్షేత్రంలోని బావిలో ఆగకుండా గంటపాటు ఈత కొట్టాను. నేను చేసిన ఈ చిన్న ప్రయత్నం మీ అందరిలోనూ ఆరోగ్యంపై చైతన్యం పెంచి, నిత్య వ్యాయామాన్ని జీవితంలో భాగం చేసుకునేందుకు ప్రేరణ కలిగిస్తుందని హృదయపూర్వకంగా ఆశిస్తున్నాను.నేటి వేగవంతమైన జీవనశైలి, శారీరక శ్రమ తగ్గిపోవడం, ఆహారపు అలవాట్లలో వచ్చిన మార్పుల వల్ల మానసిక, శారీరక ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయి. చిన్న వయస్సులోనే అనేక మంది అనారోగ్యానికి గురై ఆసుపత్రుల చుట్టూ తిరిగే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఈ పరిస్థితిని మార్చాలంటే ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవడం ఒక్కటే మార్గం.ప్రతిరోజూ కనీసం ఒక గంట సమయాన్ని మన ఆరోగ్యం కోసం కేటాయిద్దాం. యోగ, ధ్యానం, వాకింగ్, జాగింగ్, రన్నింగ్, స్విమ్మింగ్ లేదా ఏదైనా శారీరక వ్యాయామాన్ని క్రమం తప్పకుండా చేస్తే శరీరం దృఢంగా ఉండటమే కాకుండా మనసు ప్రశాంతంగా ఉంటుంది. వ్యాయామం ఒత్తిడిని తగ్గించి ఆత్మ విశ్వాసాన్ని పెంచుతుంది. దీనికి ప్రత్యేకంగా ఒక్క రూపాయి ఖర్చు చేయాల్సిన అవసరం కూడా లేదు.రోజుకు ఒక గంట మన ఆరోగ్యం కోసం కేటాయిస్తే... నిండు నూరేళ్లు ఆరోగ్యంగా, ఆనందంగా జీవించే అవకాశం ఉంటుంది. యువత నుంచి వృద్ధుల వరకు వయస్సుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ ఫిట్‌నెస్‌పై దృష్టి పెట్టాలి. ఆరోగ్యవంతమైన వ్యక్తులతోనే ఆరోగ్యవంతమైన కుటుంబాలు, ఆరోగ్యవంతమైన సమాజం, ఆరోగ్యవంతమైన తెలంగాణ నిర్మాణం సాధ్యమవుతుంది.ఆరోగ్యమే మహాభాగ్యం... నిత్య వ్యాయామమే ఆ మహాభాగ్యాన్ని కాపాడే మార్గం. నేటి నుంచే వ్యాయామాన్ని అలవాటు చేసుకుందాం.

# సిద్దిపేట జిల్లాలో నేడు ‘సిరో ఫార్మా’ క్యాన్సర్ ఔషధాల ప్లాంటును ప్రారంభించనున్న మంత్రి శ్రీధర్ బాబు

**హైదరాబాద్ వెలుతురు జూలై 05:**





భారతదేశపు ఫార్మా క్యాపిటల్ గా అగ్రస్థానంలో వెలుగులీనుతున్న తెలంగాణా రాష్ట్రం మరో భారీ ఔషధ పరిశ్రమకు వేదిక కానుంది. క్యాన్సర్ ఔషధాలు ఉత్పత్తి చేసే సిరో (CIRO) ఫార్మా సిద్దిపేట జిల్లా కరకపట్లలోని బయోటెక్ పార్క్-3 లో నిర్మించిన అత్యాధునిక ఉత్పత్తి కర్మాగారం సోమవారం ప్రారంభమవుతుంది. ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సిరో ప్లాంటును లాంఛనంగా ప్రారంభిస్తారు. ఈ భారీ ప్లాంటులో పలు గ్లోబల్ ఔషధ ప్రమాణాల సంస్థల కొలమానాల ప్రకారం మందులు, సాఫ్ట్ జెల్స్ ఉత్పత్తి అవుతాయి. ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, రెవిన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిలు కూడా పాల్గొంటారు. ఇక్కడ తయారయ్యే క్యాన్సర్ మందులు ప్రధానంగా అమెరికా, యూరప్, ల్యాటిన్ అమెరికా, గల్ఫ్ దేశాలకు ఎగుమతి అవుతాయి. ప్లాంటులో ప్రస్తుతం 275 మంది సిబ్బంది పనిచేస్తుండగా పూర్తి స్థాయిలో ఉత్పత్తి కార్యకలాపాలు ప్రారంభమైన తర్వాత ఉద్యోగులు, సైంటిస్టుల సంఖ్య రెట్టింపు అవుతుంది.

# ముంబయిని ముంచెత్తిన జలప్రళయం

- శనివారం రాత్రి నుంచి దంచికొట్టిన వాన
- నీటి సముద్రంగా మారిన ముంబయి
- రికార్డు స్థాయిలో కురిసిన వర్షపాతం

**ముంబయి వెలుతురు జూలై 05:**

దేశ ఆర్థిక రాజధాని ముంబయి నగరంలో ప్రకృతి ప్రకోపించింది. శనివారం రాత్రి ప్రారంభమైన కుండపోత వర్షం ఏమాత్రం విరామం లేకుండా ఎడతెరిపి లేకుండా కురుస్తూనే ఉంది. దీంతో ముంబయి నగరం ఒక్కసారిగా నీటి సముద్రాన్ని తలపిస్తోంది. ఎటు చూసినా వరద నీరు రహదారులపై ప్రవహిస్తుండటంతో జనజీవనం పూర్తిగా స్తంభించిపోయింది. నగరంలోని ప్రధాన కూడళ్లు, వీధులు చెరువులుగా మారిపోయాయి. పరిస్థితి రోజురోజుకూ విషమిస్తుండటంతో భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ముంబయి నగరంతో పాటు పొరుగునే ఉన్న రాయ్‌గఢ్ జిల్లాలకు అత్యంత ప్రమాదకరమైన 'రెడ్ అలర్ట్' ప్రకటించింది. రానున్న కొన్ని గంటల పాటు ఇదే పరిస్థితి కొనసాగే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం హెచ్చరించింది.ఈ అకాల వర్షాలు గత కొన్ని ఏళ్ల రికార్డులను తిరగరాశాయి. ముంబయిలోని పలు కీలక ప్రాంతాలలో కేవలం 23 గంటల వ్యవధిలోనే ఏకంగా 250 నుంచి 300 మిల్లీమీటర్ల కంటే ఎక్కువ వర్షపాతం నమోదైంది. ముఖ్యంగా శనివారం పగటిపూట కేవలం 12 గంటల వ్యవధిలోనే 20 సెంటీమీటర్ల మేర వాన దంచికొట్టింది. బీఎంసీ గణాంకాల ప్రకారం మలబార్ హిల్, మాండవి, కొలాబా, విక్రోలి, పోవాయి, భండప్, అంధేరి, జోగేశ్వరి, గోరేగావ్‌లోని ఆరే కాలనీ వంటి ప్రధాన ప్రాంతాలన్నీ 200 మిల్లీమీటర్లకు పైగా కురిసిన వర్షాలతో పూర్తిగా అతలాకుతలమయ్యాయి.ఈ జలవిలయానికి సముద్రపు పోటు (హైటైడ్) తోడవ్వడం నగరవాసులను మరింత కోలుకోలేని దెబ్బ తీసింది. సముద్రంలో నీటి మట్టం గరిష్ఠ స్థాయికి చేరిన సమయంలోనే ఇటు నగరంలో క్లౌడ్ బరస్ట్ తరహాలో వర్షం కురవడంతో, నగరంలోని డ్రైనేజీ నీరు సముద్రంలోకి వెళ్లే మార్గం మూసుకుపోయింది. ఫలితంగా వరద నీరు వెనక్కి తన్ని నగరంలోని లోతట్టు ప్రాంతాలన్నీ మునిగిపోయాయి. చాలా కాలనీల్లో ఇళ్లలోకి, అపార్ట్‌మెంట్ బేస్‌మెంట్లలోకి నీరు చేరింది. రోడ్లపై నడుములోతు నీరు చేరడంతో వందలాది వాహనాలు నీటిలోనే ఆగిపోయాయి. వాహనదారులు తమ వాహనాలను రోడ్లపైనే వదిలేసి సురక్షిత ప్రాంతాలకు పరుగులు తీశారు.పరిస్థితి తీవ్రతను గమనించిన మున్సిపల్ యంత్రాంగం, విపత్తు నిర్వహణ బృందాలు వెనువెంటనే రెస్క్యూ (సహాయక) చర్యలు చేపట్టాయి. నగర వ్యాప్తంగా సుమారు 10 వేల మందికి పైగా అత్యవసర సేవల సిబ్బందిని రంగంలోకి దించారు. వరద నీటిని తోడేయడానికి నగరంలోని వివిధ ప్రాంతాల్లో 448 భారీ డీవాటరింగ్ పంపులను, 19 మినీ పంపింగ్ స్టేషన్లను ఏర్పాటు చేసి యుద్ధప్రాతిపదికన నీటిని తొలగిస్తున్నారు. ముంబయితో పాటు థానే, పాల్ఘర్ జిల్లాల్లోనూ వరద తీవ్రత ఎక్కువగా ఉంది. పాల్ఘర్ జిల్లాలో వరద ఉధృతికి ఒక ఆరేళ్ల చిన్నారి కొట్టుకుపోయి ప్రాణాలు కోల్పోవడం నగరంలో తీవ్ర విషాదాన్ని నింపింది. కాగా, ప్రమాదకర ప్రాంతాల్లో చిక్కుకుపోయిన 180 మంది బాధితులను రెస్క్యూ బృందాలు సురక్షితంగా రక్షించాయి.భారీ వర్షాల ధాటికి నగరంలో పలు ఆస్తి నష్టాలు సంభవించాయి. ముంబయిలోని బేలాపూర్ ప్రాంతంలో ఉన్న ఒక పాత శిథిలావస్థ భవనానికి సంబంధించిన బాల్కనీ భాగం ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. అదృష్టవశాత్తూ ఆ సమయంలో అక్కడెవరూ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది. అయితే ఆ భవనం ప్రస్తుతం ఏ క్షణమైనా కూలిపోయేలా అత్యంత ప్రమాదకర స్థితికి చేరడంతో అధికారులు ఆ చుట్టుపక్కల వారిని ఖాళీ చేయిస్తున్నారు. నగరంలోని ప్రధాన రహదారులపై వందలాది చెట్లు విరిగిపడటం, కొన్ని చోట్ల రోడ్లు కుంగిపోవడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది.రవాణా వ్యవస్థపై ఈ వర్షాల ప్రభావం గట్టిగానే పడింది. రైల్వే పట్టాలపై నీరు చేరడంతో సెంట్రల్, వెస్ట్రన్ రైల్వేల పరిధిలోని సబర్బన్ లోకల్ రైళ్లు కొన్ని మార్గాల్లో స్వల్ప ఆలస్యంతో నడుస్తున్నాయి. అలాగే సాంకేతిక సమస్యల కారణంగా మెట్రో లైన్ 2A సేవలు కాసేపు నిలిచిపోయాయి. అయితే వెస్ట్రన్ రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ వినీత్ అభిషేక్ మాట్లాడుతూ.. తమ పరిధిలో కొన్ని చోట్ల 250 మి.మీ కంటే ఎక్కువ వర్షం పడినా, సముద్రపు పోటు ఉన్నప్పటికీ లోకల్ మరియు దూరప్రాంత రైళ్ల రాకపోకలను ఆపకుండా నిరంతరాయంగా కొనసాగించగలిగామని స్పష్టం చేశారు. మెట్రో, బెస్ట్ బస్సు సర్వీసులు కూడా ప్రయాణికులను చేరవేస్తున్నాయి.నగరంలో ఎమర్జెన్సీ పరిస్థితులు నెలకొనడంతో బృహన్‌ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ (బీఎంసీ) ప్రజలకు పలు కీలక సూచనలు జారీ చేసింది. ఆదివారం కూడా ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నందున, ప్రజలు అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావద్దని హెచ్చరించింది. వరదలు, విద్యుత్ షార్ట్ సర్క్యూట్లు, లేదా మరేదైనా అత్యవసర ప్రమాదం సంభవిస్తే ప్రజలు వెంటనే బీఎంసీ అధికారిక హెల్ప్‌లైన్ నంబర్ "1916"కు ఫోన్ చేసి సమాచారం అందించాలని, తద్వారా సహాయక బృందాలు త్వరగా చేరుకుంటాయని అధికారులు స్పష్టం చేశారు.ఇదిలా ఉంటే, ఉత్తరాది రాష్ట్రమైన హిమాచల్ ప్రదేశ్‌లో కూడా వర్షాలు విపరీతంగా కురుస్తున్నాయి. మండి జిల్లాలోని ప్రసిద్ధ బియాస్ నదిపై దట్టమైన పొగమంచు, మేఘాలు కొండలను తాకుతూ కమ్ముకోవడంతో అద్భుతమైన ప్రకృతి దృశ్యాలు ఆవిష్కృతమయ్యాయి. దీనికి సంబంధించిన డ్రోన్ వీడియోలను అధికారులు పంచుకున్నారు. అయితే ఈ అందాల వెనుక పెద్ద ప్రమాదమే పొంచి ఉందని వాతావరణ శాఖ తెలిపింది. రానున్న మూడు రోజుల్లో హిమాచల్‌లో భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అక్కడ 'ఆరెంజ్ అలర్ట్' ప్రకటించారు. ఆకస్మిక వరదలు (ఫ్లాష్ ఫ్లడ్స్), కొండచరియలు విరిగిపడే ప్రమాదం ఉన్నందున పర్యాటకులు, స్థానికులు నదీ పరివాహక ప్రాంతాలకు వెళ్లవద్దని అధికారులు హెచ్చరించారు.

# 48 గంటల్లో రేషన్ కార్డు ఇస్తాం: మంత్రి పొన్నం

- త్వరలో 2 లక్షల ఒంటరి మహిళలకు పెన్షన్లు
- సంక్షేమ పథకాలను వేగంగా అమలు చేస్తున్న ప్రభుత్వం
- అర్హులందరికీ ప్రభుత్వ పథకాల లబ్ధి అందిస్తామన్న మంత్రి
- ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని వ్యాఖ్య

**హైదరాబాద్ వెలుతురు జూలై 05:**

అర్హులైన వారు దరఖాస్తు చేసుకుంటే 48 గంటల్లోనే రేషన్ కార్డు జారీ చేస్తామని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. నాంపల్లి, చాంద్రాయణగుట్ట నియోజకవర్గాలకు చెందిన 361 మంది లబ్ధిదారులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పట్టాలను పంపిణీ చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు.ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలుకు అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి పేర్కొన్నారు. అర్హులెవరూ ప్రభుత్వ పథకాలకు దూరం కాకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని చెప్పారు. రేషన్ కార్డుల జారీ ప్రక్రియను కూడా వేగవంతం చేసినట్లు తెలిపారు.రాష్ట్ర వ్యాప్తంగా సన్నబియ్యం పంపిణీ విజయవంతంగా కొనసాగుతోందని, ఓఆర్ఆర్ పరిధిలో లక్ష ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందని మంత్రి వెల్లడించారు. అలాగే త్వరలోనే మరో రెండు లక్షల మంది ఒంటరి మహిళలకు పెన్షన్లు మంజూరు చేయనున్నట్లు ప్రకటించారు.అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధి అందేలా చర్యలు తీసుకుంటున్నామని, ప్రజాసంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు.

# యూపీలో ఎన్డీయే ఘన విజయం ఖాయం: నితిన్ నబిన్

**లఖ్‌నవూ వెలుతురు జూలై 05:**

ఉత్తర్‌ప్రదేశ్ రాజకీయాలు 2027 అసెంబ్లీ ఎన్నికల దిశగా వేడెక్కుతున్నాయి. వచ్చే ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమి అఖండ విజయాన్ని నమోదు చేయబోతోందని బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ ధీమా వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ నేతృత్వంలోని డబుల్ ఇంజిన్ ప్రభుత్వం అందిస్తున్న సేవా భావమే కూటమిని మరోసారి అధికారంలోకి తీసుకువస్తుందని అన్నారు.రెండు రోజుల ఉత్తర్‌ప్రదేశ్ పర్యటనలో భాగంగా లఖ్‌నవూలో పార్టీ పదాధికారులు, ఎన్డీయే భాగస్వామ్య పక్షాల నేతలతో నితిన్ నబిన్ కీలక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాబోయే అసెంబ్లీ ఎన్నికల వ్యూహాలు, సంస్థాగత బలోపేతంపై దిశానిర్దేశం చేశారు.అనంతరం మీడియాతో మాట్లాడిన నితిన్ నబిన్.. ఉత్తర్‌ప్రదేశ్‌ను అభివృద్ధి పథంలో నడిపించేందుకు ఎన్డీయే కూటమిలోని అన్ని పార్టీలు సమిష్టిగా పనిచేశాయని తెలిపారు. ప్రధాని మోదీ, సీఎం యోగి ఆదిత్యనాథ్ ప్రజల కోసం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజల్లో విశ్వాసం పెరిగిందని, 2027 ఎన్నికల్లో భారీ మెజారిటీతో ప్రభుత్వం ఏర్పాటు చేయడం ఖాయమని అన్నారు.యూపీ ఉప ముఖ్యమంత్రి కేశవ్ ప్రసాద్ మౌర్య కూడా ప్రతిపక్ష సమాజ్‌వాదీ పార్టీపై తీవ్ర విమర్శలు చేశారు. గుండాయిజం, వంశపారంపర్య రాజకీయాలను ప్రజలు తిరస్కరిస్తున్నారని, అభివృద్ధికి పట్టం కడుతున్నారని అన్నారు.

'వికసిత్ భారత్' లక్ష్యంతో దేశం ముందుకు సాగుతున్న నేపథ్యంలో రాబోయే 21 ఏళ్ల పాటు సమాజ్‌వాదీ పార్టీ అధికారానికి దరిదాపుల్లో కూడా ఉండదని వ్యాఖ్యానించారు. 2017లో సాధించిన చారిత్రాత్మక విజయాన్ని 2027లో పునరావృతం చేస్తామని ధీమా వ్యక్తం చేశారు.యూపీ మంత్రి భూపేంద్ర చౌదరి మాట్లాడుతూ.. సమాజ్‌వాదీ పార్టీ నేతలు కులం, భాష, ప్రాంతాల పేరుతో సమాజాన్ని విభజించి దేశాన్ని బలహీనపరచాలని చూస్తున్నారని ఆరోపించారు. నితిన్ నబిన్ పర్యటనతో బీజేపీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం నెలకొన్నదని, 2027 ఎన్నికల్లో క్లీన్ స్వీప్ లక్ష్యంగా ఇప్పటి నుంచే క్షేత్రస్థాయి వ్యూహాలను అమలు చేస్తున్నామని పార్టీ నేతలు తెలిపారు.

# అపశ్రుతుల మధ్యే సాగాలి అనంత జీవన గానం



ఒక సాయంత్రం, అలసటతో కూడిన పని ముగించుకుని ఇంటికి వెళ్తున్నప్పుడు, వాహనాల శబ్దాల మధ్య రేడియోలో ఒక పాత పాట వినిపించింది. వందల సార్లు విన్న పాటే అయినా, ఆ ప్రత్యేక క్షణంలో అది నా హృదయాన్ని వేరేలా తాకింది. బాణీ అదే, సాహిత్యం అదే, గాయకుడి గొంతులో ఉన్న ఆర్ద్రతా అదే కానీ ఆ పాట నాలో రేకెత్తించిన అనుభూతి మాత్రం ఆ రోజు సంపూర్ణంగా కొత్తగా అనిపించింది. అప్పుడే నా మనసులో ఒక ఆలోచన మెరిసింది. నిశితంగా పరిశీలిస్తే, మన జీవితం కూడా సరిగ్గా ఇలాంటి ఒక అద్భుతమైన పాటలాంటిదే కదా అనిపించింది. ఈ ప్రపంచంలో ప్రతి పాటకూ ఒక బాణీ ఉంటుంది, ఎవరో ఒకరు సాహిత్యం రాస్తారు, మరెవరో దానిని ఆలపిస్తారు. కానీ ఆ పాటకు లభించే అసలైన అర్థం, విశిష్టత మాత్రం దానిని వినేవాడి మనోభావాల లోతుల్లోనే పుడుతుంది.మానవ జీవితం విషయంలోనూ అచ్చం ఇదే సత్యం వర్తిస్తుంది. మనం ఈ భూమిపై ఎప్పుడు, ఎక్కడ పుడతామనేది మన చేతుల్లో లేని అంశం. ఏ కుటుంబంలో జన్మిస్తామో, ఏ పల్లెటూళ్ళో లేదా నగరంలో పెరుగుతామో, ఎలాంటి సామాజిక, ఆర్థిక పరిస్థితుల్లో మన బాల్యం గడుస్తుందో ఇవన్నీ మనం స్వయంగా ఎంచుకున్నవి కావు. ఇవన్నీ ఒక సంగీత బాణీలాంటివి. మనకు ప్రమేయం లేకుండానే ముందే కట్టబడి మన చేతికి వచ్చేస్తాయి. కానీ ఆ వచ్చిన బాణీకి మనం ఏ విధమైన సాహిత్యం జోడిస్తామన్నది, ఆ పాటను జీవిత రంగస్థలంపై ఎలా పాడుతామన్నది మాత్రం పూర్తిగా మన చేతుల్లోనే, మన సంకల్పంలోనే ఉంటుంది. ఇక్కడే మనిషి ఉనికి యొక్క నిజమైన సార్థకత దాగి ఉంది.నేటి ఆధునిక కాలంలో చాలామంది జీవితంలో అర్థం ఎక్కడో బయటి ప్రపంచంలో దొరుకుతుందని భ్రమపడుతూ , అన్వేషిస్తూ ఉంటారు. కొందరు దానిని కోట్లాది రూపాయల డబ్బులో వెతుకుతారు, కొందరు ఉన్నతమైన అధికార పదవుల్లో, మరికొందరు సమాజంలో లభించే ఇతరుల మెప్పులో, ప్రశంసల్లో వెతుకుతుంటారు. కానీ ఇవన్నీ ఒక పాట వెనుక వినిపించే వాయిద్యాల హంగుల శబ్దాల్లాంటివే. అవి పాటను పైపైన అందంగా, ఆకర్షణీయంగా మార్చవచ్చు కానీ, ఆ పాటకు అంతర్గతమైన ఆత్మను, భావాన్ని ఎప్పటికీ ఇవ్వలేవు. ఒక పాటలో అర్థవంతమైన మాటలు లేకపోతే అది కేవలం వట్టి శబ్ద తరంగంగా మిగిలిపోతుంది కానీ, గుండెలను తాకలేదు. అలాగే జీవితంలో మనం ఎంత సంపాదించినా, ఎన్ని లౌకిక విజయాలు సాధించినా, దానికి మనమే స్వయంగా ఒక ఉన్నతమైన అర్థాన్ని ఇవ్వకపోతే అది వట్టి శబ్దంగానే మిగిలిపోతుంది.అసలు జీవితానికి అర్థం అంటే ఏమిటి? ప్రతి మనిషికీ దీని నిర్వచనం, పరిధి వేరుగా ఉంటుంది. ఒకరికి తన కుటుంబం కోసం నిరంతరం శ్రమించడంలో, వారి ముఖాల్లో ఆనందం చూడటంలో అర్థం దొరుకుతుంది. మరొకరికి సమాజంలోని దీనులకు సాయం చేయడంలో, ఇంకొకరికి తను నమ్మిన కళను లేదా వృత్తిని నిబద్ధతతో సాధన చేయడంలో పరమార్థం కనిపిస్తుంది. ఈ అర్థాన్ని ఏ ఇతరులూ మనకు రాసి ఇవ్వలేరు. కన్న తల్లిదండ్రులు కూడా దీనిని ప్రసాదించలేరు, గురువులు సైతం మార్గదర్శనం చేయగలరే తప్ప, చివరకు ఆ సాహిత్యాన్ని లిఖించాల్సింది మనమే. ఒక కవి తన జీవిత అనుభవాల నుంచి, తన కన్నీటి బాధల నుంచి, కమ్మని సంతోషాల నుంచి పదాలను ఏరుకుని ఒక అమర గీతంగా మలిచినట్టు, మనం కూడా మన దైనందిన అనుభవాల నుంచి, కష్టనష్టాల నుంచి జీవితానికి ఒక కొత్త అర్థాన్ని అల్లుకోవాలి.ఇక్కడ మనం ఒక ముఖ్యమైన జీవన సూత్రాన్ని గమనించాలి. ఒక పాట పాడుతున్నప్పుడు మధ్యలో అపశ్రుతులు లేదా శ్రుతి తప్పడాలు వచ్చినంత మాత్రాన ఎవరూ పాడటం పూర్తిగా మానేయరు కదా. అలాగే జీవితంలో ఊహించని కష్టాలు, ఆవేదనలు, ఘోర వైఫల్యాలు ఎదురైనప్పుడు కూడా మనం నిరాశతో ఆగిపోకూడదు. ఒక్కోసారి పాటలో వచ్చే ఆ చిన్న తడబాటే, ఆ అపశ్రుతే ఆ పాటకు ఒక ప్రత్యేకమైన, హృదయ విదారకమైన సొగసునిస్తుంది. మన భారతీయ శాస్త్రీయ సంగీతంలో గమకం అనే ఒక అద్భుతమైన భావన ఉంది. నేరుగా ఒకే స్వరం మీద నిలవకుండా, దాని చుట్టూ సూక్ష్మంగా వణుకుతూ, తిరిగి వచ్చే ఆ మధురమైన కదలికే సంగీతానికి అసలైన జీవం పోస్తుంది. మన జీవితంలో వచ్చే ఆటుపోట్లు, హెచ్చుతగ్గులు కూడా సరిగ్గా అలాంటివే. అవి లేకపోతే జీవితం కేవలం సాదాసీదాగా, ఎటువంటి రసం లేని యాంత్రిక ప్రక్రియగా మారిపోతుంది.సమకాలీన సమాజంలో మనం చాలాసార్లు ఇతరుల బాహ్య జీవితాలతో మన అంతర్గత జీవితాన్ని పోల్చుకుని బాధపడుతుంటాం. పక్కవాడి పాట ఎంత అద్భుతంగా ఉందో అని అసూయగా చూస్తూ, మన దగ్గరున్న సొంత పాటను పూర్తిగా మర్చిపోతాం. కానీ విశ్వంలో ప్రతి పాటకూ దాని స్వంత రాగం ఉంటుంది, దాని స్వంత ప్రత్యేక లయ ఉంటుంది. ఒకరి పాటను మరొకరు హడావుడిగా కాపీ కొట్టి పాడితే అది కేవలం ఒక నకిలీ అనుకరణగానే వినిపిస్తుంది తప్ప మెప్పు పొందలేదు. మన జీవితం కూడా అంతే. మనకంటూ ప్రకృతి ప్రసాదించిన ఒక విశిష్టమైన లయ ఉంది. దానిని అంతరంగంలో గుర్తించి, దానికి తగ్గట్టుగా స్వేచ్ఛగా బతకడమే మనిషి సాధించాల్సిన నిజమైన విజయం.ఇటీవల ఎనభై ఏళ్ల వృద్ధాప్యంలో ఎంతో ప్రశాంతంగా ఉన్న ఒక తాతయ్యను ఒక పత్రికా విలేకరిగా అడిగినప్పుడు, తాతగారూ, మీ సుదీర్ఘ జీవితానికి మీరు కనుగొన్న అర్థం ఏమిటి? అని ప్రశ్నించారు. ఆయన పెదవులపై ఒక అమాయకపు చిరునవ్వుతో, నాయనా, నేను నా జీవితాన్ని ఎలా జీవించానో, ఆ ప్రయాణమే దాని అసలైన అర్థం. నేను నా పిల్లలను ఎంతో ప్రేమతో, సంస్కారంతో పెంచాను, నా వృత్తిపరమైన పనిని అత్యంత నిజాయితీగా చేశాను, నా ప్రయాణంలో చేసిన తప్పులను ధైర్యంగా ఒప్పుకున్నాను, కిందపడిన ప్రతిసారీ మళ్ళీ పట్టుదలతో లేచి నిలబడ్డాను. ఇదే నా సొంత పాట, ఇదే నా జీవిత పరమార్థం అన్నారు. ఆ మాటల్లో ఎంతో లోతైన, నిత్యనూతనమైన సత్యం దాగి ఉంది. అర్థం అనేది జీవితం ముగిసిన తర్వాత వెనక్కి తిరిగి చూసినప్పుడు మాత్రమే కనిపించేది కాదు, అది మనం జీవిస్తున్న ప్రతి క్షణంలో, ప్రతి చిన్న ఎంపిక ద్వారా నిరంతరం నిర్మించబడే ఒక సజీవ శిల్పం.కాబట్టి, నిశ్చయంగా జీవితం ఒక సుమధురమైన పాట అయితే, దాని బాణీ మన చేతుల్లో లేకపోవచ్చు. కానీ ఆ బాణీకి అద్భుతమైన సాహిత్యం రాసే కలం మాత్రం మన చేతిలోనే ఉంది. మన హృదయంలోని ప్రేమ, తోటివారిపై చూపే కరుణ, సంక్షోభాల్లో చూపే ధైర్యం, ఆశావహ దృక్పథం ఇవే ఆ పాటకు శాశ్వతమైన పదాలుగా రూపాంతరం చెందుతాయి. ఈ విశిష్ట సాహిత్యాన్ని రాయడానికి ఈ ప్రపంచంలో ఎవరూ మనకు ముందే సిద్ధం చేసిన స్క్రిప్టు ఇవ్వరు. మనమే ప్రతి రోజూ ఒక్కో పంక్తిని, ఒక్కో అక్షరాన్ని జాగ్రత్తగా రాసుకుంటూ ముందుకు సాగాలి. కొన్ని పంక్తులు పొరపాటుగా రాయబడొచ్చు, కొన్నిసార్లు వాటిని కొట్టివేసి మళ్ళీ మొదటి నుంచి రాయాల్సి రావొచ్చు. కానీ చివరికి, ఆ జీవిత గానం పూర్తయ్యేసరికి అది పూర్తిగా మన స్వంత సృష్టి అయి ఉంటుంది. తదుపరిసారి జీవితం కష్టంగా అనిపించినప్పుడు, గుర్తుంచుకోండి ఆ పాటకు అర్థం రాయాల్సింది వేరెవరో కాదు, మనమే. ఆ పాట ఇతరులకు నచ్చినా నచ్చకపోయినా, అది మన ఆత్మసాక్షిగా రాసుకున్న పాట అయినప్పుడే దానికి సార్థకత లభిస్తుంది.



డా. సూర్యదేవర రామకృష్ణ ,
Moral Philosopher, 9490754169

# "సమస్తం సమాజమే"




పల్లెలన్నీ తిరిగి పలుగురాళ్ల
పదాలను ఏరుకొచ్చి గుండె ఊపిరితో కలిపి
మనుసు బిగువుతో కంటి నీటి జిగురుతో..
కాలంతో ముడివేసి వడిపెట్టి
బలమైన భావమనెడి వడిసెలతో విసిరి కొట్టితే!..
సమాజం పై ముసిరిన
అన్ని రకాల చీడ పీడ స్వార్థ దోపిడీ...
సమూలంగా కొట్టుకుపోవాలి!..
అందుకే అరికట్టడానికి
ఆయుధాలతోసమాజం మధ్యన
మంచె వేసుకొని కూర్చున్నా
కంచె దాటివచ్చేమానవచీడను కనిపెట్టి
సరికొత్త ఆయుధంతో నిర్మూలిస్తా
అప్పుడప్పుడు ఎదురు దెబ్బలు తగులుతాయి..
అపవాదాలు అపార్థాలు అడ్డుపడతాయి
ఓ విప్లవాత్మక మార్పుకోసం నిత్యం పోరాటమే
సమాజం గుండెపై సాహిత్యపు జెండా పాతుతా
మానవత్వపు మనుగడకు ఊపిరిపోస్తా
ఓ సామూహిక సాహిత్యపుశక్తి స్వరూపంతో
రణానికి సిద్ధంగా మంచెపై నిలబడి
వంచించే శక్తులను కంచె దాటిస్తా
సాహిత్యాన్ని నిర్వచిస్తూ సమాజానికి
మకుటమై నిలబడుతా
సమాజానికి ఊతమై
పరిపూర్ణపు జీవితమై నిలబడతా!..
సమాజానికి సహాయపడని సాహిత్యం ఎందుకు
మనిషికి మనుగడచూపని పదాల పరుగెందుకు
ఇది ఎడతెగని వెతుకులాటనే
సమాజం ఓ లోకం
అతివిశాలమైన మహా గొప్పనగరం
ఇదో మహా అద్భుత పద్మవ్యూహం
కలలు కనాలన్నా కవితలు రాయాలన్నా
ఈ సమాజాన్ని దృష్టిలో పెట్టుకోవాలి
ఉద్వేగం ఉప్పొంగినప్పుడుఉద్రేకం ఉరకలేసినప్పుడు
నిండైన నిట్టూర్పులతో సమాజంపైకి నెట్టేస్తాం
సమాజం ఓ మహా ప్రస్థానం...
సమస్తాన్ని తనలో దాచుకుంటుంది
అన్ని పార్శ్వాలూ తనలోనే
సర్వహృదయ సమాలోచనం
ఇదో కొత్తలోకం మహా వింతలోకం
క్రాంతి లోకం ఓ శాంతిలోకం
సమస్తానికి మూలాధారం...
సమస్త సమాజంలోనే కనబడుతుంది!!...

అంబటి నారాయణ, నిర్మల్
9849326801

# 91 మందికి రూ. 72 లక్షల విలువైన టీ స్టాల్స్ పంపిణీ చేసిన హరీష్ రావు

- సిద్దిపేటలో 91 మంది లబ్ధిదారులకు ఆధునిక టీ స్టాల్స్ పంపిణీ
- ఎన్ఈసీసీ సహకారంతో రూ.72 లక్షల విలువైన సామగ్రి అందజేత
- స్వయం ఉపాధి పొందుతున్న చిన్న వ్యాపారులకు అండగా ఉంటానన్న హరీష్
- ఒక్కో టీ స్టాల్ విలువ రూ.80 వేలు
- టీ స్టాల్స్‌తో పాటు పూర్తి వ్యాపార సామగ్రి పంపిణీ

**సిద్దిపేట వెలుతురు జూలై 05:**

స్వయం ఉపాధితో జీవనోపాధి పొందుతున్న చిన్న వ్యాపారులకు తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు అన్నారు. ఎన్ఈసీసీ (NECC) సహకారంతో సిద్దిపేట నియోజకవర్గంలోని ఐదు గ్రామీణ మండలాలకు చెందిన 91 మంది లబ్ధిదారులకు ఆదివారం రూ.72 లక్షల విలువైన ఆధునిక టీ స్టాల్స్‌ను పంపిణీ చేశారు. ఒక్కో టీ స్టాల్ విలువ రూ.80 వేలుగా ఉందని తెలిపారు.ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ, కష్టపడి స్వయం ఉపాధితో ముందుకు సాగుతున్న వారికి ప్రోత్సాహం అందించడం తన బాధ్యతగా భావిస్తున్నానన్నారు. రోడ్డుపై లేదా బండిపై వ్యాపారం చేసే వారికి శాశ్వతమైన టీ స్టాల్ ఏర్పాటు చేసి, వారి జీవనోపాధిని మరింత బలోపేతం చేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు చెప్పారు.టీ స్టాల్ అనేది కేవలం ఒక వ్యాపారం మాత్రమే కాకుండా ఒక కుటుంబానికి జీవనాధారమని పేర్కొన్నారు. నిజాయితీగా, కష్టపడి వ్యాపారం చేస్తే తప్పకుండా అభివృద్ధి సాధించవచ్చని, ప్రతి లబ్ధిదారుడు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు.టీ స్టాల్స్‌తో పాటు గ్యాస్ సిలిండర్, స్టవ్, ఎల్ఈడీ లైట్లు, ఫ్యాన్, ప్లేట్లు, స్పూన్లు, వాటర్ బాటిల్స్, హాట్ కేస్, డిక్షా, వాటర్ క్యాన్, చాకు, గిన్నెలు తదితర అవసరమైన సామగ్రిని కూడా లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



# చందిప్ప శ్రీ బ్రహ్మసూత్ర మరకత శివాలయం చైర్మన్ గా కుమార్ యాదవ్ నియామకం




**శంకర్‌పల్లి, వెలుతురు జూలై 05:**

శంకర్‌పల్లి మండల పరిధిలోని చందిప్ప గ్రామ శివారులో వెలిసిన 11వ శతాబ్దానికి చెందిన శ్రీ బ్రహ్మసూత్ర మరకత శివాలయ నూతన చైర్మన్ గా కుమార్ యాదవ్ నియమితులయ్యారు. ఆదివారం ఆలయ ఆవరణలో ధర్మకర్త వెంకటేశ్వరరావు (వీడియోరావు) నూతన కమిటీ చైర్మన్, సభ్యులను స్వామివారి శేష వస్త్రాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలయాన్ని మరింత అభివృద్ధి చేస్తామని, భక్తులకు ఎలాంటి లోటు లేకుండా ప్రత్యేక ఏర్పాట్లు కల్పిస్తామని వారు చెప్పారు. కార్యక్రమంలో మాజీ చైర్మన్ లు, మాజీ కమిటీ సభ్యులు ఉన్నారు.

# ఓటరు జాబితా ప్రత్యేక సవరణపై బీఆర్‌ఎస్ అవగాహన సదస్సు..

- **ఓటర్లకు సర్వే ఫారాలు అందజేసి పూర్తి సహకారం అందించాలి ..మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు**



**కూకట్ పల్లి, జూలై 5 వెలుతురు:**

కూకట్‌పల్లి శాసనసభ్యులు మాధవరం కృష్ణారావు సూచనల మేరకు శేర్లింగంపల్లి నియోజకవర్గంలోని వివేకానంద నగర్ డివిజన్ పరిధిలోని మాధవరం నగర్ కాలనీ డివిజన్ పార్టీ కార్యాలయంలో ఆదివారం బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో (ఎస్ఐఆర్) ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాధవరం రంగారావు మాట్లాడుతూ, ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి సర్వే ఫారాలను ఓటర్లకు అందజేయడంతో పాటు వాటిని ఎలా నింపాలో స్పష్టంగా వివరించాలని సూచించారు. ఫారాలు నింపే ప్రక్రియలో ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా బూత్ లెవల్ ఆఫీసర్లు (బీఎల్‌ఓలు), బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్‌ఏలు) సమన్వయంతో పనిచేయాలని అన్నారు. ఇటీవల మియాపూర్ నరేన్ గార్డెన్‌లో జరిగిన సమావేశంలో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు చేసిన ప్రసంగ వీడియోను వీక్షించిన అనంతరం, పార్టీ శ్రేణులు ప్రజలకు పూర్తి అవగాహన కల్పిస్తూ సర్వే ప్రక్రియను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గొట్టిముక్కల పెద్ద భాస్కరరావు, మాచర్ల భద్రయ్య, ఆంజనేయులు, బీఆర్‌ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, ఉద్యమకారులు, మహిళా నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# జనసేనలోకి కూకట్‌పల్లి యువత చేరిక

- **పార్టీ సిద్ధాంతాలతో ఆకర్షితులై కండువా కప్పించుకున్న యువకులు..**



**కూకట్ పల్లి, జూలై 5 వెలుతురు:**

కూకట్‌పల్లి నియోజకవర్గంలోని కేపీహెచ్‌బీ కాలనీ 5వ ఫేజ్ లోని జనసేన పార్టీ కార్యాలయంలో ఆదివారం యువత జనసేన పార్టీలో చేరిన కార్యక్రమం నిర్వహించారు. పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ చేపడుతున్న కార్యక్రమాలు, ఆయన ఆశయాలు, జనసేన సిద్ధాంతాలకు ఆకర్షితులై కూకట్‌పల్లి డివిజన్‌కు చెందిన పలువురు యువకులు పార్టీలో చేరారు. కూకట్‌పల్లి నియోజకవర్గ జనసేన నాయకుడు వేముల మహేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జాయినింగ్ కమిటీ సభ్యుడు, కూకట్‌పల్లి జనసేన పార్టీ కంటెస్టెడ్ కార్పొరేటర్ అభ్యర్థి ముమ్మారెడ్డి ప్రేమకుమార్ కొత్తగా చేరిన యువతకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో సందీప్, మణికంఠ, వినయ్ గౌడ్, సీతారాం, హరితేజ, శ్రీరామ్, లోకేష్, వెంకీ, షేక్ అమీదిన్, ప్రభాస్ తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా ప్రేమకుమార్ మాట్లాడుతూ, జనసేన పార్టీలో యువతకు సముచిత ప్రాధాన్యం ఉంటుందని అన్నారు. పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా ప్రజాసేవ చేస్తే యువ నాయకులుగా ఎదిగే అవకాశాలు మెండుగా ఉంటాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి జనసేన నాయకులు కొల్లా శంకర్, వేముల మహేష్‌తో పాటు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# కుత్బుల్లాపూర్ గ్రామం శ్రీశ్రీశ్రీ బీరప్ప ఆలయ మల్టీపర్పస్ హాల్ పునర్నిర్మాణానికి రూ. 1.02 కోట్లు మంజూరు




**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) జూలై 05:**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని కుత్బుల్లాపూర్ గ్రామంలో శ్రీశ్రీశ్రీ బీరప్ప ఆలయ ప్రాంగణంలో మల్టీపర్పస్ హాల్ పునర్నిర్మాణం కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రూ.1.02 కోట్ల నిధులను మంజూరు చేసింది. రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు చొరవతో, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి సహకారంతో నిధులు మంజూరు కావడం పట్ల ఆలయ కమిటీ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు ఆదివారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో కొలన్ హన్మంత్ రెడ్డి పాల్గొని స్వామి ఆశీస్సులు పొందారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఆయనను శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈసందర్భంగా కొలన్ హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ శ్రీశ్రీశ్రీ బీరప్ప ఆలయ మల్టీపర్పస్ హాల్ పునర్నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.1.02 కోట్ల నిధులు మంజూరు చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈనిధుల మంజూరుకు సహకరించిన రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. ఆలయ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని చెప్పారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు అవసరమైన సహకారం నిరంతరం అందిస్తామన్నారు.ఈకార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు కే.ఎం.గౌరీష్, బట్ట పాలకృష్ణ, సీనియర్ నాయకులు దమ్మని శ్రవణ్, డివిజన్ అధ్యక్షులు సిద్దనోళ్ళ సంజీవరెడ్డి, మైసిగారి శ్రీనివాస్, పిట్ల ప్రవీణ్ ముదిరాజ్, కుత్బుల్లాపూర్ కురుమ సంఘం చైర్మన్, బి.నర్సింహా, వైస్ చైర్మన్ బాలరాజ్, నర్సింహా, రమేష్, సలహాదారులు ఎన్.పెంటయ్య, నగేష్, ప్రతాప్, జి.సత్తయ్య, అధ్యకులు, నార్లకంటి బాలయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ జి.సాయి కుమార్, వైస్ ప్రెసిడెంట్ ఎన్.చంద్రశేఖర్, బి.యాదగిరి, సి.నాగేందర్, ఎన్, విజయకృష్ణ, రామకృష్ణ జనరల్ సెక్రటరీ సి.మహేందర్, జాయింట్ సెక్రటరీ ఎన్.శంకర్, జి. మధు, ఎన్.బాలకృష్ణ, ఎన్.బీరప్ప, ఎన్. జగదీష్, మహిళా సెక్రటరీ కే.లక్ష్మి , కురుమ సంఘం నాయకులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# కంసాన్‌పల్లి ఫ్రోజెన్ సీమెన్ బుల్ స్టేషన్‌ను సందర్శించిన రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి

**షాద్‌నగర్ వెలుతురు జిల్లా 05:**





షాద్‌నగర్ నియోజకవర్గంలోని ఫరూఖ్‌నగర్ మండలం కంసాన్‌పల్లి గ్రామంలో ఉన్న ఫ్రోజెన్ సీమెన్ బుల్ స్టేషన్‌ను రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, పాలాభివృద్ధి, క్రీడలు మరియు యువజన సర్వీసుల శాఖల మంత్రి వాకిటి శ్రీహరి ఆదివారం సందర్శించారు.ఈ సందర్భంగా మంత్రి స్టేషన్‌లోని వివిధ విభాగాలను పరిశీలించి, ఘనీకృత వీర్య నాళికల ఉత్పత్తి, నాణ్యత ప్రమాణాలు, నిల్వ, పంపిణీ విధానాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.రాష్ట్రంలో పశుసంపద అభివృద్ధికి, పాడి పరిశ్రమను మరింత బలోపేతం చేయడంలో ఇటువంటి ఆధునిక కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కరీంనగర్ తర్వాత రాష్ట్రంలో ఇలాంటి అత్యాధునిక పశు ఘనీకృత వీర్య నాళికల ఉత్పత్తి కేంద్రం కంసాన్‌పల్లిలోనే ఏర్పాటు చేయబడిందన్నారు. ఈ కేంద్రాన్ని అన్ని ఆధునిక సౌకర్యాలతో సన్నద్ధం చేసి త్వరలోనే పూర్తి స్థాయిలో ప్రారంభించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.ఈ కేంద్రం ప్రారంభమైతే నాణ్యమైన ఘనీభవించిన వీర్యం రైతులకు సులభంగా అందుబాటులోకి వచ్చి, మేలుజాతి పశువుల ఉత్పత్తి గణనీయంగా పెరుగుతుందని తెలిపారు. ఫలితంగా అధిక పాల దిగుబడి ఇచ్చే పశువుల సంఖ్య పెరిగి, రాష్ట్రంలో పాల ఉత్పత్తి వృద్ధి చెందడంతో పాటు పాడి రైతుల ఆదాయం కూడా గణనీయంగా పెరుగుతుందని మంత్రి పేర్కొన్నారు.తెలంగాణను పాల ఉత్పత్తిలో దేశంలో అగ్రస్థానంలో నిలిపే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పశుసంవర్ధక రంగానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తెలిపారు. ఆధునిక సాంకేతికతతో కూడిన ఇటువంటి కేంద్రాలు రైతులకు ప్రత్యక్షంగా ప్రయోజనం చేకూర్చడమే కాకుండా, పాడి పరిశ్రమ అభివృద్ధికి బలమైన పునాదిగా నిలుస్తాయని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో షాద్‌నగర్ శాసనసభ్యులు వీర్లపల్లి శంకర్, పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్ రావు, తెలంగాణ లైవ్‌స్టాక్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ (TGLDA) చైర్మన్, శాఖ ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# మేఘన డెంటల్ కేర్ ప్రారంభం

**హయత్ నగర్, వెలుతురు జూలై 5,:**




హయత్ నగర్ కుంట్లూరు రోడ్డులో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు పై అంతస్తులోని సుబ్రహ్మణ్య నగర్ కాలనీలో అత్యాధునిక దంత వైద్య సేవలను అందించేందుకు ఏర్పాటు చేసిన మేఘన డెంటల్ కేర్ ఆసుపత్రిని ఘనంగా ప్రారంభించారు. ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి హాజరై రిబ్బన్ కట్ చేసి జ్యోతి ప్రజ్వలన చేసి క్లినిక్‌ను ప్రారంభించారు.ఈ సందర్భంగా చిలుక మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ... హయత్ నగర్ ప్రాంత ప్రజలకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన దంత వైద్య సేవలు అందుబాటులోకి రావడం అభినందనీయమని అన్నారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని క్లినిక్ నిర్వాహకులు చేపట్టిన ప్రయత్నం విజయవంతం కావాలని ఆకాంక్షించారు.క్లినిక్ నిర్వాహకులు డాక్టర్ గంగినేని సురేందర్ కుమార్, డాక్టర్ మేఘనా చౌదరి మాట్లాడుతూ.ఇప్పటికే ముషీరాబాద్‌లో విజయవంతంగా సేవలందిస్తున్న తమ సంస్థకు ఇది రెండో శాఖ అని తెలిపారు. హయత్ నగర్ వాసులుగా స్థానిక ప్రజలకు ప్రపంచ స్థాయి దంత వైద్య సేవలను అందించాలనే లక్ష్యంతో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు.కృత్రిమ మేధ ఆధారిత అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రోగుల దంత సమస్యలను వెంటనే గుర్తించి, డిజిటల్ చిత్రాల ద్వారా వారికి స్పష్టంగా వివరించే విధానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. క్లినిక్‌లోనే తక్షణ దంత చిత్రీకరణ, వ్యాధి నిర్ధారణ, అవసరమైన చికిత్సను అందించే సదుపాయాలు ఉన్నాయని పేర్కొన్నారు. మధుమేహం, రక్తపోటు వంటి ఇతర ఆరోగ్య సమస్యలను కూడా పరిగణనలోకి తీసుకుని చికిత్స అందిస్తామని వివరించారు.చిగుళ్ల వ్యాధులు, రూట్ కెనాల్ చికిత్స, దంతాల అమరిక, బ్రేసెస్, దంతాల మార్పిడి తదితర అన్ని రకాల ప్రత్యేక దంత వైద్య సేవలను ఆయా విభాగాల్లో నిపుణులైన వైద్యులే అందిస్తారని తెలిపారు. ఒకసారి చికిత్స ప్రారంభించిన రోగిని అదే వైద్యుడు పూర్తి చికిత్స పూర్తయ్యే వరకు పర్యవేక్షిస్తారని చెప్పారు. నొప్పి లేకుండా అత్యాధునిక పద్ధతుల్లో చికిత్స అందించడమే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.క్లినిక్ ఉదయం 10 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు, ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పనిచేస్తుందని తెలిపారు. ప్రారంభోత్సవం సందర్భంగా తొలి నెల పాటు బయటి రోగుల నమోదు ఉచితంగా ఉంటుందని, అనంతరం కూడా ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా తక్కువ చార్జీలతో సేవలు అందిస్తామని వెల్లడించారు.ఈ కార్యక్రమంలో వైద్యులు, స్థానిక ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, కుటుంబ సభ్యులు, కాలనీ వాసులు, ఆహ్వానితులు పాల్గొన్నారు.

# స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (SIR) కార్యక్రమాన్ని పరిశీలించిన కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి

**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) జూలై 05:**



కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని వెంకటేష్ నగర్, రోడ్ నెం. 6లో నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం (Special Intensive Re-vision – SIR) ను కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి బూత్ లెవెల్ అధికారులతో (BLOలు) కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ, ఓటరు నమోదు ప్రక్రియను బీఎల్‌ఓలు ఇంటింటికీ వెళ్లి పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. అర్హులైన ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకోవడంతో పాటు, ఓటరు జాబితాలో ఖచ్చితత్వం ఉండేలా అవసరమైన వివరాలను సేకరించాలని అధికారులకు సూచించారు.అదేవిధంగా, ప్రజలు బీఎల్‌ఓలు అందించే ఎన్యుమరేషన్ ఫారమ్‌లను సక్రమంగా నింపి సమర్పించాలని కోరారు. ముఖ్యంగా 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న యువత ఈ అవకాశాన్ని వినియోగించుకుని కొత్త ఓటరుగా నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు.ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత విలువైనదని పేర్కొన్న ఆయన, ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో భాగస్వాములై విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కె.ఎం. గౌరీష్, యువ నాయకులు కె.ఎం. గిరి, శ్రీధర్ రెడ్డి, భగవాన్ రెడ్డి, మనోహర్, గణేశ్వర్, రమేష్, శ్రీనివాస్, రాజు, జ్యోతి, సీతారామయ్య, పాండురికం, జగదీశ్వర్ రావు, మహేష్ కుమార్, గిరి, సుబ్రహ్మణ్యం, సుబ్బయ్య, కుమార్, బూత్ లెవెల్ అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# శ్రీని ఉడిపి కేఫ్ ఘనంగా ప్రారంభం





**వెలుతురు వనస్థలిపురం, భాగ్యలత, జూలై 5:**

భాగ్యలతలో శ్రీని ఉడిపి కేఫ్‌ను ఘనంగా ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవానికి మాజీ కౌన్సిలర్ రోహిత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి జ్యోతి ప్రజ్వలన చేసి కేఫ్‌ను ప్రారంభించారు.ఈ సందర్భంగా రోహిత్ రెడ్డి మాట్లాడుతూ, పరిశుభ్రతతో కూడిన నాణ్యమైన ఆహారాన్ని ప్రజలకు అందించడం అభినందనీయమని అన్నారు. వ్యాపార రంగంలో ముందుకు సాగుతూ వినియోగదారుల విశ్వాసాన్ని సంపాదించాలని ఆకాంక్షించారు. స్థానికులకు రుచికరమైన, నాణ్యమైన ఆహారాన్ని అందిస్తూ సంస్థ మంచి పేరు తెచ్చుకోవాలని శుభాకాంక్షలు తెలిపారు.కేఫ్ నిర్వాహకులు శ్రీనివాసు, అశ్విని మాట్లాడుతూ, తమ వద్ద అన్ని రకాల టిఫిన్ పదార్థాలు అందుబాటు ఉన్నాయని తెలిపారు. ఇడ్లీ, ఉప్మా, వడ, బోండా, దోశ, పూరీతో పాటు రోటి,రైస్ వంటి వంటకాలను పరిశుభ్రమైన, నాణ్యమైన పదార్థాలతో తయారు చేసి సరసమైన ధరలకు అందిస్తున్నామని చెప్పారు. ఒకసారి తమ కేఫ్‌కు విచ్చేసి రుచికరమైన వంటకాలను ఆస్వాదించాలని చుట్టుపక్కల కాలనీల ప్రజలకు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రముఖులు, వ్యాపారవేత్తలు, కాలనీవాసులు, బంధుమిత్రులు పాల్గొని నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు.

# మునుగోడు నియోజకవర్గం లో ఒక్కరికి కూడా కంటి సమస్యలు ఉండొద్దు

- ప్రతి మనిషికి కంటి సమస్యలు లేకుండా చేయించే బాధ్యత నాది
- ఇప్పటివరకు 2325 మందికి ఆపరేషన్ చేయించా
- మీకు నేనున్నా ధైర్యంగా వెళ్లి ఆపరేషన్ చేయించుకొని రండి
- కంటి శస్త్ర చికిత్స కు ఎంపికైన వారికి ఆత్మీయ భరోసా
- 15 వ విడత ఉచిత కంటి వైద్య శిబిర ప్రారంభోత్సవంలో కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి





**చౌటుప్పల్ వెలుతురు జూలై 05:**

మునుగోడు నియోజకవర్గ వ్యాప్తంగా ఏ ఒక్కరు కూడా కంటి సమస్యలతో బాధపడొద్దని, ప్రతి ఒక్కరికి కంటి సమస్య లేకుండా చేయించే బాధ్యత నాదని అన్నారు గౌరవ మునుగోడు శాసనసభ్యులు శ్రీ కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి గారు. తన మాతృమూర్తి కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ పేరు మీద మునుగోడు నియోజకవర్గ వ్యాప్తంగా ఏ ఒక్కరు కంటి సమస్యలతో బాధపడొద్దనే ఆలోచనతో ఉచిత కంటి వైద్య శిబిరాలకు శ్రీకారం చుట్టారు.. దాంట్లో భాగంగానే 15వ ఉచిత కంటి వైద్య శిబిరాన్ని చౌటుప్పల్ మండలం చౌటుప్పల్ మున్సిపాలిటీ ప్రజలకు కలిపి చౌటుప్పల్ లో నిర్వహించారు... ఈ 15వ విడత ఉచిత కంటి వైద్య శిబిరాన్ని రిబ్బన్ కటింగ్ చేసి తన మాతృమూర్తి కోమటిరెడ్డి సుశీలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి ప్రారంభించారు.ఇప్పటి వరకు 14 విడతలుగా ఈ ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహించి 10444 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 2325 మంది కి కంటి ఆపరేషన్లు పూర్తిచేసి 4557 మందికి కళ్ళజోళ్ళు పంపిణీ చేశారు.మునుగోడు మండల ప్రజలకు మునుగోడు లో నిర్వహించి న మొదటి విడత ఉచిత కంటి వైద్య శిబిరంలో 216 మందికి, 2వ విడత ఉచిత కంటి వైద్య శిబిరంలో 108 మందికి, చండూరు మున్సిపాలిటీ ప్రజలకు మునుగోడు లో నిర్వహించిన 3వ విడత ఉచిత కంటి వైద్య శిబిరంలో 129 మందికి, నాంపల్లి మండలప్రజలకు నాంపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన 4వ, విడత ఉచిత కంటి వైద్య శిబిరంలో 229 మందికి, మర్రిగూడ మండల కేంద్రంలో నిర్వహించిన 5వ, విడత కంటి వైద్య శిబిరంలో 171 మందికి, చూండురు మండల ప్రజలకు చండూరు మండలం బంగారి గడ్డలో



నిర్వహించిన 6వ, విడత వైద్యశిబిరంలో 198 మందికి, ఘట్టుప్పల్ మండల కేంద్రంలో ఘట్టుప్పల్ మండల ప్రజలకు నిర్వహించిన 7వ విడత వైద్య శిబిరంలో 65 మందికి, నారాయణ్ పూర్ మండలంలో నిర్వహించిన 8 వ, విడత వైద్య శిబిరంలో 132 మందికి, చౌటుప్పల్ మున్సిపాలిటీలో నిర్వహించిన 9వ, విడత వైద్య శిబిరంలో 82 మందికి, చౌటుప్పల్ మండలంలో నిర్వహించిన 10వ, విడత వైద్య శిబిరంలో 160 మందికి, మునుగోడు లో మునుగోడు, ఘట్టుప్పల్ మండలాల ప్రజలకు నిర్వహించిన 11వ, విడత వైద్య శిబిరంలో 257 మందికి, మునుగోడు క్యాంపు కార్యాలయం ఆవరణలో చూండరు మున్సిపాలిటీ చండూరు మండల ప్రజలకు నిర్వహించిన 12 వ, విడత వైద్య శిబిరంలో 223 మందికి, మునుగోడు క్యాంపు కార్యాలయ ఆవరణలో నాంపల్లి మండల ప్రజలకు నిర్వహించిన 13 వ, వైద్య శిబిరంలో 228 మందికి, మరి గూడ మండల కేంద్రంలో మర్రిగూడ మండల ప్రజలకు నిర్వహించిన 14వ విడత వైద్య శిబిరంలో 127 మందికి కంటి ఆపరేషన్లను పూర్తి చేశారు.మునుగోడు నియోజకవర్గ వ్యాప్తంగా కంటి సమస్యతో బాధపడుతున్న ప్రతి తల్లి, ప్రతి తండ్రి కి పెద్దకొడుకుగా మారి కంటి శస్త్ర చికిత్సలు చేయిస్తున్నారు... రాబోయే రోజుల్లో నియోజకవర్గ వ్యాప్తంగా ఏ ఒక్కరు కూడా కంటి సమస్యతో బాధపడకుండా ఉండాలని ప్రణాళిక రూపొందించారు.. ఆ ప్రణాళికలో భాగంగానే 10 పదివేల మందికి కంటి శస్త్ర చికిత్సలు చేయించేలా టార్గెట్ పెట్టుకున్నారు.దాంట్లో భాగంగానే ఆదివారం రోజున 15వ. విడత ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నారు.ఈవైతే శిబిరంలో 1210 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా 208 కి పైగా ఆపరేషన్లకు ఎంపికయ్యారు.తన మాతృమూర్తి కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో, ఫీనిక్స్ ఫౌండేషన్, శంకర కంటి ఆసుపత్రి సౌజన్యంతో ఈ ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఈ ఉచిత కంటి వైద్య శిబిరాలు నిరంతర



ప్రక్రియగా నిర్వహిస్తామని గౌరవ మునుగోడు శాసనసభ్యులు తెలిపారు.

## మానవత్వమే మహాదానం.. మానస వివాహానికి గ్రామస్థుల సహకారం

**మునుగోడు,జూలై 5(వెలుతురు):**



ఆర్థిక ఇబ్బందులు శుభకార్యానికి అడ్డంకి కాకూడదనే సంకల్పంతో కోతులారం గ్రామస్థులు మానవత్వాన్ని చాటుకున్నారు. గ్రామానికి చెందిన ఏర్పుల అన్నయ్య–జయమ్మ దంపతుల కుమార్తె మానస వివాహానికి గ్రామ పెద్దలు, నాయకులు,యువకులు స్వచ్ఛందంగా విరాళాలు సేకరించి రూ.70,296 ఆర్థిక సహాయాన్ని అందించారు.చౌటుప్పల్ మండలం లింగారెడ్డిగూడెంలోని ఎంఎస్ గార్డెన్స్ అండ్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన వివాహ వేడుకలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ చేతుల మీదుగా ఆర్థిక సహాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ కష్టకాలంలో ఒక కుటుంబానికి గ్రామమంతా అండగా నిలవడం సామాజిక బాధ్యతకు నిదర్శనమన్నారు. గ్రామస్థుల ప్రేమాభిమానాలు, ఆప్యాయతలతో మానస వివాహం ఆనందోత్సాహాల మధ్య ఘనంగా జరగడం హర్షణీయమన్నారు. సహకరించిన ప్రతి దాతకు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో జాజుల సత్యనారాయణ గౌడ్,కందుల వెంకటేష్ గౌడ్,గురజా నరసింహ, జాజుల కోటయ్య, కందుల జగదీశ్వర్, జాజుల జలంధర్ గౌడ్, కందుల రవికుమార్, కందుల నరసింహ గౌడ్, గుండు రవి గౌడ్,నాగిరెడ్డి,జె వి గౌడ్, బచ్చి యాదవ్,గుళ్ళి శంకర్,డాక్టర్ నరసింహ,జాజుల రాంప్రసాద్ గౌడ్, హరికృష్ణ గౌడ్,జాజుల వెంకటేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక సాయం అందజేత

**రామన్నపేట వెలుతురు న్యూస్ జూలై 05:**



మండలం ఉత్త టూరు గ్రామానికి చెందిన బందెల లింగస్వామి అనారోగ్యంతో మృతిచెందగా వారికి కుటుంబానికి ఆర్థిక సాయం 5000, వేలు రూపాయలు ఇవ్వడం జరిగింది. జనంపల్లి మాజీ ఎంపిటిసి వేమవరపు సుధీర్ బాబు సందర్శించి నివాళులర్పించారు.గ్రామ శాఖ అధ్యక్షులు జంగిల్ సైదులు, సీనియర్ నాయకులు కోళ్ల కిషన్, మాజీ సర్పంచ్ కుల స్వామి, ఐదో వార్డ్ మెంబర్ పోతుల స్వామి, బిఆర్ఎస్ యూత్ యువ నాయకులు మేడి రాజు, లక్ష్మణ్, గణేష్,పోతుల ఎల్లయ్య, అనిల్, రాము తదితరులు పాల్గొన్నారు.

## కార్టూన్ ద్వారా ఉపాధ్యాయుని నిరసన

- పాల్వంచ హరికిషన్ టీచర్, కార్టూనిస్ట్ రామన్నపేట

**రామన్నపేట వెలుతురు న్యూస్జులై 05:**





కార్టూన్ ద్వారా ఉపాధ్యాయుని నిరసన టీచర్లకు మధ్యాహ్న భోజనం, బ్రేక్ ఫాస్ట్ అంటూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల ప్రజల్లో విద్యార్థుల్లో చులకన అవుతున్నామని రామన్నపేటకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు పాల్వంచ హరికిషన్ కార్టూన్ ద్వారా ప్రభుత్వానికి తెలుపుతూ తన ఆవేదనను, నిరసనను వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజనం కావాలని టీచర్లు ఎవ్వరూ అడగ లేదని, అడిగినవి పిఆర్సి, డిఏ లు మాత్రమేనని అవి ఇవ్వకుండా మాకు అవసరం లేని మధ్యాహ్న భోజనం బ్రేక్ ఫాస్ట్ ఇవ్వడమేంటని పాల్వంచ హరికిషన్ అన్నారు. ఉపాధ్యాయులను ప్రజల్లో చులకన చేసే నిర్ణయాలు తీసుకోవద్దని ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వ నిర్ణయం ప్రజల్లో, విద్యార్థుల్లో చులకన అయ్యే విధంగా ఉందని ఆయన తెలిపారు. ప్రభుత్వం వెంటనే తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. పేద విద్యార్థులకు అందించే భోజనం నాణ్యమైనదిగా అందిస్తే చాలని. అందుకోసం కావలసిన చర్యలు చేపట్టాలని , ఉద్యోగ ఉపాధ్యాయులకు ఇవ్వవలసిన 6 పెండింగ్ డి ఎలను ,, పిఆర్సి సత్వరమే అందించాలని , దయచేసి ప్రజల్లో ఉపాధ్యాయులను చులకన చేయొద్దని అది వ్యవస్థకు మంచిది కాదని ప్రభుత్వానికి సూచించారు .

## కాంగ్రెస్ పార్టీలోనే ఉన్నాను రాహుల్ గాంధీని ప్రధానిని చేయడమే కాంగ్రెస్ లక్ష్యం

- ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వెల్లడి
- పార్టీకి దూరంగా ఉంటున్నాననే ప్రచారంలో నిజం లేదని స్పష్టీకరణ
- కాంగ్రెస్ నిర్ణయాల్లో కొన్ని అంశాలను మాత్రమే తప్పుబడుతున్నానని వ్యాఖ్య
- పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటూ కార్యకర్తలకు అండగా ఉంటున్నానని వెల్లడి
- తెలంగాణలో ఏ నాయకుడికీ రాహుల్ అంత సమయం ఇవ్వలేదని వ్యాఖ్య
- పార్టీలో తనకు ప్రత్యేక స్థానం ఉందని కోమటిరెడ్డి స్పష్టం
- పార్టీ నిర్ణయాలు, కుటుంబ విషయాలపై రాహుల్‌తో చర్చించినట్లు వెల్లడి



- రాహుల్ గాంధీ మానవత్వం ఉన్న గొప్ప నాయకుడని ప్రశంస
- చౌటుప్పల్‌లో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే
- కాంగ్రెస్ బలోపేతానికి కట్టుబడి పనిచే స్తానని కోమటిరెడ్డి వ్యాఖ్య

**చౌటుప్పల్ వెలుతురు జూలై 05:**

మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేయడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని అన్నారు. పార్టీకి తాను దూరంగా ఉంటున్నాననే ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని, పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటూనే కాంగ్రెస్ కార్యకర్తలకు అండగా నిలుస్తున్నానని స్పష్టం చేశారు.ఆదివారం చౌటుప్పల్ మున్సిపాలిటీ కేంద్రంలో కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన.. కాంగ్రెస్ తీసుకుంటున్న కొన్ని నిర్ణయాలను మాత్రమే తాను తప్పుబడుతున్నానని, పార్టీని మాత్రం వ్యతిరేకించడం లేదన్నారు.తెలంగాణలో ఏ నాయకుడికీ ఇవ్వనంత సమయాన్ని రాహుల్ గాంధీ తనకు కేటాయించారని, పార్టీలో తనకు ప్రత్యేక స్థానం ఉందని కోమటిరెడ్డి తెలిపారు. పార్టీ నిర్ణయాలతో పాటు కుటుంబ విషయాలపై కూడా రాహుల్ గాంధీతో ఎన్నోసార్లు చర్చించానని చెప్పారు.రాహుల్ గాంధీ మానవత్వం ఉన్న గొప్ప నాయకుడని కొనియాడిన కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి.. కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం తాను నిరంతరం పనిచేస్తానని స్పష్టం చేశారు.

## ముగిసిన పద్మశాలి సహకార సంఘ ఎన్నికల నామినేషన్ల పర్వం

- సిరిపురం,వెల్లంకి గ్రామాల్లో పోటాపోటీగా నామినేషన్లు
- ఇంద్రపాలనగరం,జనంపల్లిలో ఏకగ్రీవానికి ఓటర్ల మొగ్గు

**రామన్నపేట వెలుతురు న్యూస్ జూలై 05:**

మండల పద్మశాలి సహకార సంఘ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ విజయవంతంగా ముగిసింది. సంఘ పరిధిలోని వివిధ గ్రామాల నుండి అభ్యర్థులు పెద్ద ఎత్తున నామినేషన్లు దాఖలు చేశారు.కొన్ని గ్రామాల్లో పోటీ తీవ్రంగా ఉండగా, మరికొన్ని గ్రామాల్లో ఏకగ్రీవ దిశగా అడుగులు పడుతున్నాయి.రామన్నపేట మండల కేంద్రంలో మొత్తం 12 నామినేషన్లు దాఖలు కాగా, అందులో 8 మంది పురుషులు, 4 మహిళా అభ్యర్థులు ఉన్నారు. సిరిపురం గ్రామంలో అత్యధికంగా పోటీ నెలకొంది. మొత్తం 41 నామినేషన్లు రాగా అందులో 36 మంది పురుషులు,5 గురు మహిళలు బరిలో నిలిచారు. వెల్లంకి గ్రామంలో కూడా గట్టి పోటీ కనిపిస్తోంది. మొత్తం 31 నామినేషన్లు దాఖలు కాగా,26 మంది పురుషులు,5 గురు మహిళలు ఉన్నారు. మునిపంపుల గ్రామం నుండి మొత్తం 13 నామినేషన్లు రాగా, అందులో 9 మంది పురుషులు, 4 గురు మహిళలు పోటీ పడుతున్నారు. ఇంద్రపాలనగరం, జనంపల్లి గ్రామాల్లో ఓటర్లు ఏకగ్రీవానికి మొగ్గు చూపినట్లు తెలుస్తోంది. ఇక్కడ ఎలాంటి పోటీ లేకుండా ఏకగ్రీవం చేసేందుకు స్థానిక ఓటర్లు, పెద్దలు ఆసక్తి కనబరుస్తున్నారు.సోమవారం మధ్యాహ్నం లోపు ఎన్నికల అధికారులు తుది అభ్యర్థుల జాబితాను విడుదల చేసే అవకాశం ఉంది. ఈ జాబితా వెలువడితేనే ఏయే స్థానాల్లో ఎవరెవరు బరిలో ఉంటారనే దానిపై పూర్తి స్పష్టత రానుంది. కాగా,ఈ సహకార సంఘ ఎన్నికల పోలింగ్ ఈ నెల 10వ తేదీన జరగనుంది.

## కేటీఆర్‌తో కలిసి కన్నెపల్లి పంప్ హౌస్‌ను సందర్శించిన మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

**నార్కట్ పల్లి వెలుతురు జూలై 05:**

ఆదివారం రోజు బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు (కేటీఆర్) తో కలిసి, కాళేశ్వరం ప్రాజెక్టులో అంతర్భాగమైన కన్నెపల్లి పంప్ హౌస్‌ను నకిరేకల్ మాజీ శాసన సభ్యులు సందర్శించారు.ఈ సందర్భంగా ప్రాజెక్టు నిర్మాణం, పంప్ హౌస్ నిర్వహణ, నీటి సరఫరా వ్యవస్థకు సంబంధించిన అంశాలను పరిశీలించారు. రాష్ట్ర రైతాంగానికి, సాగునీటి రంగానికి కాళేశ్వరం ప్రాజెక్టు ఎంతో కీలకమని పేర్కొంటూ, ప్రాజెక్టు పరిరక్షణ మరియు సమర్థ నిర్వహణకు కట్టుబడి ఉండాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.



# 57వ డివిజన్‌లోని శ్రీ కాశీ విశ్వేశ్వర మదేలేశ్వర స్వామి దేవస్థానాన్ని సందర్శించిన నగర మేయర్ కొలగాని శ్రీనివాస్



**కరీంనగర్ వెలుతురు జూలై 05:**

కరీంనగర్ నగరంలోని 57వ డివిజన్ పరిధిలో అంబేడ్కర్ స్టేడియం ఎదురుగా ఉన్న శ్రీ కాశీ విశ్వేశ్వర మదేలేశ్వర స్వామి దేవస్థానాన్ని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామివారి ఆశీస్సులు తీసుకున్నారు.ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులు మేయర్‌కు స్వాగతం పలికి, తీర్థప్రసాదాలు అందించి వేద ఆశీర్వచనం చేశారు. అనంతరం మేయర్ ఆలయ అభివృద్ధి, భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనపై ఆలయ కమిటీ సభ్యులతో మాట్లాడారు.ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ కొలిపాక రమ్యశ్రీ శ్రీనివాస్, ఆలయ కమిటీ సభ్యులు, డివిజన్ ప్రజలు, భక్తులు మరియు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో పెద్దమ్మ తల్లి బోనాల ఉత్సవాల్లో బోనం ఎత్తిన నగర మేయర్ కొలగాని శ్రీనివాస్





**కరీంనగర్ వెలుతురు జూలై 05:**

కరీంనగర్ నగరంలోని భగత్‌నగర్ మరియు రామ చంద్రపురి కాలనీలలో ఘనంగా నిర్వహించిన పెద్దమ్మ తల్లి బోనాల ఉత్సవాల్లో నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ పాల్గొని, సంప్రదాయబద్ధంగా బోనం ఎత్తి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీస్సులు పొందారు.ఈ సందర్భంగా మేయర్ శ్రీనివాస్ మాట్లాడుతూ, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగను ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకోవడం ఆనందదాయకమని అన్నారు. పెద్దమ్మ తల్లి ఆశీస్సులతో నగర ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వై సునీల్ రావు, కార్పొరేటర్లు చొప్పరి జయశ్రీ, నాంపల్లి రేణుక శ్రీనివాస్, పొన్నం లక్ష్మి మొండయ్య, ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు, భక్తులు మరియు పెద్ద సంఖ్యలో స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# రెండో డివిజన్ సరస్వతి నగర్‌లో రూ.10 లక్షలతో సీసీ రోడ్డు, సీసీ డ్రైన్ పనులకు శంకుస్థాపన



**కరీంనగర్ వెలుతురు జూలై 05:**

కరీంనగర్ నగరపాలక సంస్థ అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా రెండో డివిజన్ తీగలగుట్టపల్లిలోని సరస్వతి నగర్, రోడ్ నెం. 5లో రూ.10 లక్షల మున్సిపల్ సాధారణ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు మరియు సీసీ డ్రైన్ నిర్మాణ పనులకు నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ గారు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, నగరంలోని ప్రతి డివిజన్‌లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తూ ప్రజలకు మెరుగైన రహదారులు, డ్రైనేజీ సౌకర్యాలు అందించేందుకు నగరపాలక సంస్థ కృషి చేస్తోందన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేసి, నగరాన్ని మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ భాస్కర్ నాయక్, మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు మరియు డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.

# 20 ఏళ్ల తర్వాత ఒకటైన పూర్వ విద్యార్థులు

- **ఘనంగా ఆర్మూర్ డిగ్రీ 2003-06 విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం**

**ఆర్మూర్ వెలుతురు జూలై 05:**

కాలం మారినా, జీవితంలో ఎంతటి ఉన్నత స్థానాలకు చేరినా కాలేజీ రోజుల నాటి స్నేహం ఎప్పటికీ మరువలేనిదని నిరూపించారు ఆర్మూర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీకి చెందిన 2003-2006 బ్యాచ్ విద్యార్థులు. చదువు పూర్తి చేసుకుని సరిగ్గా 20 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా, ఒకే వేదికపైకి చేరి సందడి చేశారు. ఆదివారం ఆర్మూర్ డిగ్రీ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఈ 'ఆత్మీయ కలయిక' కార్యక్రమం ఎంతో భావోద్వేగాల మధ్య, అత్యంత ఉత్సాహంగా సాగింది.డిగ్రీ పూర్తి చేసి విడిపోయిన తర్వాత, రెండు దశాబ్దాల పాటు ఒకరికొకరు దూరమైన 2003-2006 బ్యాచ్ మిత్రులు మళ్లీ కలుసుకోవడంతో ఆ ప్రాంతమంతా పండగ వాతావరణం నెలకొంది. ఇరవై ఏళ్ల కాలంలో వచ్చిన మార్పులను గమనిస్తూ, ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ ఆత్మీయంగా పలుకరించుకున్నారు. దేశ, విదేశాల్లో వివిధ ఉన్నత రంగాలలో స్థిరపడిన పూర్వ విద్యార్థులంతా తమ ప్రస్తుత హోదాలను పక్కనబెట్టి, మళ్లీ ఆనాటి కాలేజీ విద్యార్థులుగా మారిపోయారు. కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక జ్ఞాపకాల వేదికపై నాటి మిత్రులు తమ కాలేజీ రోజులను నెమరువేసుకున్నారు. ఆర్మూర్ కాలేజీ క్లాస్‌రూమ్ ముచ్చట్లు, స్నేహితులతో కలిసి తిరిగిన ప్రదేశాలు,వారి జ్ఞాపకాలతో హాల్‌ను నవ్వులతో నింపేశారు. ఆనాటి లెక్చరర్ల బోధనా శైలిని, వారు చెప్పిన మంచి మాటలను ఈ సందర్భంగా గౌరవంగా స్మరించుకున్నారు.



# డాక్టర్ల గైర్హాజరీ.. నవజాత శిశువు మృతి..!

- **జహీరాబాద్ ఏరియా ఆస్పత్రిలో వైద్య సిబ్బంది నిర్లక్ష్యంపై కుటుంబ సభ్యుల ఆగ్రహం...**
- **ఆస్పత్రి ఎదుట బీజేపీ, బీఆర్ఎస్ నిరసన....**
- **ఆక్సిజన్ అందక శిశువు ప్రాణాలు కోల్పోయిందని ఆరోపణలు.. పోలీసులకు ఫిర్యాదు....**
- **కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పిన ఎమ్మెల్యే మాణిక్ రావు....**
- **వైద్య నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేసి జిల్లా కలెక్టర్ కు విచారణకై ఆదేశించిన ఎమ్మెల్యే...**

**జహీరాబాద్ వెలుతురు జూలై 05:**







సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ ఏరియా ఆస్పత్రిలో తీవ్ర విషాద ఘటన చోటుచేసుకుంది. డాక్టర్లు అందుబాటులో లేక నర్సులే ప్రసవం నిర్వహించడంతో పాటు, నవజాత శిశువుకు సకాలంలో ఆక్సిజన్ అందించడంలో నిర్లక్ష్యం వహించడంతో శిశువు మృతి చెందిందని కుటుంబ సభ్యులు తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ ఘటనపై ఆస్పత్రి ఎదుట బాధిత కుటుంబ సభ్యులు, బీజేపీ, బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఆందోళన చేపట్టగా కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండలం పోట్పల్లి గ్రామానికి చెందిన మనోహర అనే గర్భిణికి పురిటి నొప్పులు రావడంతో ఆదివారం ఉదయం సుమారు 7 గంటల సమయంలో డెలివరీ కోసం జహీరాబాద్ ఏరియా ఆస్పత్రికి తీసుకువచ్చారు. అయితే ఆ సమయంలో విధుల్లో డాక్టర్లు లేకపోవడంతో నర్సులే ప్రసవం నిర్వహించారని కుటుంబ సభ్యులు తెలిపారు.ప్రసవం అనంతరం పుట్టిన శిశువుకు శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు తలెత్తడంతో వెంటనే ఆక్సిజన్ అందించాలని సిబ్బందిని పలుమార్లు కోరినా పట్టించుకోలేదని వారు ఆరోపించారు. అనంతరం శిశువును ఆస్పత్రిలోని మొదటి అంతస్తుకు తీసుకెళ్లినా, అక్కడ కూడా ఆక్సిజన్ అందించే సిబ్బంది లేకపోవడంతో విలువైన సమయం వృథా అయి శిశువు ప్రాణాలు కోల్పోయిందని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు."ఉదయం నుంచే శిశువుకు ఆక్సిజన్ అవసరమని చెప్పినా ఎవరూ స్పందించలేదు. డాక్టర్లు లేరని ముందుగానే చెప్పి ఉంటే మరో ఆస్పత్రికి తీసుకెళ్లేవాళ్లం. ఆస్పత్రి సిబ్బంది నిర్లక్ష్యమే మా బిడ్డ ప్రాణాలు తీసింది" అంటూ బంధువులు కన్నీరుమున్నీరయ్యారు.ఘటనపై ఆగ్రహించిన బాధిత కుటుంబ సభ్యులు ఆస్పత్రి ఎదుట నిరసనకు దిగారు. వారికి బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు మద్దతు తెలిపారు. సమాచారం అందుకున్న జహీరాబాద్ టౌన్ ఏఎస్ఐ లవకుమార్ పోలీసు సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చి ఆందోళనకారులను శాంతింపజేశారు.అనంతరం జహీరాబాద్ ఎమ్మెల్యే కే. మాణిక్‌రావు, మాజీ డీసీసీబీ చైర్మన్ శివకుమార్ పార్టీ నాయకులతో కలిసి ఆస్పత్రిని సందర్శించి వైద్య సిబ్బందిని ఘటనపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రి రికార్డులను పరిశీలించి, వైద్య శాఖ ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడి ఘటనపై సమగ్ర విచారణ జరిపి, నిర్లక్ష్యం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఘటనపై జిల్లా కలెక్టర్ సమగ్ర విచారణ జరిపి, నిర్లక్ష్యం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

# జహీరాబాద్ ఏరియా ఆస్పత్రిలో నవజాత శిశువు మృతి ఘటనపై బీజేపీ ఆగ్రహం

- **సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని పట్టణ బీజేపీ అధ్యక్షుడు పూల సంతోష్ డిమాండ్**

**జహీరాబాద్ వెలుతురు జూలై 05:**





సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ ఏరియా ఆస్పత్రిలో నవజాత శిశువు మృతి చెందిన ఘటనపై భారతీయ జనతా పార్టీ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. డాక్టర్లు అందుబాటులో లేక నర్సులే ప్రసవం నిర్వహించారని, అనంతరం నవజాత శిశువుకు సకాలంలో ఆక్సిజన్ అందించడంలో నిర్లక్ష్యం జరిగిందని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్న నేపథ్యంలో, బాధిత కుటుంబ సభ్యులు ఆస్పత్రి ఎదుట నిరసన చేపట్టారు.ఈ విషయం తెలుసుకున్న జహీరాబాద్ పట్టణ బీజేపీ అధ్యక్షుడు పూల సంతోష్, బీజేపీ సీనియర్ నాయకుడు సుధీర్ బండారీ, బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్ మాజీ నరేష్ పాటిల్, 28వ వార్డు కౌన్సిలర్ బొగ్గుల సంతోష్‌తో పాటు పలువురు బీజేపీ నాయకులు ఆస్పత్రికి చేరుకుని బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి సంఘీభావం తెలిపారు.ఈ సందర్భంగా పూల సంతోష్ మాట్లాడుతూ, జహీరాబాద్ ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య సేవలు పూర్తిగా గాడితప్పాయని ఆరోపించారు. కుటుంబ సభ్యులు చెబుతున్న వివరాల ప్రకారం, డెలివరీ సమయంలో విధుల్లో డాక్టర్లు లేకపోవడం వల్ల నర్సులే ప్రసవం నిర్వహించడం అత్యంత నిర్లక్ష్యానికి నిదర్శనమని పేర్కొన్నారు.ప్రభుత్వ ఆస్పత్రిలో విధులు నిర్వహించాల్సిన కొందరు వైద్యులు తమ సొంత క్లినిక్‌లు, ప్రైవేట్ ఆస్పత్రులపైనే ఎక్కువ దృష్టి సారిస్తూ ప్రభుత్వ ఆస్పత్రి సేవలను నిర్లక్ష్యం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. దీనివల్ల పేద, నిరుపేద ప్రజలే తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ ఆస్పత్రుల పరిస్థితి రోజురోజుకు దిగజారుతోందని విమర్శించారు. నవజాత శిశువు మృతి ఘటనపై స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ, జిల్లా కలెక్టర్ వెంటనే జోక్యం చేసుకుని సమగ్ర విచారణ జరిపి, నిర్లక్ష్యానికి బాధ్యులైన అధికారులపై, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే మృతి చెందిన శిశువు కుటుంబానికి ప్రభుత్వం తక్షణ ఆర్థిక సహాయం అందించి అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# తుప్పు పట్టిన స్టార్టర్లతో ప్రజల ప్రాణాలకు ముప్పు

- **జహీరాబాద్‌లో తక్షణ చర్యలు తీసుకోవాలి....**
- **జాగో తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు పి. రాములు నేత....**

**జహీరాబాద్ వెలుతురు జూలై 5:**





సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మున్సిపల్ పరిధిలోని మంచినీటి బోర్ మోటార్ల స్టార్టర్లు తుప్పు పట్టి, నిర్వహణ లేక ప్రమాదకరంగా మారాయని జాగో తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు పి. రాములు నేత ఆరోపించారు. నెలలోనే పలుమార్లు స్టార్టర్లు కాలిపోతుండగా, వాటిని మరమ్మతు చేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శించారు.మంచినీటి బోర్లకు సమయపాలన లేకుండా 24 గంటలూ ప్రజలే మోటార్లను ఆన్, ఆఫ్ చేస్తున్నారని, స్టార్టర్ బోర్డులకు బటన్లు కూడా లేకపోవడంతో కట్టెపుల్లలతో స్టార్ట్ చేయాల్సిన పరిస్థితి నెలకొన్నదని తెలిపారు. అనేక చోట్ల విద్యుత్ వైర్లు బయటకు వేలాడుతుండటంతో ఎప్పుడు ప్రమాదం జరుగుతుందోనన్న భయంతో ప్రజలు నీరు తెచ్చుకుంటున్నారని అన్నారు.అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రతి ఏడాది స్టార్టర్ల మరమ్మతుల పేరుతో లక్షలాది రూపాయలు ఖర్చవుతున్నాయని, విద్యుత్ బిల్లులు కూడా భారీగా వస్తున్నాయని పేర్కొన్నారు. మరోవైపు పట్టణానికి సరఫరా అవుతున్న మంజీరా తాగునీటి పైప్‌లైన్లు మురికి కాలువలను దాటుతుండటంతో కలుషిత నీరు తాగునీటిలో కలిసే ప్రమాదం ఉందన్నారు. కొన్ని మ్యాన్‌హోల్స్‌కు మూతలు లేక మురికి చేరడం, గతంలో జంతువులు పడి కుళ్లిపోయిన ఘటనలు కూడా చోటుచేసుకున్నాయని గుర్తుచేశారు.వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని మంజీరా పైప్‌లైన్లు, మ్యాన్‌హోల్స్, బోర్ మోటార్ స్టార్టర్లను ప్రత్యేకంగా తనిఖీ చేసి, నాణ్యమైన స్టార్టర్ బాక్సులు ఏర్పాటు చేయాలని, బోర్ల నిర్వహణను మున్సిపల్ సిబ్బందితోనే చేపట్టేలా చర్యలు తీసుకోవాలని పి. రాములు నేత డిమాండ్ చేశారు. అలాగే పట్టణ ప్రజలకు సురక్షితమైన, నాణ్యమైన తాగునీటిని అందించి ప్రజారోగ్యాన్ని కాపాడాలని ప్రభుత్వాన్ని కోరారు.

# భద్రారెడ్డి దంపతుల సేవలు అభినందనీయం

- **బర్దిపూర్ దత్తగిరి ఆశ్రమంలో రాజగోపుర మహోత్సవం ఘనంగా....**

**జహీరాబాద్ వెలుతురు జూలై 05:**





హిందూ దేవాలయాల పరిరక్షణ, నూతన ఆలయాల నిర్మాణం ప్రతి ఒక్కరి బాధ్యత అని బర్దిపూర్ శ్రీ దత్తగిరి ఆశ్రమ పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ 1008 వైరాగ్య శిఖామణి అవధూత గిరి మహారాజ్, డాక్టర్ సిద్ధేశ్వరానందగిరి అన్నారు.ఆదివారం బర్దిపూర్ శ్రీ దత్తగిరి ఆశ్రమంలో సుమారు రూ.50 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన రాజగోపురాన్ని వేదోక్త పూజల నడుమ ఘనంగా ప్రారంభించారు. ధ్వజారోహణం, విశేష హోమాలు, యంత్రస్థాపన, మహాపూర్ణాహుతి, రాజగోపుర మహా కుంభస్థాపన వంటి కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం క్రేన్ సహాయంతో ఐదు కలశాలను రాజగోపుర శిఖరంపై ప్రతిష్ఠించి మహా మంగళహారతి సమర్పించారు.ఈ సందర్భంగా పీఠాధిపతులు మాట్లాడుతూ, హైదరాబాద్ నిజాంపేట్‌కు చెందిన సునీత–భద్రారెడ్డి దంపతులు అనేక దేవాలయాల నిర్మాణం, అభివృద్ధికి విశేషంగా సహకరిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడారు. బర్దిపూర్ గ్రామ అభివృద్ధికి మాత్రమే ఇప్పటివరకు కోటి రూపాయలకు పైగా విరాళాలు అందించడం వారి సేవాభావానికి నిదర్శనమని ప్రశంసించారు.కార్యక్రమం అనంతరం సునీత–భద్రారెడ్డి దంపతులను ఆశ్రమ పీఠాధిపతులు, గ్రామ పెద్దలు, భక్తులు ఘనంగా సన్మానించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని రాజగోపుర మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో వీక్షించారు.

# సైబరాబాద్ లో వీకెండ్–స్పెషల్ డ్రంక్ & డ్రైవ్.. 190 మంది పై కేసులు

**సైబరాబాద్ వెలుతురు జూలై 05:**



సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వీకెండ్ స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్ లో భాగంగా సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు విస్తృతంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారని సైబరాబాద్ ట్రాఫిక్ ADCP ట్రాఫిక్ I, జి హన్మంతరావుతెలిపారు.ఈ డ్రైవ్‌లో భాగంగా 190 మందిని అదుపులోకి తీసుకొని కేసులు నమోదు చేశారు.154 ద్విచక్ర వాహనదారులు,02 ఆటోలు,34 కార్లు, 00 హెవీ వాహనదారులపై కేసులు నమోదయ్యాయి.బ్లడ్ ఆల్కహాల్ కాన్సన్ట్రేషన్ (బిఎసి) ఆధారంగా కేసులను వర్గీకరిస్తే —158 మంది 36 ఎం జీ/100 ఎంఎల్ నుంచి 200 ఎం జీ/100 ఎంఎల్ మధ్య,– 16 మంది 201 ఎం జీ/100 ఎంఎల్ నుంచి 300 ఎం జీ/100 ఎంఎల్ మధ్య, – 16 మంది 301 ఎం జీ/100 ఎంఎల్ నుంచి 550 ఎం జీ/100 ఎంఎల్ మధ్య ఆల్కహాల్ సేవించి పట్టుబడ్డారు.వీరందరినీ చట్టపరంగా కోర్టుకు హాజరు పర్చనున్నట్లు సంబంధిత పోలీసులు అధికారులు తెలిపారు.మద్యం సేవించి డ్రైవింగ్ చేయటం తీవ్రమైన నేరమని సైబరాబాద్ పోలీసులు పునరుద్ఘాటించారు. మద్యం మత్తులో వాహనం నడిపి ప్రమాదానికి కారణమైతే, భారతీయ న్యాయ సంహిత –2023లోని సెక్షన్ 105 (కల్పబుల్ హోమిసైడ్ నాట్ అమౌంటింగ్ టు మర్డర్) కింద కేసు నమోదు చేస్తామని తెలిపారు. ఈ నేరానికి గరిష్ట శిక్ష 10 ఏళ్ల జైలు, జరిమానా విధించే అవకాశం ఉంది.గత వారం (29.06.2026 – 04.07.2026) లో 376 డ్రంక్ డ్రైవింగ్ కేసులను కోర్టులు పరిష్కరించాయి.10 మందికి జరిమానా, జైలు శిక్ష, 04 మందికి జరిమానా, సోషల్ సర్వీస్, 362 మందికి జరిమానా విధించబడినట్లు ట్రాఫిక్ పోలీస్ అధికారులు తెలిపారు.

# షాద్‌నగర్ పాల శీతలీకరణ కేంద్రం స్వర్ణోత్సవ వేడుకల్లో పాల్గొన్న మంత్రి వాకిటి శ్రీహరి

**షాద్‌నగర్ వెలుతురు జూలై 05:**





రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్య, యువజన సర్వీసులు & క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి గారు రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణంలో తెలంగాణ పాడి పరిశ్రమాభివృద్ధి సహకార సమాఖ్య లిమిటెడ్ (TDDCF) ఆధ్వర్యంలో నిర్వహించిన షాద్‌నగర్ పాల శీతలీకరణ కేంద్రం 60 సంవత్సరాల స్వర్ణోత్సవ వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరి గారు మాట్లాడుతూ, చిన్నప్పటి నుంచి పాడి పరిశ్రమ వాతావరణంలో పెరిగిన వ్యక్తిగా పాడి రైతుల కష్టసుఖాలు నాకు బాగా తెలుసన్నారు. ఇతర రైతులతో పోలిస్తే పాడి రైతులు ప్రతి రోజు వేకువజామునే లేచి ఎంతో కష్టపడి శ్రమిస్తారని తెలిపారు, వారి కుటుంబాల జీవన విధానం నాకు తెలుసని,వారి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం పూర్తి ప్రాధాన్యం ఇస్తుందని స్పష్టం చేశారు.విజయ డెయిరీ రాష్ట్ర ప్రజల సొత్తని, దానిని మరింత బలోపేతం చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. "విజయ డెయిరీని మనందరం కలిసి ముందుకు నడిపిద్దామని పిలుపునిచ్చారు. భవిష్యత్ తరాలకు నాణ్యమైన పాలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోందని మంత్రి పేర్కొన్నారు.దేశ వ్యాప్తంగా విజయ డెయిరీ ప్రస్తుతం ఐదో స్థానంలో నిలవడం గర్వకారణమని తెలిపారు. రాష్ట్రంలో రోజుకు మరో 25 లక్షల లీటర్ల పాల అవసరం ఉందని చెప్పారు. రాష్ట్రంలోనే పాల ఉత్పత్తిని పెంచి ఇతర రాష్ట్రాల నుంచి పాలు కొనుగోలు చేసే పరిస్థితిని పూర్తిగా నివారిస్తామని, పాడి పరిశ్రమ రంగంలో సమూల మార్పులు తీసుకొస్తామని స్పష్టం చేశారు.

పాడి రైతులకు బిల్లులు సకాలంలో చెల్లించే విషయంలో ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఈ అంశంపై ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్కతో చర్చించి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే పాడి రైతులకు రుణాలు, ఇతర సౌకర్యాల విషయంలో ఇప్పటికే బ్యాంకులతో చర్చలు జరిపినట్లు వెల్లడించారు."పాడి రైతులకు బయట కనిపించే లాభాల కంటే లోపల ఉండే కష్టాలు ఎక్కువన్నారు. కష్టమైన పనిని ఇష్టంగా చేస్తున్న పాడి రైతులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని తెలిపారు. వారికి గౌరవం తీసుకొచ్చేలా, తలెత్తుకొని జీవించేలా పాడి పరిశ్రమను తీర్చిదిద్దుతాం" అని మంత్రి శ్రీహరి గారు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర డెయిరీ డెవలప్‌మెంట్ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి, తెలంగాణ లైవ్‌స్టాక్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ చైర్మన్ చరణ్ కౌశిక్ యాదవ్, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ డా. గోపి, తెలంగాణ డెయిరీ డెవలప్‌మెంట్ మేనేజింగ్ డైరెక్టర్ చంద్రశేఖర్ రెడ్డి, శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, పాల ఉత్పత్తిదారులు మరియు తదితరులు పాల్గొన్నారు.

# ఆల్ఫా మజిల్ క్లబ్ బాడీ బిల్డింగ్ పోటీలకు ముఖ్య అతిథిగా ఎంబీ కృష్ణ యాదవ్

- **బిర్లా ప్లానిటోరియం హాల్‌లో ఆల్ఫా మజిల్ క్లబ్ ఆధ్వర్యంలో కార్యక్రమం**
- **ముఖ్య అతిథిగా పాల్గొన్న హైదరాబాద్ టీజీఓస్ అధ్యక్షుడు ఎం.బి. కృష్ణ యాదవ్**

**హైదరాబాద్ వెలుతురు జూలై 05:**




హైదరాబాద్‌లోని బిర్లా ప్లానిటోరియం హాల్‌లో ఆల్ఫా మజిల్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన బాడీ బిల్డింగ్ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి హైదరాబాద్ టీజీఓఎస్ అధ్యక్షుడు ఎం.బి. కృష్ణ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై విజేత బాడీ బిల్డర్లకు బహుమతులు అందజేశారు.ఈ సందర్భంగా కృష్ణ యాదవ్ విజేతలను అభినందిస్తూ.. యువత క్రీడలను ప్రోత్సహించాలని, ఆరోగ్యకరమైన జీవన శైలికి బాడీ బిల్డింగ్ వంటి క్రీడలు దోహదపడతాయని పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొన్న క్రీడాకారుల ప్రతిభను ప్రశంసించి, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ప్రముఖ క్రీడాకారుడు సంజీవ్ యాదవ్, గుడిసె రూబీ స్టీవెన్‌సన్, పిండిగా వెంకన్న, ఏఎంసీ చైర్మన్ కళ్యాణ్, శివ ప్రసాద్, విశాల్ నాయుడు, వెంకట్, నరేందర్ యాదవ్, విక్రమ్, సాయి యాదవ్, మహేష్, బీరెందర్, శివంత్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ జర్నలిస్టు అసోసియేషన్ టీ.జే.ఏ రాష్ట్ర కార్యవర్గ సమావేశాలకు ఆత్మీయ అతిథిగా WJI తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రాణా రజ్జు భయ్యా

**హైదరాబాద్ వెలుతురు జూలై 05:**




తెలంగాణ జర్నలిస్టు అసోసియేషన్ (టీజేఏ) రాష్ట్ర కార్యవర్గ సమావేశాలకు వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆఫ్ ఇండియా (WJI) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రాణా రజ్జు భయ్యా ఆత్మీయ అతిథిగా పాల్గొని ప్రసంగించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత రెండు దశాబ్దాలుగా టీజేఏ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పర లక్ష్మణ్ నాయకత్వంలో జర్నలిస్టుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ, వృత్తి గౌరవం కోసం సంఘం నిరంతరం పోరాట పంథాను అవలంబిస్తూ అనేక విజయాలు సాధించిందని కొనియాడారు. జర్నలిస్టుల సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తూ ప్రతి సందర్భంలో అండగా నిలిచిన ఉద్యమ నాయకుడు ఉప్పర లక్ష్మణ్ అని ప్రశంసించారు. ముఖ్య అతిథిగా వచ్చిన పెద్దలు దత్తాత్రేయ గారు వారు గవర్నర్ గా ఉన్న సందర్భంలో మన కుటుంబాల సంక్షేమం మరియు జర్నలిస్టులకు ఇండ్ల స్థలాల విషయంలో ముఖ్యమంత్రిలకు లేఖలు రాస్తూ మనకు పలుమార్లు సంఘీభావాన్ని తెలిపినటువంటి సందర్భాలను గుర్తు చేస్తూ వారికి కృతజ్ఞతలు తెలిపారు.రాష్ట్రవ్యాప్తంగా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు, రాష్ట్ర, జిల్లా నాయకత్వానికి భవిష్యత్ కార్యాచరణపై దిశానిర్దేశం చేసే ఈ సమావేశం అత్యంత కీలకమైందన్నారు. జర్నలిస్టుల ఐక్యతను మరింత బలోపేతం చేసే వేదికగా ఈ సమావేశం నిలవాలని ఆకాంక్షించారు.ఇటీవల అక్రిడిటేషన్ కమిటీలలో జిల్లా సభ్యులుగా ఎన్నికైన వారందరికీ, అలాగే జిల్లా కార్యవర్గ సభ్యులుగా కొత్త బాధ్యతలు చేపట్టిన నాయకులందరికీ హృదయపూర్వక అభినందనలు తెలిపారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారంలో నిష్పాక్షికంగా, పారదర్శకంగా వ్యవహరించి ప్రతి అర్హుడైన జర్నలిస్టుకు న్యాయం జరిగేలా కృషి చేయాలని సూచించారు.అక్రిడిటేషన్ కార్డులు, హెల్త్ కార్డులు, హౌసింగ్, బీమా, పెన్షన్, వెల్ఫేర్ ఫండ్, ప్రమాద బీమా, విద్యా సహాయం, అత్యవసర వైద్య సహాయం వంటి సంక్షేమ పథకాలు ప్రతి జర్నలిస్టుకు అందేలా ప్రభుత్వం ముందు ఉమ్మడిగా పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు.జిల్లాల్లో సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న జర్నలిస్టుల సమస్యలను ప్రాధాన్యతగా తీసుకొని, సంబంధిత అధికారులతో నిరంతర సమన్వయం ద్వారా త్వరితగతిన పరిష్కరించే దిశగా టీజేఏ డబ్ల్యూ జే ఐ సంయుక్త నాయకత్వంలో పనిచేయాలని పిలుపునిచ్చారు.ప్రజా సంబంధాల అధికారులు (డీపీఆర్‌వోలు), జిల్లా యంత్రాంగం, ఇతర ప్రభుత్వ శాఖలతో సత్సంబంధాలు కొనసాగిస్తూ జర్నలిస్టుల వృత్తి గౌరవాన్ని కాపాడే విధంగా వ్యవహరించాలని సూచించారు. అదే సమయంలో జర్నలిస్టుల హక్కులకు భంగం కలిగితే సంఘం ఐక్యంగా స్పందించి పోరాడేందుకు ఎప్పుడూ సిద్ధంగా ఉండాలన్నారు.నేటి డిజిటల్ యుగంలో యువ జర్నలిస్టులకు శిక్షణ, నైపుణ్యాభివృద్ధి, ఫ్యాక్ట్ చెకింగ్, డిజిటల్ మీడియా వినియోగం, నైతిక విలువల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు.వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆఫ్ ఇండియా (WJI) మరియు తెలంగాణ జర్నలిస్టు అసోసియేషన్ (టీజేఏ) గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలలో పరస్పర సమన్వయంతో కలిసి పనిచేస్తూ జర్నలిస్టుల సంక్షేమం, భద్రత, హక్కుల పరిరక్షణ కోసం ఐక్య కార్యాచరణ కొనసాగించాలని పిలుపునిచ్చారు.జర్నలిస్టుల సంక్షేమం కోసం చేపట్టే ప్రతి ఉద్యమానికి WJI తెలంగాణ రాష్ట్ర నాయకత్వం సంపూర్ణ మద్దతు అందిస్తుందని, జర్నలిస్టుల ఐక్యతే వారి అతిపెద్ద బలమని రాణా రజ్జు భయ్యా స్పష్టం చేశారు.

# కట్ట మైసమ్మ ఆలయంలో నవగ్రహ, గణపతి, శివలింగ ప్రతిష్ఠాపన మహోత్సవాలు వైభవంగా ముగింపు

**వనస్థలిపురం, వెలుతురు జులై 5:**

వనస్థలిపురం కప్పరాయి చెరువులోని శ్రీ కట్ట మైసమ్మ దేవాలయంలో జులై 1 నుంచి జులై 5 వరకు నిర్వహించిన నిత్య పూజలు, నవగ్రహ దేవతలు, గణపతి, శివలింగ ప్రతిష్ఠాపన మహోత్సవాలు ఆదివారం భక్తిశ్రద్ధల మధ్య అంగరంగ వైభవంగా ముగిశాయి. 5 రోజుల పాటు నిర్వహించిన ఈ ఆధ్యాత్మిక వేడుకలకు పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజల్లో పాల్గొని దేవతల ఆశీస్సులు పొందారు.మహోత్సవాల చివరి రోజు తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయానికి చేరుకుని నవగ్రహ దేవతలు, పరమశివుని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణం అంతా శివనామ స్మరణలు, భక్తి గీతాలు, మంత్రోచ్చారణలతో ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. వేద పండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక హోమాలు, అభిషేకాలు, అర్చనలు, మహామంగళహారతి నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నప్రసాదం పంపిణీ చేశారు.ప్రతిష్ఠాపన మహోత్సవాల సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో, పుష్పాలతో అందంగా అలంకరించడంతో భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. మహిళలు, యువత, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేసి కార్యక్రమాలు సజావుగా సాగేలా చర్యలు చేపట్టారు.ఈ సందర్భంగా ఆలయ కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ మహోత్సవాల విజయవంతానికి ఆర్థికంగా, సేవా కార్యక్రమాల రూపంలో సహకరించిన దాతలు, భక్తులు, స్థానిక ప్రజలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో కూడా ఆలయ అభివృద్ధి కార్యక్రమాలకు ఇదే విధంగా అందరూ సహకరించాలని కోరారు. ఆలయంలో నిత్య పూజలు నిరంతరం కొనసాగుతాయని, భక్తులు అధిక సంఖ్యలో వచ్చి అమ్మవారి, పరమశివుని ఆశీస్సులు పొందాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ బొమ్మిడి రంగారెడ్డి, ప్రధాన కార్యదర్శి ముద్దగౌని సుమన్ గౌడ్, ఆలయ సభ్యుడు బొమ్మిడి జంగారెడ్డి, ఆలయ పూజారి శ్రవణ్ కుమార్ శర్మ, ఆలయ కమిటీ సభ్యులు, దాతలు, స్థానిక ప్రముఖులు, మహిళలు, యువకులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.






# రాహుల్ గాంధీని ప్రధానిని చేసేందుకు తెలంగాణ మహిళా కాంగ్రెస్ సర్వశక్తులా కృషి చేస్తుంది

**జాతీయ అధ్యక్షురాలు అల్కా లంబా గారికి రంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు శ్రీజ్యోతి భీమ్ భరత్ హామీ**

**హైదరాబాద్ వెలుతురు జూలై 05:**

రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తెచ్చి, కాంగ్రెస్ నాయకుడు శ్రీ రాహుల్ గాంధీ గారిని దేశ ప్రధానిగా చూడాలన్నదే తమ ప్రధాన లక్ష్యమని, ఈ లక్ష్య సాధనకు తెలంగాణ మహిళా కాంగ్రెస్ సర్వశక్తులా కృషి చేస్తుందని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీమతి జ్యోతి భీమ్ భరత్ స్పష్టం చేశారు.తెలంగాణ రాష్ట్ర పర్యటనలో భాగంగా హైదరాబాద్‌కు విచ్చేసిన జాతీయ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీమతి అల్కా లంబా గారిని కలిసిన సందర్భంగా శ్రీజ్యోతి భీమ్ భరత్ ఈ హామీని ఇచ్చారు.

**ఉన్నత స్థాయి సమావేశం ఘనంగా నిర్వహణ**

తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీమతి ఎర్రవెల్లి స్వర్ణ గారి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో జాతీయ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అల్కా లంబా గారు ఉన్నత స్థాయి మహిళా కాంగ్రెస్ ప్రతినిధుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర, జిల్లా స్థాయి అధ్యక్షురాళ్లతో నేరుగా ముఖాముఖి సమావేశం ఏర్పాటు చేసి పార్టీ బలోపేతానికి వారు చేస్తున్న కృషిని అల్కా లంబా గారు ప్రశంసించారు.

**రంగారెడ్డి జిల్లా కృషిని అభినందించిన అల్కా లంబా**

ఈ క్రమంలో రంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీమతి శ్రీజ్యోతి భీమ్ భరత్‌ను కలిసిన అల్కా లంబా గారు, రంగారెడ్డి జిల్లా పరిధిలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో పార్టీని బలోపేతం చేసేందుకు, అలాగే పార్టీ రాష్ట్ర, జాతీయ నాయకత్వం పిలుపు మేరకు చేపట్టిన కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించినందుకు వ్యక్తిగతంగా అభినందించారు.జిల్లాలో మహిళా కాంగ్రెస్ ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకుని, పార్టీ బలోపేతానికి సంబంధించి పలు విలువైన సూచనలు చేశారు.

**ఓబీసీ కోటా కోసం ముందుండి పోరాటం చేయాలని పిలుపు**

రాబోయే రోజుల్లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టబోయే డీలిమిటేషన్ బిల్లులో ఖచ్చితంగా "ఓబీసీ కోటా" అమలు చేయాలని జాతీయ కాంగ్రెస్ నాయకత్వం చేస్తున్న పోరాటంలో తెలంగాణ మహిళా కాంగ్రెస్ ముందుండి నిలవాలని అల్కా లంబా గారు పిలుపునిచ్చారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ విజయానికి, రాహుల్ గాంధీ గారిని ప్రధానిని చేసేందుకు ప్రతి మహిళా కార్యకర్త ఇంటింటికి వెళ్లి పార్టీ విధానాలను వివరించాలని సూచించారు.

**సమావేశంలో పాల్గొన్న నాయకురాళ్లు**

ఈ ఉన్నత స్థాయి సమావేశంలో తెలంగాణ రాష్ట్ర ఇన్‌ఛార్జ్ శ్రీమతి కమలాక్షి, సహాయ ఇన్‌ఛార్జ్,మయూరి సింగ్ లతో పాటు రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాళ్లు, ప్రధాన కార్యదర్శులు, జిల్లా అధ్యక్షురాళ్లు మరియు పెద్ద సంఖ్యలో మహిళా నాయకురాళ్లు పాల్గొన్నారు.రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, 2026 ఎన్నికల్లో కాంగ్రెస్ విజయాన్ని సాధించేందుకు మహిళా కాంగ్రెస్ క్యాడర్ సిద్ధంగా ఉందని ఈ సందర్భంగా నాయకురాళ్లు తెలిపారు.



# ప్రేమ కోసం భారత్‌లోకి చొరబడ్డ పాక్ యువకుడు.. మానవత్వంతో తిరిగి అప్పగించిన భారత ఆర్మీ

- ప్రియురాలిని కలిసేందుకు భారత్‌లోకి చొరబడిన పాక్ ఆక్రమిత కాశ్మీర్ యువకుడు
- ఉరీ సెక్టార్‌లో నియంత్రణ రేఖ దాటుతుండగా అదుపులోకి తీసుకున్న భారత ఆర్మీ
- జీషన్ మీర్‌ను కమాన్ అమన్ సేతు వద్ద పాక్ ఆర్మీకి అప్పగించిన భారత సైన్యం
- భారతదేశంలో ఉన్నంతకాలం మానవత్వంతో చూసుకున్నామని చినార్ కార్ప్స్ వెల్లడి
- ఆన్‌లైన్ పరిచయం ప్రేమగా మారడంతో ప్రియురాలి కోసం భారత్‌కు వచ్చిన యువకుడు
- కశ్మీర్‌కు చెందిన యువతితో సోషల్ మీడియా ద్వారా పరిచయం ఏర్పడిన జీషన్
- మే 31న భారత్‌లోకి ప్రవేశించగా భద్రతా దళాలు అదుపులోకి తీసుకున్న ఘటన
- ప్రియుడి కోసం ఎదురుచూస్తున్న యువతినీ అదుపులోకి తీసుకున్న అధికారులు
- జులై 4న మధ్యాహ్నం పాక్ అధికారులకు యువకుడిని అప్పగించిన భారత ఆర్మీ
- మానవీయ విలువలు, వృత్తిపరమైన నిబద్ధతను చాటుకున్న భారత సైన్యం

**కశ్మీర్ వెలుతురు జూలై 05:**

ప్రియురాలిని కలిసేందుకు పాకిస్థాన్ ఆక్రమిత కాశ్మీర్ నుంచి భారత్‌లోకి చొరబడిన 22 ఏళ్ల యువకుడిని భారత ఆర్మీ తిరిగి పాకిస్థాన్ అధికారులకు అప్పగించింది. శనివారం కమాన్ అమన్ సేతు వద్ద భారత ఆర్మీ అధికారులు జీషన్ మీర్‌ను అధికారికంగా పాక్ ఆర్మీకి అప్పగించారు. ఈ విషయాన్ని చినార్ కార్ప్స్ ఇండియన్ ఆర్మీ సోషల్ మీడియా వేదికగా వెల్లడించింది.చినార్ కార్ప్స్ పోస్టు ప్రకారం.. 2026 మే 31న ఉరీ సెక్టార్‌లో నియంత్రణ రేఖ దాటుతుండగా పాకిస్థాన్ ఆక్రమిత కాశ్మీర్‌కు చెందిన జీషన్ మీర్‌ను భారత సైన్యం అదుపులోకి తీసుకుంది. అనంతరం 2026 జులై 4న మధ్యాహ్నం 12:24 గంటలకు కమాన్ అమన్ సేతు వద్ద అతడిని అధికారికంగా పాకిస్థాన్ ఆర్మీ అధికారులకు అప్పగించింది.

భారత్‌లో ఉన్న సమయంలో జీషన్ మీర్‌ను భారత సైన్యం ఎంతో గౌరవంగా, మానవత్వంతో, తగిన జాగ్రత్తలతో చూసుకుందని చినార్ కార్ప్స్ పేర్కొంది. భారత సైన్యానికి ఉన్న వృత్తిపరమైన నిబద్ధత, మానవీయ విలువలకు ఇది నిదర్శనమని తెలిపింది.పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోని ముజఫరాబాద్ ప్రాంతానికి చెందిన జీషన్ అహ్మద్ మీర్‌కు కొన్ని నెలల క్రితం కశ్మీర్‌లోని ఉరీ సెక్టార్‌కు చెందిన ఐరమ్ బానోతో ఆన్‌లైన్‌లో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం ప్రేమగా మారడంతో ఆమెను కలిసేందుకు భారత్‌లోకి రావాలని నిర్ణయించుకున్నాడు.ఈ నేపథ్యంలో మే 31 ఉదయం పాకిస్థాన్ నుంచి భారత్‌లోకి చొరబడిన జీషన్‌ను భద్రతా దళాలు వెంటనే అదుపులోకి తీసుకున్నాయి. అదే ప్రాంతంలో ప్రియుడి కోసం వేచి ఉన్న యువతి ఐరమ్ బానోను కూడా అధికారులు అదుపులోకి తీసుకున్నారు.



# 116 ఏళ్ల భక్తురాలికి శ్రీవారి వీఐపీ దర్శనం

- టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు ప్రత్యేక ఆదేశాలు
- కాలినడకన తిరుమలకు చేరిన వృద్ధురాలు
- సోమవారం వీఐపీ బ్రేక్ దర్శనం ఏర్పాటు కుటుంబ సభ్యులకు కూడా ప్రత్యేక దర్శనం
- వైరల్ వీడియో చూసి స్పందించిన టీటీడీ ఛైర్మన్
- వృద్ధురాలి వివరాలు సేకరించిన విజిలెన్స్ సిబ్బంది
- తమిళనాడుకు చెందిన నవనీతమ్మగా గుర్తింపు
- ప్రస్తుతం తిరుపతిలో బంధువుల వద్ద నివాసం
- అచంచల భక్తి అందరికీ స్ఫూర్తి అన్న బీఆర్ నాయుడు
- ఆయురారోగ్యాలు ప్రసాదించాలని శ్రీవారిని ప్రార్థించిన ఛైర్మన్

**తిరుపతి వెలుతురు జూలై 05:**

116 ఏళ్ల వయసులోనూ శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనం కోసం కాలినడకన తిరుమలకు చేరుకున్న వృద్ధ భక్తురాలు నవనీతమ్మకు టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు ప్రత్యేక దర్శనం ఏర్పాటు చేశారు. ఆమెతో పాటు కుటుంబ సభ్యులకు సోమవారం ఉదయం వీఐపీ బ్రేక్ దర్శనం కల్పించాలని ఆదేశించారు.ఈ విషయాన్ని బీఆర్ నాయుడు 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. 116 ఏళ్ల వయసులోనూ శ్రీవారి దర్శనం కోసం కాలినడకన తిరుమలకు చేరుకోవడం అచంచల భక్తికి నిదర్శనమని, ఆమె భక్తి ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. నవనీతమ్మకు శ్రీవారి అనుగ్రహంతో సంపూర్ణ ఆయురారోగ్యాలు కలగాలని ప్రార్థించారు.శనివారం అలిపిరి నడక మార్గంలో తిరుమలకు చేరుకున్న వృద్ధురాలి వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. తొలుత ఆమె కర్ణాటకకు చెందినవారని ప్రచారం జరిగినప్పటికీ, టీటీడీ ఛైర్మన్ స్పందించి వివరాలు తెలిసిన వారు తమ కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు.దీంతో టీటీడీ విజిలెన్స్ సిబ్బంది వృద్ధురాలి వివరాలు సేకరించారు. ఆమె తమిళనాడుకు చెందిన నవనీతమ్మ అని, ప్రస్తుతం తిరుపతి జీవకోనలోని బంధువుల వద్ద ఉంటున్నట్లు గుర్తించారు. ఈ సమాచారం అందిన వెంటనే బీఆర్ నాయుడు మరోసారి స్పందించి నవనీతమ్మతో పాటు ఆమె కుటుంబ సభ్యులకు సోమవారం ఉదయం వీఐపీ బ్రేక్ దర్శనం కల్పించాలని నిర్ణయించారు.





# యూట్యూబర్ ప్రశ్న రావణ్‌పై ఉపా కేసు

- గన్నవరం పోలీసుల అదుపులోకి..
- పలు సెక్షన్ల కింద కేసు నమోదు
- పవన్ కల్యాణ్‌పై వ్యాఖ్యల నేపథ్యంలో కేసు
- యూఏపీఏ సెక్షన్ 39 కింద నమోదు చేసిన పోలీసులు
- బీఎన్ఎస్‌లోని పలు సెక్షన్లు కూడా వర్తింపు
- ఆదివారం తెల్లవారుజామున గన్నవరానికి తరలింపు
- ప్రస్తుతం పోలీసుల అదుపులో ఉన్న రావణ్
- కేసుపై విచారణ
- కొనసాగిస్తున్న పోలీసులు
- సోషల్ మీడియా పోస్టులు, వ్యాఖ్యలపై దర్యాప్తు
- చట్టపరమైన ఆధారాలు సేకరిస్తున్న అధికారులు
- తదుపరి చర్యలకు పోలీసులు సిద్ధం

**ఆంధ్రప్రదేశ్ వెలుతురు జూలై 05:**

యూట్యూబర్ ప్రశ్న రావణ్ అలియాస్ బచ్చలకూరి జోసెఫ్‌పై చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం (యూఏపీఏ) కింద గన్నవరం పోలీసులు కేసు నమోదు చేశారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారనే ఆరోపణల నేపథ్యంలో ఈ చర్యలు చేపట్టారు. ప్రస్తుతం రావణ్ గన్నవరం పోలీసుల అదుపులో ఉన్నాడు.ఈ కేసు దర్యాప్తులో భాగంగా ఆదివారం తెల్లవారుజామున రావణ్‌ను గన్నవరం పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చినట్లు సమాచారం. అనంతరం పోలీసులు



ఆయనను విచారిస్తున్నారు. సోషల్ మీడియా వేదికగా చేసిన వ్యాఖ్యలు, పోస్టులు, ఇతర ఆధారాలను కూడా అధికారులు పరిశీలిస్తున్నట్లు తెలిసింది.రావణ్‌పై భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)లోని 147, 148, 152, 197, 197(1)(డి), 353(1)(బి) సెక్షన్లతో పాటు 1967 చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం (యూఏపీఏ)లోని సెక్షన్ 39 కింద కూడా కేసు నమోదు చేశారు. ఈ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తును ముందుకు తీసుకెళ్తున్నారు.కేసుకు సంబంధించిన అన్ని అంశాలపై సమగ్ర విచారణ జరుగుతోందని, సేకరించిన ఆధారాల ఆధారంగా తదుపరి చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. కేసు దర్యాప్తు కొనసాగుతున్న నేపథ్యంలో మరిన్ని వివరాలు అధికారికంగా వెల్లడించాల్సి ఉంది.

# ప్రత్యక్ష రాజకీయాల్లోకి ప్రశాంత్ కిశోర్

- బిహార్ బంకీపుర్ ఉప ఎన్నికలో జన్ సురాజ్ అభ్యర్థిగా బరిలోకి
- బంకీపుర్ నుంచి పోటీ చేయనున్న ప్రశాంత్ కిశోర్
- జన్ సురాజ్ పార్టీ అధికారిక ప్రకటన
- జులై 30న ఉప ఎన్నిక.. ఆగస్టు 3న ఫలితాలు
- రాజ్యసభకు వెళ్లిన నితిన్ నబీన్ రాజీనామాతో ఉప ఎన్నిక
- బీజేపీ అభ్యర్థిని ఇంకా ప్రకటించలేదు
- గత ఎన్నికల్లో జన్ సురాజ్‌కు ఒక్క సీటూ దక్కలేదు
- 238 స్థానాల్లో పోటీ చేసినా విజయం సాధించని పార్టీ
- ఓటమి తర్వాత మౌనవ్రతం చేపట్టిన ప్రశాంత్
- ఈసారి స్వయంగా ఎన్నికల బరిలోకి దిగుతున్న వ్యూహకర్త

**బీహార్ వెలుతురు జూలై 05:**

ఎన్నికల వ్యూహకర్తగా దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన జన్ సురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిశోర్ తొలిసారిగా ప్రత్యక్ష ఎన్నికల బరిలోకి దిగుతున్నారు. బిహార్‌లోని బంకీపుర్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికలో ఆయన జన్ సురాజ్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేయనున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మనోజ్ భారతీ ప్రకటించారు.బంకీపుర్ అసెంబ్లీ స్థానానికి ఈ నెల 30న ఉప ఎన్నిక జరగనుండగా, ఆగస్టు 3న ఫలితాలను ప్రకటించనున్నారు. గత ఎన్నికల్లో ఈ స్థానం నుంచి గెలిచిన బీజేపీ నేత నితిన్ నబీన్ అనంతరం ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి రాజ్యసభ సభ్యుడిగా ఎన్నిక కావడంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. బీజేపీకి బలమైన స్థావరంగా భావించే ఈ నియోజకవర్గానికి ఆ పార్టీ ఇంకా అభ్యర్థిని ప్రకటించలేదు.ఎన్నికల వ్యూహకర్తగా ఉన్న ప్రశాంత్ కిశోర్ జన్ సురాజ్ పార్టీని స్థాపించి గత బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేశారు. అయితే ఆయన స్వయంగా పోటీ చేయకపోయినా, పార్టీ తరఫున బరిలో నిలిచిన 238 మంది అభ్యర్థుల్లో ఒక్కరూ విజయం సాధించలేదు. మొత్తం 243 స్థానాల్లో 238 స్థానాల్లో పోటీ చేసినప్పటికీ పార్టీ ఖాతా కూడా తెరవలేకపోయింది.ఆ ఎన్నికల్లో ఎదురైన ఘోర పరాజయానికి నైతిక బాధ్యత వహిస్తూ ప్రశాంత్ కిశోర్ మౌనవ్రతం కూడా చేపట్టారు. ఇప్పుడు స్వయంగా ఎన్నికల బరిలోకి దిగడం రాజకీయంగా ఆసక్తికరంగా మారింది. కేంద్ర ఎన్నికల సంఘం ఇప్పటికే మూడు రాష్ట్రాల్లో ఉప ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేయగా, జులై 6న నోటిఫికేషన్ జారీ కానుంది.



# వర్షాకాల సన్నద్ధతపై జిల్లా స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించిన ఏసీఎల్‌బీ డా. కిరణ్మయి

**రంగారెడ్డి జిల్లా వెలుతురు జూలై 5:**

వర్షాకాలంలో ప్రజారోగ్యాన్ని పరిరక్షించేందుకు చేపట్టాల్సిన చర్యలపై ఏసీఎల్‌బీ డా. కిరణ్మయి ఆధ్వర్యంలో జిల్లా స్థాయి వర్షాకాల సన్నద్ధత సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్, జిల్లా అధికారులు, ఎంటమాలజిస్టులు, AMOCHలు మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు. సమావేశంలో డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా వంటి దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల నివారణకు చేపట్టాల్సిన చర్యలు, పారిశుద్ధ్య నిర్వహణ, యాంటీ లార్వల్ కార్యక్రమాలు, ఫాగింగ్, దోమల ఉత్పత్తి కేంద్రాల నిర్మూలన, వ్యాధుల పర్యవేక్షణ మరియు ప్రజల్లో అవగాహన కార్యక్రమాలపై విస్తృతంగా చర్చించారు.ఈ సందర్భంగా డా. కిరణ్మయి మాట్లాడుతూ, ప్రతి శాఖ సమన్వయంతో పనిచేస్తూ వర్షాకాల సన్నద్ధత చర్యలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు.

ప్రతి ఇంటి పరిసరాల్లో దోమల ఉత్పత్తి కేంద్రాలను గుర్తించి వెంటనే నిర్మూలించాలని, జ్వరాలపై ప్రత్యేక నిఘా ఉంచి అనుమానిత కేసులను సకాలంలో గుర్తించి అవసరమైన వైద్య సేవలు అందించాలని సూచించారు.అదేవిధంగా జిల్లా వైద్య మరియు ఆరోగ్య అధికారి డా. రాకేష్తో నిరంతర సమన్వయం కొనసాగిస్తూ అన్ని ఆరోగ్య కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేయాలని తెలిపారు.ప్రజలు కూడా తమ ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి, నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, జ్వరం లేదా ఇతర లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీప ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు.

# పల్లెటూరి రుచితో వంకాయ పచ్చికారం

## అప్పట్లో చుట్టాలు ఇంటికొస్తే పచ్చి కారంతో ఇలా చేసి పెట్టేవాళ్లు.. పల్లెటూరి మట్టివాసనతో కమ్మగా




మీరు ఈ పచ్చి కారంను వేడి వేడి అన్నంలో తింటే ఎంతో రుచిగా ఉంటుంది. నువ్వుల నూనెతో ఇంకా టేస్ట్ వస్తుంది. తినేటప్పుడు పల్లెటూరి మట్టివాసనతో అద్భుతంగా ఉంటుంది. అసలు లేట్ చేయకుండా దీనికి కావాల్సిన పదార్థాలు, ఎలా తయారు చేయాలో ఇక్కడ చదివి తెలుసుకుందాం..

పల్లెటూరి స్టైల్ వంకాయ పచ్చి కారం రెసిపీకి కావలసిన పదార్థాలు: 6 లేత వంకాయలు, 10 వెల్లుల్లి రెబ్బలు, 8 ఎండుమిర్చి , 5 పచ్చిమిర్చి , చిన్న నిమ్మకాయంత చింతపండు, ఒక టేబుల్ స్పూన్ జీలకర్ర , రుచికి తగినంత ఉప్పు, కొద్దిగా కొత్తిమీర, 3 టేబుల్ స్పూన్స్ నువ్వుల నూనెను తీసుకోవాలి.

పల్లెటూరి స్టైల్ వంకాయ పచ్చి కారం తాలింపు కోసం తీసుకోవాల్సినవి: ఒక టేబుల్ స్పూన్ ఆవాలు, ఒక టేబుల్ స్పూన్ మినపప్పు, ఒక టేబుల్ స్పూన్ సెనగపప్పు , నాలుగు ఎండుమిర్చి, 10 కరివేపాకు రెమ్మలు, కొద్దిగా ఇంగువను తీసుకోవాలి. దీనిని సరైన విధంగా చేస్తే రుచి అదిరిపోతోంది.

పల్లెటూరి స్టైల్ వంకాయ పచ్చి కారం రెసిపీ తయారీ విధానం: ముందుగా వంకాయలను కడిగి పెనం పైన్ మంచిగా కాల్చుకోవాలి. ఆ తర్వాత చల్లారిన తర్వాత తొక్క తీసి గుజ్జును తీసి ఒక ప్లేట్ లేదా గిన్నెలో పెట్టుకోవాలి. ఆ తరవాత చింతపండును 5 నిమిషాలు నానబెట్టి గుజ్జును తీసుకోవాలి. ఇలా చేస్తే ముక్క మగ్గుతుంది.

పల్లెటూరి స్టైల్ వంకాయ పచ్చి కారం రెసిపీ తయారీ విధానం స్టెప్ 1 : నాలుగు ఎండుమిర్చి, ఒక టేబుల్ స్పూన్ ను జీలకర్రను కొద్దిగా వేయించి చల్లారనివ్వాలి. ఆ తరవాత మిక్సీ తీసుకుని దానిలో వేయించిన నాలుగు ఎండుమిర్చి, నాలుగు వెల్లుల్లి, ఒక టేబుల్ స్పూన్ జీలకర్ర, రుచికి సరిపడా ఉప్పును వేసి బాగా దంచుకోవాలి

పల్లెటూరి స్టైల్ వంకాయ పచ్చి కారం రెసిపీ తయారీ విధానం స్టెప్ 2 : ఇప్పుడు కాల్చిన వంకాయ గుజ్జు, ఇంకా కొద్దిగా చింతపండు గుజ్జు కూడా వేసి కొంచం గరుకుగా రుబ్బుకోవాలి. ఒక చిన్న పాన్ లో కొద్దిగా నువ్వుల నూనె వేసి బాగా వేడయ్యాక ఆవాలు, మినపప్పు, శనగపప్పు, నాలుగు ఎండుమిర్చి, నాలుగు కరివేపాకు, ఇంకా ఇంగువతో పోపు పెట్టుకోవాలి.

# బీజేపీ అధికారంలోకి వస్తే ఫాతిమా...

(మొదటి పేజీ తరువాయి)



ఒవైసీ ఆధ్వర్యంలోని ఫాతిమా విద్యాసంస్థలపై ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని బండి సంజయ్ ప్రశ్నించారు. హైకోర్టు లేవనెత్తిన ప్రశ్నలకు స్పష్టమైన వివరణ ఇవ్వకుండా ప్రభుత్వం జాప్యం చేస్తోందని అన్నారు. చెరువును ఆక్రమించి విద్యాసంస్థలను నిర్మించడమే తప్పని పేర్కొన్నారు.గండిపేటలో ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్న ఇతర విద్యాసంస్థలకు వరుసగా నోటీసులు జారీ చేస్తున్న ప్రభుత్వం.. ఫాతిమా విద్యాసంస్థల విషయంలో మాత్రం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని నిలదీశారు. ఒవైసీకి ఒక న్యాయం, ఇతరులకు మరో న్యాయమా అని ప్రశ్నించారు.ఫాతిమా విద్యాసంస్థ మిలిటెంట్లకు ఆశ్రయం కల్పించిందనే ఆరోపణలను కూడా బండి సంజయ్ ప్రస్తావించారు. విద్యార్థులకు చదువు ముసుగులో మిలిటెంట్లను తయారు చేస్తున్నారా అని ప్రశ్నించారు. బీజేపీ అధికారంలోకి వస్తే ఫాతిమా విద్యాసంస్థలపై చట్టప్రకారం చర్యలు తీసుకుని అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తామని స్పష్టం చేశారు. అక్కడ చదువుతున్న విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చారు. అక్రమార్కులు, అవినీతి పరులకు భయమంటే ఏమిటో చూపిస్తామని బండి సంజయ్ పేర్కొన్నారు.

# మూడోసారి నేనే అధ్యక్షుడిని

- అమెరికా సైన్యాన్ని పునర్నిర్మించానని సభలో ప్రస్తావన
- దేశ సైనిక సామర్థ్యాల పెంపులో తన పాత్రను వివరించిన ట్రంప్
- ప్రపంచంలో అమెరికా అగ్రరాజ్యంగా ఎదగడం యాదృచ్ఛికం కాదని వ్యాఖ్య
- 2020 ఎన్నికల ఫలితాలను అంగీకరించని ట్రంప్ వైఖరి మరోసారి చర్చకు
- ఎన్నికల్లో అక్రమాలు జరిగాయని గత ఆరోపణలను మరోసారి గుర్తుచేసిన ట్రంప్
- క్యాపిటల్ హిల్ ఘటన నేపథ్యంలో ట్రంప్ వ్యాఖ్యలు మరోసారి రాజకీయ చర్చకు దారి

**అమెరికా వెలుతురు జూలై 05:**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. అమెరికా 250వ స్వాతంత్ర్య వేడుకల సందర్భంగా శనివారం నిర్వహించిన బహిరంగ సభలో ప్రసంగించిన ఆయన.. తాను మూడోసారి అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నానని వ్యాఖ్యానించారు. వాస్తవానికి ట్రంప్ ప్రస్తుతం రెండోసారి అధ్యక్ష పదవిలో ఉన్నప్పటికీ, 2020 అధ్యక్ష ఎన్నికల్లో తన విజయాన్ని జో బైడెన్ దోచుకున్నారని గతంలో చేసిన ఆరోపణలను మరోసారి పరోక్షంగా ప్రస్తావించారు.సభలో మాట్లాడుతూ.. "నిజానికి ఇప్పుడు నేను మూడోసారి అధ్యక్షుడిగా ఉన్నట్లే. కానీ వివాదాల జోలికి వెళ్లాలనుకోవడం లేదు కాబట్టి అలా అనను" అంటూ నవ్వుతూ వ్యాఖ్యానించారు. దీంతో సభలో నవ్వులు వెల్లువెత్తాయి.ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన దేశంగా అమెరికా ఎదగడం యాదృచ్ఛికం కాదని ట్రంప్ అన్నారు. తాను తొలిసారి అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత అమెరికా సైన్యాన్ని పునర్నిర్మించానని, దేశ సైనిక సామర్థ్యాలను మరింత బలోపేతం చేశానని పేర్కొన్నారు.2020 అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ ఓటమి పాలైనప్పటికీ, ఎన్నికల్లో అక్రమాలు జరిగాయని ఆయన ఎప్పటి నుంచో ఆరోపిస్తున్నారు. ఫలితాలను మార్చేందుకు పలు కీలక రాష్ట్రాల్లో న్యాయపరమైన పోరాటం చేసినా, తన ఆరోపణలకు అనుకూలంగా ఆధారాలు సమర్పించలేకపోయారు.అదే సమయంలో 2021 జనవరిలో జో బైడెన్ ఎన్నికను కాంగ్రెస్ ధ్రువీకరించే ప్రక్రియను అడ్డుకునేందుకు ట్రంప్ మద్దతుదారులు అమెరికా క్యాపిటల్ భవనంపై దాడికి పాల్పడ్డారు. ఆ ఘటనలో ట్రంప్ పాత్రపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో ఆయన తాజా వ్యాఖ్యలు అమెరికా రాజకీయాల్లో మరోసారి చర్చనీయాంశంగా మారాయి.

# 23 ఏళ్ల శ్రమ.. కొండను చీల్చిన సంకల్పం

## బిహార్ గయా జిల్లా కేట్టీ గ్రామానికి చెందిన రామ్‌చంద్ర యాదవ్ సాహసం- దశరథ్ మాంఝీ స్ఫూర్తితో 23 ఏళ్ల పాటు కొండను తొలిచిన ట్రక్ డ్రైవర్- 25 గ్రామాలకు కొత్త వెలుగులు



భార్య ప్రాణం కాపాడలేకపోయాననే బాధతో 22 ఏళ్ల పాటు కొండను తొలిచి రహదారి నిర్మించిన బిహార్‌కు చెందిన దశరథ్ మాంఝీ కథను ప్రపంచం అంత సులభంగా మర్చిపోదు. అయితే ఇప్పుడు అదే బిహార్‌లో మరో 'మౌంటెన్ మ్యాన్' తన అసాధారణ సంకల్పంతో అందరినీ ఆశ్చర్యపరిచారు. ఒక సాధారణ ట్రక్ డ్రైవర్, సరైన రహదారి లేక తన గ్రామ ప్రజలు అనుభవిస్తున్న కష్టాల్ని చూసి తన జీవితాన్నే పణంగా పెట్టాడు. చేతిలో సుత్తి, ఉలి తప్ప మరో యంత్రం లేదు. ఆర్థిక స్థోమత అంతకన్నా లేదు. అయినా రోజూ కొండను కొడుతూ 23 ఏళ్ల పాటు శ్రమించాడు. చివరకు అసాధ్యం అనుకున్న పనిని చేసి చూపించాడు. 25 గ్రామాల తలరాతే మార్చేశాడు. ఒకప్పుడు ఏ పనీ పాట లేకుండా ఇలా చేస్తున్నాడేంటీ పిచ్చోడు అంటూ ఎగతాళి చేసిన గ్రామస్థులే ఇప్పుడు ఆయన్ను గౌరవంగా 'మౌంటెన్ మ్యాన్ 2' అని పిలుచుకుంటున్నారు. ఆయనే రామ్‌చంద్ర యాదవ్.

గయా జిల్లాలో జన్మించిన రామ్‌చంద్ర యాదవ్‌కు చిన్నతనంలోనే తీవ్రమైన ఆటుపోటులు ఎదురయ్యాయి. ఆయన పదేళ్ల వయసులోనే తండ్రికి ఎవరో విషమిచ్చి చంపేశారు. దీంతో కుటుంబ పరిస్థితులు తలకిందులయ్యాయి. తర్వాత తన మేనమామ గ్రామమైన కేట్టీలో స్థిరపడ్డారు. అప్పట్లో ఆ గ్రామం చుట్టూ ఉన్న పెద్ద కొండ కారణంగా ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడటం గమనించారు రామ్‌చంద్ర. దీంతో అదే కొండ తన జీవిత లక్ష్యంగా మారిపోయింది. పెద్దయ్యాక ట్రక్ డ్రైవర్‌గా పనిచేస్తూ వచ్చిన రామ్‌చంద్రను రోజూ గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న కష్టాలు తీవ్రంగా కలచివేసేవి. ఊరికి సరైన రహదారి లేకపోవడంతో గర్భిణులు ఆస్పత్రికి సమయానికి చేరుకోలేక ప్రాణాలు కోల్పోయిన సందర్భాలూ ఉన్నాయి. అనారోగ్యంతో బాధపడుతున్న వారిని కొండ దాటించి ఆస్పత్రికి తీసుకెళ్లాల్సి వచ్చేది. విద్యార్థులు బడులకు, రైతులు మార్కెట్‌కు వెళ్లాలన్నా కొండల మీదుగా నడవడం తప్ప మరో మార్గం ఉండేది కాదు.

కూర్చుంటే కొండలు పగలవు– మాంఝీ చెప్పిన మాటతో

బిహార్‌కే చెందిన ప్రముఖ మౌంటెన్ మ్యాన్ దశరథ్ మాంఝీ కొండను తొలిచి రహదారి నిర్మించిన విషయం తెలుసుకున్న రామ్‌చంద్ర 1992లో ఒకసారి ఆయనను స్వయంగా కలిసి తన గ్రామ సమస్యను వివరించారు. 'మా ఊరికి కూడా మీరు రోడ్డు వేయండి' అని కోరగా మాంఝీ ఇచ్చిన సమాధానం రామ్‌చంద్ర జీవితాన్ని పూర్తిగా మార్చేసింది. 'నువ్వే ఎందుకు చేయవు. కూర్చుంటే కొండలు పగలవు' అని మాంఝీ చెప్పడంతో రామ్‌చంద్రలో పట్టుదల పెరిగింది. అలా సుమారు ఏడాది పాటు కొండను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత 1993లో రామ్ చంద్ర చేతిలో ఉలి, సుత్తి పట్టుకొని కొండ తొలిచే పని ప్రారంభించాడు. రోజూ ఉదయం గ్రామమంతా 'టన్– టన్– టన్' అనే శబ్దంతోనే మేల్కొనేది. మొదట్లో ఆ శబ్దాన్ని, ఆయనను చూసి జనం నవ్వుకున్నారు. 'ఇంకో పిచ్చోడు వచ్చాడు. 2 రోజుల్లో మానేస్తాడు' అంటూ ఎగతాళి చేశారు. కానీ అది ఒకటి, 2 రోజులతో ఆగలేదు. ఏళ్ల పాటు శ్రమించారు.

అయితే, రామ్‌చంద్ర పెద్దగా చదువుకోలేదు. సంతకం కూడా సరిగా చేయలేనని ఆయన చెబుతారు. అయినప్పటికీ తన సంకల్పాన్ని మాత్రం వదల్లేదు. 1993 నుంచి 2015 వరకు దాదాపు ప్రతి రోజూ కొండను కొడుతూనే వచ్చారు. పగలంతా శ్రమించి, రాత్రిళ్లు విశ్రాంతి తీసుకునేవారు. కుటుంబ పోషణ కోసం చేస్తున్న ట్రక్ డ్రైవింగ్ ఉద్యోగం కూడా వదిలేశారు. దీంతో కుటుంబం తీవ్ర పేదరికంలోకి వెళ్లింది. ఎన్నో రోజుల పాటు ఒకపూట భోజనమే చేసి, మరో పూట ఆకలితోనే నిద్రపోయిన సందర్భాలు ఉన్నాయని ఆయన కుమారుడు మున్నా కుమార్ చెబుతున్నారు.

### 25 గ్రామాలకు రాకపోకలు

అలా 23 ఏళ్ల నిరంతర శ్రమ తర్వాత రామ్‌చంద్ర సుమారు 15 నుంచి 30 అడుగుల ఎత్తున్న కొండను తొలిచి 15 అడుగుల వెడల్పుతో రహదారి నిర్మించారు. ఆ రహదారితో కేట్టీ, కతల్పురా, లోర్ గంట్టీ, కొలుహరా, ఇత్రా, బుంచార్, పియార్, నందూ బిఘా, నరహత్, రద్వానా, బద్వానా ఇలా దాదాపు 25 గ్రామాలకు రాకపోకలు సులభమయ్యాయి. ఇంతకుముందు గయా పట్టణానికి వెళ్లి రావాలంటే దాదాపు 7 కిలోమీటర్లు తిరగాల్సి వచ్చేది. ఇప్పుడు అది 3–4 కిలోమీటర్లకు తగ్గిపోయింది. ప్రస్తుతం రోజూ వందలాది వాహనాలు, స్కూల్ బస్సులు ఈ రహదారిగుండా ప్రయాణిస్తున్నాయి. దాదాపు లక్ష మందికిపైగా ప్రజలు దీని ద్వారా ప్రయోజనం పొందుతున్నట్లు గ్రామస్థులు చెబుతున్నారు.

2015లో రహదారి పూర్తయిన తర్వాత ప్రభుత్వం దానిని అభివృద్ధి చేస్తుందని రామ్‌చంద్ర ఆశించారు. కానీ అటవీ శాఖ ఆయనపై కేసు నమోదు చేసి జైలుకు పంపింది. అయినా ఆయన ఏ మాత్రం వెనక్కి తగ్గలేదు. ప్రస్తుతం అదే రహదారిని మరింత మెరుగుపర్చేందుకు (లెవెల్ చేసేందుకు) రోజూ ఉలి, సుత్తితో పనిచేస్తూనే ఉన్నారు.







# బియ్యం పురుగులు పడుతోందా? ఈ టిప్స్ పాటించండి..!

**బియ్యంలో పురుగులు పడటం ఎంతో సహజం. ముఖ్యంగా తెల్లపురుగుల కారణంగా బియ్యం పాడవుతూ ఉంటుంది. ఆ తర్వాత బియ్యం నుంచి పురుగులను వేరు చేయడం ఎంతో కష్టతరంగా ఉంటుంది. అయితే అసలు బియ్యంలో పురుగులు పడకుండా ఏం చేయాలి? ఎటువంటి చిట్కాలు పాటించాలి? తదితర విషయాలను ఈ కథనంలో తెలుసుకుందాం..**

**ఈ ఆకులను బియ్యంలో ఉంచండి..!**

బే ఆకులు బియ్యం పెట్టుకొనే కంటైనర్ లో ఉంచాలి. సహజంగా ఎండిన బే ఆకులు మార్కెట్ లో అందుబాటులో ఉంటాయి. వీటిని బియ్యం కంటెయినర్ లలో ఉంచాలి. ఓ నాలుగైదు ఆకులు ఉంచడం ద్వారా బియ్యం పురుగుపట్టే సమస్య తగ్గుతుంది. ఇక బియ్యం పురుగులు పట్టకుండా ఉండాలంటే లవంగాలు కూడా ఎంతో కీలకం. బే ఆకుల వలె, లవంగాలు ఒక ప్రత్యేకమైన సువాసనను కలిగి ఉంటాయి. ఇవి కూడా పురుగులను దూరంగా ఉంచుతాయి. వెల్లుల్లి నుంచి వచ్చే శక్తివంతమైన వాసన కారణంగా.. వెల్లుల్లి సహజ క్రిమి నిరోధకంగా కూడా పనిచేస్తుంది. మీ బియ్యం కంటైనర్‌లో కొన్ని పొట్టు తీసిన వెల్లుల్లి రెబ్బలను ఉంచడం వల్ల పురుగులను దూరంగా ఉంచొచ్చు. వేప ఆకులను తరచుగా సహజ క్రిమి సంహారకంగా ఉపయోగిస్తారు. ఈ ఆకులు కీటకాలను తిప్పికొట్టే చేదు వాసనను విడుదల చేస్తాయి. మీ బియ్యం నిల్వలో కొన్ని ఎండిన వేప ఆకులను జోడించడం వలన పురుగుల నుంచి బియ్యాన్ని రక్షించుకోవచ్చు. అది కూడా సహజసిద్ధమైన మార్గంలో ఎలాంటి కెమికల్స్ లేకుండా పురుగులను అరికట్టవచ్చు. వేప ఆకులను బియ్యంలో వేయడం వల్ల బియ్యం రుచి ఏ మాత్రం మారదు. అలాగే ఇంలాంటి అపాయము జరగదు. ఈ టిప్స్ పాటించడం ద్వారా బియ్యం పురుగు పట్టకుండా జాగ్రత్త వహించవచ్చు.





## మ్యాగీ ఇలా ట్రై చేసి చూడండి.. పిల్లలు అస్సలు వదిలిపెట్టరు

**ఇంట్లో ఏ టిఫిన్ అందుబాటులో లేకపోతే తల్లులకు ఠక్కున గుర్తొచ్చే బ్రేక్ ఫాస్ట్ ఐటమ్ మ్యాగీ. అయితే ఈ మ్యాగీని కూడా కొంచెం వెరైటీగా చేస్తే పిల్లలు ఇష్టంగా లాగించేస్తారు. అలా అని నిత్యం మ్యాగీ కూడా చేయొద్దు. ఎందుకంటే ఇదంత హెల్దీ బ్రేక్ ఫాస్ట్ కాదు. అయితే మ్యాగీని కొంచెం వెరైటీగా ఎలా చేయాలో ఈ కథనంలో తెలుసుకుందాం.. చిల్లీ గార్లిక్ మ్యాగీని పిల్లలకు చేసి పెట్టండి మరి.**

### చిల్లిగార్లిక్ మ్యాగీ తయారీకి కావాల్సిన పదార్థాలు

- పొట్టు తీసిన రెండు వెల్లుల్లి రెబ్బలు
- ఒక టీ స్పూన్ తరిగిన ఎండు మిరపకాయలు
- అర టీ స్పూన్ కారంపొడి
- అర టీ స్పూన్ మ్యాగీ మసాలా సాచెట్
- సన్నగా తరిగిన రెండు పచ్చిమిర్చి
- సన్నగా తరిగిన ఒక ఉల్లిపాయ
- ఒక టీ స్పూన్ సోయా సార్
- ఒక టీ స్పూన్ వైట్ వెనిగర్
- కొంచెం వంట నూనె

### చిల్లి-గార్లిక్ మ్యాగీ తయారు చేసుకునే విధానం

మీడియం సైజు పాన్ లో కొంత నీరు పోసి.. అందులోనే ఒక టీ స్పూన్ వంటనూనె వేయాలి. కొంత నీరు మరిగాక.. అందులో ఒక ప్యాకెట్ మ్యాగీని వేసి మరిగించాలి. మరీ మెత్తబడకుండా, కొంచెం గట్టిగానే ఉండేలా మరిగించుకోవాలి. తరువాత ఒక పెద్ద జల్లెడ తీసుకొని.. మ్యాగీని నీటిని వేరు చేయాలి.
ఇప్పుడు ఒక మిక్సీలో పైన పేర్కొనబడిన పదార్థాలన్నిటినీ బాగా మిక్సీ పట్టుకోవాలి. అన్ని బాగా మెత్తగా గ్రైండ్ అయినట్లు నిర్థారించుకున్న తరువాతే వాటిని మిక్సీ గిన్నెలో నుంచి బయటికి తీసేయాలి. ఇప్పుడు ఒక చిన్న గిన్నె తీసుకొని, అందులో కొంచెం నూనెను పోసుకోవాలి. అందులోనే కొన్ని వెల్లుల్లి రెబ్బలు వేసుకోవాలి. నూనె, వెల్లుల్లి వేడెక్కిన తరువాత అందులో మనం మిక్సీ పట్టుకొని ఉంచిన మిశ్రమాన్ని వేసుకోవాలి. ఆ మిశ్రమాన్ని, వెల్లుల్లి నూనెతో బాగా కలుపుకోవాలి. మిశ్రమం మొత్తం వెల్లుల్లికి, నూనెలో కలిసే విధంగా బాగా కలుపుకోవాలి. నూనె, మసాలా బాగా కలిసిపోయిన తరువాత అందులో మనం ముందుగానే వడగట్టిన మ్యాగీని వేసుకోవాలి. ఆ మ్యాగీకి మసాలా మొత్తం పెట్టుకునేలా బాగా కలుపుకోవాలి. అప్పుడే మ్యాగీకి సరైన ఫ్లేవర్ వస్తుంది. అదనపు క్రంచ్ కోసం మ్యాగీపై తెల్ల నువ్వులు, సన్నగా తరిగిన ఉల్లిపాయ ఆకులను వేసుకోవాలి. అనంతరం కాసేపు మీడియం మంట మీద ఉంచి, మ్యాగీని మంట నుంచి కిందకు తీసేస్తే సరి. వేడి వేడిగా, ఎంతో రుచికరమైన చిల్లిగార్లిక్ మ్యాగీ రెడీ అయిపోతుంది.





## మతిమరుపును తగ్గించుకొనే చిట్కాలివే..!

**తీవ్రమైన పని ఒత్తిడి, జీవనశైలిలో వస్తున్న మార్పులు, సమయానికి తిండి, నిద్ర లేకపోవడం వంటి కారణాలతో చాలా మందికి మతిమరుపు వచ్చేస్తోంది. అయితే ఈ మతిమరుపు సమస్య నుంచి ఎలా బయటపడాలో ఈ కథనంలో తెలుసుకుందాం.. జ్ఞాపకశక్తిని ఎలా పెంచుకోవాలి? తదితర విషయాలు ఈ కథనంలో తెలుసుకుందాం..**

**తగినంత నిద్ర పొందండి:**
నిద్రలేమి జ్ఞాపకశక్తిని బలహీనపరుస్తుంది. అందుకే రోజు 7 8 గంటల నిద్ర పోవడం అలవాటు చేసుకోండి. గింజలు, పండ్లు, కూరగాయలతో పాటు ఒమేగా3 కొవ్వు ఆమ్లాలు అధికంగా ఉండే ఆహారం జ్ఞాపకశక్తిని మెరుగుపరుస్తుంది.విటమిన్లు ఉండే ఆహార పదార్థాలను ఎక్కువగా తినండి.

**క్రమం తప్పకుండా వ్యాయామం చేయండి:**
వ్యాయామం మెదడులో రక్త ప్రవాహాన్ని పెంచుతుంది. అంతే కాకుండా జ్ఞాపకశక్తిని మెరుగుపరుస్తుంది. అందుకు వ్యాయామం చేయడం అలవాటు చేసుకోండి.

**ఒత్తిడిని తగ్గించుకోండి:**
ఒత్తిడి జ్ఞాపకశక్తిని బలహీనపరుస్తుంది. యోగా, ధ్యానం లేదా ఇతర ఒత్తిడిని తగ్గించే పనులను ప్రాక్టీస్ చేయండి.

**తగినంత నీరు త్రాగండి:**
శరీరంలో నీరు లేకపోవడం జ్ఞాపకశక్తిని కూడా ప్రభావితం చేస్తుంది. అందుకే ప్రతి రోజు 8 10 గ్లాసుల నీరు తాగండి.

**జ్ఞాపకశక్తిని మెరుగుపరిచే మార్గాలు..**
కొత్త విషయాలను నేర్చుకోండి: కొత్త భాషను నేర్చుకోండి. కొత్త సంగీత వాయిద్యాన్ని ప్లే చేయండి .లేదా కొత్త కళను నేర్చుకోండి. ఇది మెదడును చురుకుగా ఉంచుతుంది. పుస్తకాలు చదవడం వల్ల మెదడుకు పదును పెట్టి జ్ఞాపకశక్తి పెరుగుతుంది. చెస్, సుడోకు లేదా ఇతర మెదడును ఉత్తేజపరిచే ఆటలు ఆడండి. మీ ఆలోచనలు, అనుభవాలను వ్రాయండి. ఇది జ్ఞాపకశక్తిని బలపరుస్తుంది.






# ‘రామాయణ’లో నా పాత్ర చిన్నదే : కాజల్ అగర్వాల్

బాలీవుడ్ నటుడు రణ్‌బీర్ కపూర్, స్టార్ హీరో యశ్ ప్రధాన పాత్రల్లో, నితేశ్ తివారీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం ‘రామాయణ’. ఈ భారీ ప్రాజెక్టులో తాను మండోదరి పాత్రలో నటిస్తున్నట్లు నటి కాజల్ అగర్వాల్ తాజాగా వెల్లడించారు. అయితే, తొలి భాగంలో తన పాత్ర నిడివి తక్కువే ఉంటుందన్నారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో కాజల్ మాట్లాడుతూ.. సినిమా గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. ‘‘మేము ఇప్పటివరకు ‘రామాయణ’ మొదటి భాగానికి సంబంధించిన షూటింగ్ మాత్రమే పూర్తి చేశాం. ఈ సినిమాలో నేను మండోదరి పాత్ర పోషిస్తున్నాను. లంకలో వచ్చే సన్నివేశాలు తక్కువగా ఉంటాయి. కాబట్టి నా పాత్ర నిడివి సహజంగానే తక్కువగా ఉంటుంది. అయినప్పటికీ ఇలాంటి భారీ ప్రాజెక్టులో భాగం కావడం చాలా సంతోషంగా ఉంది. యశ్‌తో కలిసి స్క్రీన్ షేర్ చేసుకోవడం గొప్ప అనుభవం. యశ్ ఒక అద్భుతమైన నటుడు. సినిమా కోసం ఆయన బాగా శ్రమిస్తున్నారు. వృత్తిపట్ల యశ్ ఎంతో నిబద్ధత గల వ్యక్తి’’ అని కాజల్ పేర్కొన్నారు.

నమిత్ మల్హోత్రా నిర్మాణంలో తెరకెక్కుతున్న ‘రామాయణ’ రెండు భాగాలుగా ప్రేక్షకుల ముందుకు రానుంది. మొదటి భాగం 2026 దీపావళికి, రెండో భాగం 2027 దీపావళికి విడుదల కానున్నాయి. ఈ సినిమాలో రణ్‌బీర్, యశ్, సాయి పల్లవితో పాటు సన్నీ దేవోల్, రవి దూబే, రకుల్ ప్రీత్ సింగ్, అరుణ్ గోవిల్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇక, కాజల్ ప్రధాన పాత్రలో నటించిన డ్రామా థ్రిల్లర్ ‘ది ఇండియా స్టోరీ’ జులై 24న థియేటర్లలోకి రానుంది. చేతన్ డీకే దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో శ్రేయాస్ తల్పడే కీలక పాత్ర పోషించారు. మరోవైపు, గోపీచంద్ మలినేని దర్శకత్వంలో నందమూరి బాలకృష్ణ ప్రధాన పాత్రలో నటిస్తున్న ఓ సినిమాలోనూ కాజల్ కథానాయికగా అలరించనున్నారు.

# కల్యాణ్‌రామ్ ఫస్ట్‌లుక్‌తో సర్‌ప్రైజ్ చేసిన అనిల్ రావిపూడి




కథానాయకుడు నందమూరి కల్యాణ్‌రామ్ పుట్టినరోజు సందర్భంగా దర్శకుడు అనిల్ రావిపూడి ఆదివారం ఓ కొత్త పోస్టర్‌తో సర్‌ప్రైజ్ చేశారు. ప్రస్తుతం వెంకటేశ్, కల్యాణ్‌రామ్ కథానాయకులుగా అనిల్ ఓ చిత్రాన్ని తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాలో కల్యాణ్‌రామ్ పాత్రకు సంబంధించిన ఫస్ట్‌లుక్‌ను అనిల్ రావిపూడి ‘ఎక్స్’లో పంచుకున్నారు. తెలుగుదనం ఉట్టిపడే పంచెకట్టు, మెడలో పూలహారంతో ఉన్న కల్యాణ్‌రామ్ లుక్‌కు మంచి స్పందన వస్తోంది. ఈ సందర్భంగా కల్యాణ్‌రామ్‌కు అనిల్ రావిపూడి ప్రత్యేకంగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ‘‘నా తొలి హీరో, నా బెస్ట్ బడ్డీలలో ఒకరైన @NANDAMURIKALYAN గారికి హ్యాపీ బర్త్‌డే. డెబ్యూ డైరెక్టర్‌గా నాపై మీరు ఉంచిన నమ్మకానికి నేను ఎప్పటికీ కృతజ్ఞుడిని. #VenkyAnil5 #NKRAR2 చిత్రంతో మిమ్మల్ని ఒక కొత్త లుక్‌లో చూపించడానికి చాలా ఆసక్తిగా ఉన్నాను సర్. సంక్రాంతి 2027ని మరింత గ్రాండ్‌గా సెలబ్రేట్ చేద్దాం’’ అని ‘ఎక్స్’లో పోస్ట్ చేశారు.

ప్రతి సంక్రాంతికి ఒక సినిమాతో వస్తానంటున్న అనిల్ రావిపూడి వచ్చే ఏడాది కల్యాణ్‌రామ్, వెంకటేశ్ #VenkyAnil5 #NKRAR2తో పలకరించేందుకు సిద్ధమవుతున్న విషయం తెలిసిందే. ఈ సినిమాపై ఇప్పటికే అభిమానుల్లో మంచి అంచనాలు ఉన్నాయి. 2027 సంక్రాంతి లక్ష్యంగా ఈ చిత్రం విడుదల కానుంది.

# క్రేజీ కాన్సెప్ట్‌తో నాగదుర్గ ‘లవ్ ఓ లవ్’..

పవిశ్ నారాయణన్, తెలుగు నటి నాగదుర్గ ప్రధానపాత్రల్లో నటించిన న్యూఏజ్ లవ్ డ్రామా ‘లవ్ ఓ లవ్’. మహేశ్ రాజేంద్రన్ దర్శకుడు. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ మూవీ జులై 10న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా ఆదివారం చిత్ర ట్రైలర్ విడుదలైంది. అమ్మాయి ప్రేమను పొందడానికి అబ్బాయిలు ఎంత కష్టపడుతుంటారో మనం చూస్తూనే ఉంటాం. కానీ, ఇందులో అబ్బాయి కోసం అమ్మాయి కష్టపడితే ఎలా ఉంటుందో వినోదాత్మకంగా చూపించబోతున్నారు. హాస్యం, భావోద్వేగాల మిళితంగా కథ, కథనాలు తీర్చిదిద్దినట్లు ప్రచార చిత్రం చూస్తే అర్థమవుతోంది.




# ‘అకస్మాత్తుగా బిష్ణోయ్ అలా ఎలా జట్టులోకి వచ్చాడు..’

ఇటీవలే ఐర్లాండ్‌తో టీ20 సిరీస్ కోల్పోయిన టీమ్ ఇండియా తాజాగా ఇంగ్లాండ్‌తో జరుగుతున్న సిరీస్‌లోనూ స్థాయికి తగ్గ ప్రదర్శన చేయడం లేదు. తొలి టీ20 వర్షార్పణం కాగా, రెండో టీ20లో భారత్ 4 వికెట్ల తేడాతో ఓటమి పాలైంది. ఇంగ్లాండ్ బ్యాటర్ బెతెల్ (76★)విధ్వంసంతో ఆ జట్టు విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో నాలుగు ఓవర్లు బౌలింగ్ చేసిన రవి బిష్ణోయ్ 60 పరుగులు సమర్పించుకున్నాడు. ఇక కీలకమైన 17వ ఓవర్‌లో ఏకంగా 29 పరుగులు ఇచ్చాడు. దీంతో అప్పటిదాకా పట్టుబిగించినట్లు కనిపించిన భారత్.. చేజేతులా మ్యాచ్‌ను పోగొట్టుకుంది.



ఈ నేపథ్యంలో టీమ్ మేనేజ్‌మెంట్‌పై మాజీ టీమ్‌ఇండియా బ్యాటర్ కృష్ణమాచారి శ్రీకాంత్ విమర్శలు గుప్పించాడు. రవిబిష్ణోయ్‌ని టీమ్ మేనేజ్‌మెంట్ తుదిజట్టులోకి ఎలా తీసుకుందని ప్రశ్నించాడు. అతడు చాలా దారుణమైన ప్రదర్శన చేశాడని విమర్శించాడు. ఈ ఐపీఎల్‌లో రాజస్థాన్ రాయల్స్‌కు ప్రాతినిధ్యం వహించిన బిష్ణోయ్ అన్ని మ్యాచ్‌ల్లోనూ బరిలోకి దిగలేని విషయాన్ని గుర్తు చేశాడు. అతనికి బదులు కుల్‌దీప్ యాదవ్‌ను తీసుకొని ఉండాల్సిందన్నాడు.

‘‘బిష్ణోయ్ చాలా దారుణమైన ప్రదర్శన చేశాడు. కీలక సమయంలో శ్రేయస్ అయ్యర్ అతనికి బౌలింగ్ ఇచ్చి తప్పు చేశాడు. బిష్ణోయ్ బౌలింగ్‌ను బెతెల్ ఊచకోతకోశాడు. ఆ ఓవర్ మ్యాచ్ ఫలితాన్ని తేల్చింది. చేజేతులా ఇంగ్లాండ్‌కు మ్యాచ్‌ను అప్పగించేలా చేసింది. ఈ ఐపీఎల్‌లో బిష్ణోయ్ రాజస్థాన్ తరఫున కనీసం సగం మ్యాచ్‌ల్లోనూ బరిలోకి దిగలేదు. కానీ భారత జట్టులో అతనికి స్థానం లభించింది. ఇది అర్థం చేసుకోవడం చాలా కష్టం. 11 మంది ఆటగాళ్లలోంచి కుల్‌దీప్‌ను తప్పించడం చాలా పొరపాటు. అతను కొంతకాలంగా అద్భుతంగా బౌలింగ్ చేయలేదు కానీ బిష్ణోయ్ కంటే ముందే జట్టులో ఉండాల్సింది. బిష్ణోయ్ అకస్మాత్తుగా జట్టులోకి ఎలా వచ్చాడో ఎవరికీ తెలియదు. కేవలం గణాంకాలను చూసి ఎంపిక చేయడం సరైంది కాదు. అన్నివేళలా గణాంకాలను నమ్మలేము. గత కొంత కాలంగా చేసిన ప్రదర్శననే ఎంపిక చేయానికి ప్రామాణికంగా తీసుకోవాలి.

‘‘ఇంగ్లాండ్‌లో ఉన్న భిన్న పరిస్థితులకు ఇద్దరు స్పెషలిస్టు స్పిన్నర్లు వరుణ్ చక్రవర్తి, బిష్ణోయ్‌ను ఆడించాల్సిన అవసరం ఏముంది?దానికి బదులు ఇటీవల కాలంగా రాణిస్తున్న ప్రిన్స్ యాదవ్‌ను తీసుకోవాల్సింది. ఇప్పటికే జట్టులో వరుణ్, అక్షర్ రూపంలో ఇద్దరు స్పిన్నర్లు ఉన్నారు. మరో స్పిన్నర్ అవసరం ఏముంది? బిష్ణోయ్ కేవలం ఇండియాలోని పిచ్‌లపై మాత్రమే బాగా రాణించగలడు’’ అని శ్రీకాంత్ పేర్కొన్నాడు.

# వైభవ్ సూర్యవంశీ అరంగేట్రం..

## సోషల్ మీడియాలో తొలి పోస్టు వైరల్




ఐపీఎల్‌లో అదరగొట్టినప్పటికీ ఐర్లాండ్ సిరీస్‌లో యువ సంచలనం వైభవ్ సూర్యవంశీకి అవకాశం ఇవ్వకపోవడంతో టీమ్‌ఇండియా మేనేజ్‌మెంట్‌పై విమర్శలు వెల్లువెత్తాయి. మాజీ ఆటగాళ్లు, అభిమానులు వైభవ్‌కు మద్దతుగా నిలిచి ఇంగ్లాండ్‌తో (ENG vs IND) టీ20 సిరీస్‌లో ఆడించాలని డిమాండ్ చేశారు. దీంతో ఇంగ్లాండ్‌తో శనివారం జరిగిన రెండో టీ20లో వైభవ్ సూర్యవంశీకి ఆడే అవకాశం కల్పించారు. ఈ క్రమంలో భారత్ తరఫున అంతర్జాతీయ క్రికెట్ ఆడిన అత్యంత పిన్న వయస్కుడిగా వైభవ్ రికార్డులకెక్కాడు. ఈ మ్యాచ్‌లో సూర్యవంశీ 10 బంతుల్లో 14 పరుగులు చేసి వెనుదిరిగాడు. మ్యాచ్ ముగిసిన తర్వాత సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టాడు. ప్రస్తుతం అది వైరల్ అవుతోంది. తన ప్రయాణంలో తనకు మద్దతునిచ్చి, నమ్మకం ఉంచిన అభిమానులు, సహచర ఆటగాళ్లు, సీనియర్లకు ఈ యువ బ్యాటర్ కృతజ్ఞతలు తెలియజేశాడు.

‘‘మీ అందరి నుంచి వస్తున్న సందేశాలు చూసి నేను ఎంతో ఉద్వేగానికి లోనయ్యాను. నాకు ఎల్లప్పుడూ మద్దతుగా నిలుస్తూ ప్రేమాభిమానాలు చూపిస్తున్న నా సీనియర్లకు, శ్రేయోభిలాషులకు పేరుపేరునా ధన్యవాదాలు. నా దేశానికి ప్రాతినిధ్యం వహించే అవకాశం రావడం నా అదృష్టంగా భావిస్తున్నాను. ప్రతిసారీ నా జట్టు కోసం నా అత్యుత్తమ ప్రదర్శనను అందించడానికి ఎల్లప్పుడూ ప్రయత్నిస్తాను. అందరికీ ధన్యవాదాలు’’ అని వైభవ్ తన ఇన్‌స్టా స్టోరీలో రాసుకొచ్చాడు. తన తొలి మ్యాచ్‌లో భారీ స్కోరు చేయకపోయినప్పటికీ ఈ వండర్ కిడ్‌పై ఫ్యాన్స్ ప్రశంసలు కురిపిస్తున్నారు. రాబోయే కాలంలో వైభవ్ మరిన్ని అవకాశాలు అందుకుని భారీ ఇన్నింగ్స్‌లు ఆడతాడని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇంగ్లాండ్‌తో అరంగేట్రం చేసిన వైభవ్.. 37 ఏళ్లుగా సచిన్ తెందుల్కర్ పేరిట ఉన్న రికార్డును బ్రేక్ చేశాడు. శనివారం ఇంగ్లాండ్‌తో రెండో టీ20 ఆడేటప్పటికి వైభవ్ వయసు 15 ఏళ్ల 99 రోజులు మాత్రమే. 1989లో సచిన్ 16 ఏళ్ల 205 రోజుల వయసులో తొలి అంతర్జాతీయ మ్యాచ్ (పాకిస్థాన్‌తో టెస్టు) ఆడి రికార్డు నెలకొల్పాడు.

# మసూద్‌పై వేటు..

## మళ్లీ పాక్ టెస్టు కెప్టెన్‌గా బాబర్ అజామ్




పాకిస్థాన్ టెస్టు కెప్టెన్‌గా ఉన్న షాన్ మసూద్‌పై వేటు పడింది. అతడి స్థానంలో బాబర్ అజామ్‌ను సారథిగా నియమించారు. త్వరలో వెస్టిండీస్, ఇంగ్లాండ్‌తో జరిగే సిరీస్‌లకు పాక్ సెలక్షన్ కమిటీ జట్లను ప్రకటించింది. ఈ సిరీస్‌ల నుంచి బాబర్ అజామ్ నాయకత్వ బాధ్యతలు అందుకోనున్నాడు. షాన్ మసూద్ సారథ్యంలో పాకిస్థాన్ 16 మ్యాచ్‌లు ఆడి నాలుగింట మాత్రమే గెలిచింది. 12 మ్యాచ్‌ల్లో ఓడిపోయింది. బంగ్లాదేశ్ చేతిలో రెండుసార్లు వైట్ వాష్‌కు గురైంది. మసూద్ ఆటగాడిగా ఫర్వాలేదనిపిస్తున్నప్పటికీ కెప్టెన్‌గా విఫలం కావడంతో వేటు వేశారు.

ఇక, 2021–23 మధ్య కూడా బాబర్ అజామ్ పాక్ టెస్టు జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించాడు. అతని నాయకత్వంలో 20 మ్యాచ్‌లు ఆడిన పాక్.. 10 విజయాలు సాధించింది. ఆరింటిలో ఓడి నాలుగు మ్యాచ్‌లను డ్రాగా ముగించింది. అయితే, ఇటీవల బాబర్ టెస్టు ఫామ్ బాగోలేదు. 2022 నుంచి ఇప్పటివరకు టెస్టుల్లో అతను ఒక్క సెంచరీ కూడా చేయలేదు. అయినా మళ్లీ అతనికే సారథ్య బాధ్యతలు అప్పగించడం క్రికెట్ వర్గాల్లో చర్చనీయాంశమైంది. జులై 25 నుంచి పాక్ జట్టు వెస్టిండీస్‌తో రెండు టెస్టుల సిరీస్ ఆడనుంది. ఆగస్టు 19 నుంచి ఇంగ్లాండ్, పాక్ మధ్య మూడు టెస్టుల సిరీస్ మొదలుకానుంది.

Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com